

RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.


సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : | పేజీలు : 8 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | వెల : 4/-

# అన్నదాతలకు గుడ్‌న్యూస్
# మే నెల నుంచి రూ.20 వేలు !

- నేతన్నలకు ఉచితంగా విద్యుత్
- ఇల్లు కట్టుకునే వెనుకబడిన వర్గాలకు అదనంగా రూ.50 వేలు
- దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి రూ.10 వేలు, రూ.15 వేలు
- టీడీపీకి మొదట్నుంచీ వెన్నెముక బీసీ వర్గాలే
- బీసీలకు అనేక పథకాలు ప్రవేశపెట్టిన ఘనత టీడీపీదే అని వ్యాఖ్య
- ఏలూరు జిల్లా వడ్లమానులో బీసీ వర్గాలతో మాట్లాడిన సీఎం



బీసీలకు అనేక పథకాలు ప్రవేశపెట్టిన ఘనత టీడీపీదే అని సీఎం చంద్రబాబు అన్నారు. టీడీపీకి మొదట్నుంచీ వెన్నెముక బీసీ వర్గాలే అని చెప్పారు. బీసీల అభివృద్ధి, సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తామని, మోదీ, పవన్, తాను కలిసి వెనుకబడినవర్గాల అభ్యున్నతికి పని చేస్తున్నామని తెలిపారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం వడ్లమానులో బీసీ వర్గాలతో నిర్వహించిన ప్రజావేదికలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. అమరావతిలో

- మిగతా 2 లో

# ఓడిన చోటే గెలిచి చూపించా




2లో

- మంగళగిరిలో గెలవలేని వాడివి ఇంకేం మాట్లాడతావ్ అని ఎగతాళి
- ఓడిన చోట నుంచే అన్ని వర్గాల ప్రజల కోసం కష్టపడ్డా
- అవినీతిరహిత పాలనను చిత్తశుద్ధితో అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి
- మంగళగిరిలో నాలుగవ రోజు 'మన ఇల్లు-మన లోకేష్' కార్యక్రమం
- తాడేపల్లిలోని మహానాడు ప్రాంతానికి చెందిన 430 మంది పేదలకు శాశ్వత పట్టాలు పంపిణీ

# అన్నాడీఎంకేతో బీజేపీ పొత్తు



2లో

- అన్నాడీఎంకేకు ఎలాంటా షరతులు,డిమాండ్లు లేవు
- అన్నాడీఎంకే అంతర్గత వ్యవహారాల్లో జోక్యం ఉండదు
- తమిళనాడు బీజేపీ కొత్త అధ్యక్షుడుగా నైనార్ నాగేంద్రన్

## రజతోత్సవ వేడుకలకు
# అనుమతించేలా ఆదేశించండి

2లో

- హైకోర్టులో బీఆర్ఎస్ పిటిషన్
- రజతోత్సవ వేడుకలకు అనుమతివ్వాలని పిటిషన్
- విచారణ ఈ నెల 17కి వాయిదా
- బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలను హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించడానికి నిర్ణయం

## వచ్చే 3రోజులు తెలంగాణకు భారీ వర్ష సూచన
# కానీ పగలు మాత్రం ఎండలే!!






- తెలంగాణ వర్ష సూచన
- ఉరుములు మెరుపులతో కూడిన వానలు
- ఉదయం పూట సాధరణంగా ఉష్ణోగ్రతలు నమోదు
- పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం శుక్రవారం బలహీనపడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. దీనికి అనుబంధంగా ఉన్న ఉపరితల ఆవర్తనం అదే ప్రాంతంలో సగటు సముద్రమట్టం నుంచి 1.5 కి.మీ. ఎత్తులో కొనసాగుతోందని తెలిపింది. రాష్ట్రంలో మూడు రోజులు పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్ రావు తెలిపారు. రాగల మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణంగా కొనసాగే అవకాశం ఉందని వివరించారు.తెలంగాణకు ఆనుకొని ద్రోణి ఏర్పడిందని, ఉపరితల అవర్తనం కారణంగా రాష్ట్రంలో తేమ గాలులు వీస్తున్నాయని శ్రీనివాస్ తెలిపారు. అవి వీయటం వల్ల మేఘాలు ఏర్పడి సాయంత్రం వర్షాలు పడుతున్నాయని వివరించారు. తిరిగి ఉదయం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని తెలిపారు. రాబోయే మూడు, నాలుగు రోజుల పాటు ఇదే వాతావరణం ఉంటుందని పేర్కొన్నారు."రాజస్థాన్ నుంచి కోస్తాకు వెళ్తున్న ఉపరితల అవర్తనం కారణంగా తెలంగాణలో వానలు పడే అవకాశముంది. ఈ సమయంలో ఈదురుగాలులతో కూడిన వర్షాలు, జల్లులు పడతాయి. రాబోయే నాలుగు

- మిగతా 2 లో

# మొదటిపేజీ తరువాయి

## వచ్చే 3రోజులు తెలంగాణకు భారీ వర్ష సూచన



రోజులు కూడా గత 30 ఏళ్ల నుంచి ఉష్ణోగ్రతలకు అటుఇటుగా 1 డిగ్రీ పెరిగే అవకాశముంది." – శ్రీనివాస్, వాతావరణశాఖ అధికారిఅలా పిడుగులు ఏర్పడతాయి : ద్రోణి, ఉపరితల అవర్తనం కారణంగా తేమ గాలుల ప్రవేశించి వర్షాలు కురుస్తున్నాయన్న ఆయన వాతావరణంలోని వేడిని తగ్గించే అంత తేమ గాలులు వీయడం లేదని వివరించారు. మేఘాల్లో అనిశ్చతి ఏర్పడం, మరోవైపు తేమగాలులు నీటి బిందువులుగా ఏర్పడి, మంచుగా మారుతాయి, అప్పుడు వాటికి పాజిటివ్, నెగటివ్ ఛార్జీలు డెవలప్ అవుతాయని, దీని డిశ్చార్జీనే మెరుపు, పిడుగులు అంటారని తెలిపారు. ఈ సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.


## ఫ్యూచర్‌సిటీ వరకు మెట్రో విస్తరణ!



**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు**
**మెట్రో రైలు విస్తరణపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష**
**ఫ్యూచర్‌సిటీ వరకు మెట్రో విస్తరణకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశం**
**మెట్రో రెండో దశ ప్రతిపాదనలు, కేంద్ర అనుమతులపై చర్చించిన సీఎం**

ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో విస్తరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఫ్యూచర్‌సిటీ వరకు విస్తరణకు ప్రతిపాదనలు తయారు చేయాని సీఎం అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ మెట్రో విస్తరణపై రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. మెట్రో రెండో దశ ప్రతిపాదనలు, కేంద్రం అనుమతులపై అధికారులతో సీఎం చర్చించారు.

## ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణోత్సవం



ఒంటిమిట్ట రామాలయంలో శ్రీ సీతారాముల కల్యాణం జరుగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణాన్ని వేదిక ప్రాంగణంలోని 147 గ్యాలరీల్లోని 60,000ల మంది భక్తులు వీక్షిస్తున్నారు. ప్రతి గ్యాలరీలో పోలీసులు, పారామెడికల్, శ్రీవారి సేవకులు ఉండేలా టీటీడీ చర్యలు చేపట్టింది. కల్యాణ వేదిక వద్ద తలంబ్రాల పంపిణీకి తొలిసారిగా 28 కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తులకు తలంబ్రాలు, కంకణం, లడ్డూ, అన్నప్రసాదాలు అందిస్తున్నారు. అలాగే కాలినడకన వచ్చే భక్తుల కోసం 11 ప్రాంతాల్లో షెడ్లు ఏర్పాటు చేసినట్లు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. అదేవిధంగా షెడ్ల వద్ద చలివేంద్రం, పానకం, మజ్జిగ, కూలర్లు ఉండేలా చూస్తున్నామని తెలిపారు. ఆలయ సమీపంలో క్యూలైన్లలో వెళ్లే భక్తుల కోసం జర్మన్ షెడ్లు ఏర్పాటు చేశామన్నారు. సీతారాముల కల్యాణోత్సవం వీక్షించేలా 23 ఎల్ఈడీ స్క్రీన్లు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. 2,500 మంది పోలీసులు, 400 మంది టీటీడీ విజిలెన్స్ సిబ్బందితో భద్రత కల్పిస్తున్నామని చెప్పారు. ఆలయ పరిసరాల్లో 7 డ్రోన్లు, 130 సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నారు. ఒంటిమిట్టలో శ్రీ సీతారాముల కల్యాణం లైవ్?లో చూద్దాం.

## గోరంట్ల మాధవ్‌పై నాన్ బెయిలబుల్ కేసు నమోదు

పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు కిరణ్‌పై మాధవ్ దాడికి పాల్పడ్డిన మాజీ ఎంపీ, వైఎస్సార్సీపీ నేత గోరంట్ల మాధవ్?ను పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో గుంటూరు ఎస్పీ సతీశ్ కుమార్ గోరంట్ల అరెస్టు వివరాలు వెల్లడించారు. పోలీసుల విధులకు గోరంట్ల మాధవ్ ఆటంకం కలిగించారని ఎస్పీ తెలిపారు. ఇలా పోలీసుల విధులకు ఆటంకం కలిగించటం నేరపూరితచర్య అని పేర్కొన్నారు.ఎస్పీ కార్యాలయం వద్ద కూడా దాడి : చుట్టుగుంట వద్ద పోలీస్ వాహనాన్ని అనుచరులతో కలిసి మాధవ్ అడ్డుకున్నారని ఇంక మాధవ్‌తో పాటు మరో ఐదుగురు ఈ దాడిలో పాల్గొన్నారని ఎస్పీ తెలిపారు. అంతే కాకుండా ఎస్పీ కార్యాలయం వద్ద కూడా గోరంట్ల మాధవ్ దాడికి పాల్పడ్డారని తెలిపారు. ఈ నేపథ్యంలో మాధవ్‌పై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశామని అతనితో పాటు మరో ఆరుగురిని అరెస్టు చేశామని ఎస్పీ సతీశ్ కుమార్ తెలిపారు.పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు కిరణ్‌పై మాధవ్ దాడికి పాల్పడ్డి పోలీసుల విధులకు ఆటంకం కలిగించారు. ఇలా చేయడం నేరపూరితచర్య. చుట్టుగుంట వద్ద పోలీస్ వాహనాన్ని అనుచరులతో కలిసి మాధవ్ అడ్డుకున్నారు. మాధవ్‌తో పాటు మరో ఐదుగురు ఈ దాడిలో పాల్గొన్నారు. ఇంకా ఎస్పీ కార్యాలయం వద్ద కూడా దాడికి పాల్పడ్డారు. మాధవ్‌పై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశాం. మాధవ్‌తో పాటు మరో ఆరుగురిని అరెస్ట్? చేయడం జరిగింది.– సతీశ్ కుమార్, ఎస్పీ .వైఎస్సార్సీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్?ను గుంటూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చేబ్రోలు కిరణ్‌ను తీసుకెళ్తున్న వాహనాన్ని ఆయన అడ్డగించారు. అంతేకాక అతని అంతు చూస్తామని బెదిరించారు. కిరణ్‌ను మంగళగిరి నుంచి గుంటూరుకు తరలిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. గుంటూరు వరకూ పోలీసు వాహనాన్ని మాధవ్ వెంబడించారు. ఈ క్రమంలో విధులను అడ్డుకుంటున్నారని మాజీ ఎంపీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# అన్నదాతలకు గుడ్‌న్యూస్ మే నెల నుంచి రూ.20 వేలు !

మొదటిపేజీ తరువాయి



సివిల్స్ కోచింగ్ కేంద్రం: కార్పొరేషన్లు పెట్టి మరీ బీసీ కులాలకు మేలు చేస్తున్నామని, ఎన్టీఆర్ హయాంలో బీసీలకు గురుకుల పాఠశాలలు వచ్చాయని గుర్తు చేశారు. మత్స్యకార కుటుంబాలకు 9 గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశామని, విదేశాల్లో చదువుకునే వారికి రూ.15 లక్షలు సాయం చేస్తున్నామని అన్నారు. సివిల్స్, గ్రూప్స్ పరీక్షలు రాసే వారికి అండగా ఉన్నామని తెలిపారు. అమరావతిలో సివిల్స్ కోచింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని, బ్యాచ్‌కు 500 చొప్పున కోచింగ్ ఇస్తామని వెల్లడించారు. ఆదరణ–3 కింద ఏటా రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేస్తామని పేర్కొన్నారు.ఉచితంగా సోలార్ ప్యానెల్స్: ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామన్న చంద్రబాబు, నేతన్నలకు ఉచితంగా విద్యుత్ ఇస్తున్నామని తెలిపారు. ఇల్లు కట్టుకునే వెనుకబడిన వర్గాలకు అదనంగా రూ.50 వేలు ఇస్తామని, ఎస్సీలకు ఇంటిపై ఏర్పాటుకు ఉచితంగా సోలార్ ప్యానెల్స్ ఇస్తున్నామన్నారు. నూజివీడు నియోజకవర్గాన్ని ఇంకా అభివృద్ధి చేయాలని పార్థసారథిని కోరుతున్నానని అన్నారు. అప్పులు చేసి అవినీతి చేస్తే ఆ సమాజానికి మనుగడ ఉండదని, అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఉందని, ఖజానాలో డబ్బు లేదని తెలిపారు. తాను చేసిన పనులు చరిత్రలో ఎప్పటికీ ఉండిపోతాయన్న చంద్రబాబు, దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామని చెప్పారు.త్వరలో తల్లికి వందనం: రూ.64 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నామని, దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి రూ.10 వేలు, రూ.15 వేలు ఇస్తున్నామని వెల్లడించారు. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడ్డారంటే డ్వాక్రా సంఘాలే కారణమని, త్వరలో తల్లికి వందనం కింద ఆర్థిక సాయం చేస్తామని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా క్రమంగా జనాభా తగ్గిపోతోందని, ప్రతి కుటుంబానికీ పిల్లలే ఆస్తి అనేదాన్ని దంపతులు గుర్తించాలన్నారు. త్వరలో బీసీ సంరక్షణ చట్టం తీసుకొస్తామని చెప్పారు. టీడీపీ వచ్చాకే వెనకబడిన వర్గాలకు న్యాయం జరిగిందన్నారు.రైతులకు విడతలవారీగా రూ.20 వేలు: ఉద్యోగాల్లో 33, స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించామని, జిల్లాల వారీగా బీసీ భవన్లకు శ్రీకారం చుట్టామని తెలిపారు. తమ ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యత వెనకబడిన వర్గాల సంక్షేమమే అని చెప్పారు. ఈ ఏడాది లక్షమంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చడమే లక్ష్యమని, రైతులకు అండగా ఉంటామని, వాణిజ్య పంటలను ప్రోత్సహిస్తామని అన్నారు. మే నెల నుంచి రైతులకు విడతలవారీగా రూ.20 వేలు ఇస్తామని వెల్లడించారు.తప్పులు చేసేవారిపట్ల చండశాసనుడిగా ఉంటా: సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననం చేస్తే అదే వారికి చివరిరోజు అని హెచ్చరించారు. తప్పులు చేసేవారి పట్ల చండశాసనుడిగా ఉంటానని, వైఎస్సార్సీపీ హయాంలో రాష్ట్రంలో స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి లేదని మండిపడ్డారు. తప్పు చేసిన వారిని శిక్షించే బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందన్నారు.అంతకుముందు మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమంలో భాగంగా వడ్లమానులో కులవృత్తులు చేసుకునేవారి ఇళ్లకు వెళ్లి వారి సమస్యలను సీఎం చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆగిరిపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులోని ప్రజావేదిక వద్దకు చేరుకుని, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత అక్కడ వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సీఎం చంద్రబాబు పరిశీలించారు.

# రజతోత్సవ వేడుకలకు అనుమతించేలా ఆదేశించండి

మొదటిపేజీ తరువాయి

రజతోత్సవ వేడుకలకు అనుమతించేలా పోలీసులను ఆదేశించాలంటూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను హైకోర్టు 17వ తేదీకి వాయిదా వేసింది. హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, వరంగల్ కమిషనర్, కాజీపేట ఏసీపీకి నోటీసులు జారీ చేసిన హైకోర్టు, కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా ఆదేశించింది. బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలను హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించడానికి నిర్ణయించింది. వేడుకలు, సభ నిర్వహించుకోవడానికి అనుమతి ఇవ్వాలని బీఆర్ఎస్ నేతలు వరంగల్ పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు.వరంగల్ పోలీసులు అనుమతి నిరాకరించడంతో బీఆర్ఎస్ నేతలు హైకోర్టును ఆశ్రయించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు వేడుకలు, సభ నిర్వహించుకునేలా అనుమతి ఇచ్చేందుకు పోలీసులకు ఆదేశాలు జారీ చేయాలని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది కోర్టును కోరారు. కౌంటర్ దాఖలు చేయడానికి సమయం కావాలని హోంశాఖ తరఫు న్యాయవాది కోర్టును కోరారు.హోంశాఖ న్యాయవాదిని ప్రశ్నించిన హైకోర్టు : సభకు ఏర్పాట్లు చేసుకోవడానికి బీఆర్ఎస్ శ్రేణులకు సమయం కావాలి కదా అని హోంశాఖ న్యాయవాదిని హైకోర్టు ప్రశ్నించింది. శాంతిభద్రతల సమస్య, ఇంటిలిజెన్స్ రిపోర్టును పరిగణలోకి తీసుకొని అనుమతి ఇవ్వాల్సి ఉంటుందని, దీనికి సంబంధించిన వివరాలు సేకరించడానికి సమయం పడుతుందని హోంశాఖ న్యాయవాది కోర్టుకు తెలిపారు. 21వ తేదీ వరకు సమయం ఇవ్వాలని కోరగా దానికి నిరాకరించిన హైకోర్టు 17వ తేదీ వరకు సమయం ఇచ్చి కౌంటర్ దాఖలు చేయాలని హోంశాఖ న్యాయవాదిని ఆదేశించింది.

# ఓడిన చోటే గెలిచి చూపించా

మొదటిపేజీ తరువాయి




మంగళగిరిలో గెలవలేని వాడివి ఇంకేం మాట్లాడతావ్ అని ఎగతాళి చేశారని.. కొడుకుని కూడా గెలిపించుకోలేకపోయాడని చంద్రబాబును అవమానించారని మంత్రి లోకేష్ అన్నారు. ఓడిన చోట నుంచే అన్ని వర్గాల ప్రజల కోసం కష్టపడ్డానని తెలిపారు.అవినీతిరహిత పాలనను చిత్తశుద్ధితో అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. మంగళగిరిలో నాలుగవ రోజు 'మన ఇల్లు–మన లోకేష్' కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పేదలకు మంత్రి లోకేష్ శాశ్వత ఇంటి పట్టాలు అందజేశారు. భోజన విరామం అనంతరం తాడేపల్లిలోని మహానాడు ప్రాంతానికి చెందిన 430 మంది పేదలకు శాశ్వత పట్టాలు పంపిణీ చేశారు. దీంతో ఈరోజు మొత్తం 1030 పేద కుటుంబాలకు శాశ్వత ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బాధ, ఆవేదనతో పెరిగిన కసి నుంచే మంగళగిరి అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు.మంగళగిరిలో గెలవలేని వాడివి ఇంకేం మాట్లాడతావ్ అని ఎగతాళి చేశారని.. కొడుకుని కూడా గెలిపించుకోలేకపోయాడని చంద్రబాబును అవమానించారని అన్నారు. ఓడిన చోట నుంచే అన్ని వర్గాల ప్రజల కోసం కష్టపడ్డానని తెలిపారు. 91వేల మెజారిటీతో గెలిపించిన ప్రజలు తనపై ఇంకా బాధ్యత పెంచారన్నారు. 'నా గౌరవం, పరువు కాపాడిన మంగళగిరి ప్రజల్ని గుండెల్లో పెట్టుకుని ఏ లోటు లేకుండా చూసుకుంటా' అని స్పష్టం చేశారు. వెయ్యి కోట్ల రూపాయల ఆస్తిని మంగళగిరి ప్రజలకు ఆస్తిగా పంచుతున్నామన్నారు. స్వచ్ఛతతో సహా అన్ని రంగాల్లో మంగళగిరి నియోజకవర్గాన్ని నెంబర్ 1 స్థానంలో నిలబెట్టేందుకు కలిసి కట్టుగా పని చేద్దామని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు.కాగా.. ఈరోజు (శుక్రవారం) ఉదయం రత్నాలచెరువుకు చెందిన 600 మంది పేదలకు శాశ్వత పట్టాలు పంపిణీ చేశారు మంత్రి లోకేష్. ఆపై మాట్లాడుతూ.. లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ పేరిట నూతన విద్యా విధానానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. అత్యున్నత ప్రమాణాలతో తొలి ప్రభుత్వ లీప్ పాఠశాలను మంగళగిరిలో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఎన్డీఏ కూటమి ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని ఓ క్రమపద్ధతిలో నెరవేరుస్తోందన్నారు. ఇచ్చిన ప్రతీ హామీ నిలబెట్టుకుంటూ మీ లోకేష్ మీ ముందు నిలబడుతున్నారన్నారు. మంగళగిరి మంజూరైన ఆంధ్రప్రదేశ్‌లో తొలి 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రికి 13న శంకుస్థాపన చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్షంలో ఉండగానే మంగళగిరి కోసం సొంత ఖర్చులతో 26 సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తే.. అధికారంలో ఉండగా ఇంకెంత చేయగలనో ఆలోచించాలన్నారు. మంగళగిరిలో పోటీ చేయాలని 2019లో తీసుకున్న నిర్ణయం జీవితాన్నే మార్చేసిందని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

# అన్నాడీఎంకేతో బీజేపీ పొత్తు

మొదటిపేజీ తరువాయి



అన్నాడీఎంకేకు ఎలాంటా షరతులు, డిమాండ్లు లేవ అమిత్‌షా చెప్పారు. అన్నాడీఎంకే అంతర్గత వ్యవహారాల్లో తాము జోక్యం చేసుకోమని, పొత్తుల వల్ల అటు ఎన్డీయేకు, అన్నాడీఎంకే కూడా లబ్ధి చేకూరనుందని తెలిపారు.వచ్చే ఏడాది జరుగునున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులపై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా శుక్రవారంనాడు కీలక ప్రకటన చేశారు. తమిళనాడులో అన్నాడీఎంకే–బీజేపీ కలిసి పోటీ చేయాలని ఇరుపార్టీల నేతలు నిర్ణయించినట్టు ఆన ప్రకటించారు. ఈ ఎన్నికల్లో జాతీయ స్థాయిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, రాష్ట్ర స్థాయిలో అన్నాడీఎంకే నేత ఎడప్పాడి కె.పళనిస్వామి నాయకత్వంలో పోటీ చేయనున్నట్టు చెప్పారు.అన్నాడీఎంకేతో ఎలాంటా షరతులు, డిమాండ్లు లేకుండానే పొత్తులు కుదుర్చుకున్నట్టు అమిత్‌షా చెప్పారు. అన్నాడీఎంకే అంతర్గత వ్యవహారాల్లో తాము జోక్యం చేసుకోమని, పొత్తుల వల్ల అటు ఎన్డీయేకు, అన్నాడీఎంకే కూడా లబ్ధి చేకూరనుందని తెలిపారు.డీఎంకే అవినీతి, శాంతిభద్రతల పరిస్థితి, దళిత మహిళలపై అకృత్యాలు వంటి అంశాలపై వచ్చే ఎన్నికల్లో ప్రజలు తీర్పునివ్వనున్నారని అమిత్‌షా అన్నారు. డీఎంకే హయాంలో రూ.39,000 కోట్ల లిక్కర్ స్కామ్, ఇసుక మైనింగ్ స్కామ్, ఎల్కాట్ స్కామ్, ట్రాన్‌పోర్ట్ స్కామ్, మనీ లాండరింగ్ స్కామ్‌లు చోటుచేసుకున్నాయని, తమిళనాడు ప్రజలకు డీఎంకే, ఉదయనిధి స్టాలిన్, స్టాలిన్ సమాధానమివ్వాలన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే ఘన విజయం తథ్యమని అమిత్‌షా ధీమా వ్యక్తం చేశారు. చెన్నైలో జరిగి ఈ మీడియా సమావేశంలో బీజేపీ నేత కె.అన్నామలై, అన్నాడీఎంకే నేత ఎడప్పాడి పళనిస్వామి పాల్గొన్నారు.

# టీటీడీ గోశాలలో గోవులు మృతి చెందడం అవాస్తవం

**ప్రజలు నమ్మొద్దు: టీటీడీ**
**మృతి చెందిన గోవుల ఫొటోలు టీటీడీ గోశాలకు సంబంధించినవి కావు**
**కొంతమంది దురుద్దేశంతో ఆ ఫొటోల్లో ఉన్నవి టీటీడీ గోవులుగా చూపిస్తున్నారన్న టీటీడీ**



తిరుమల తిరుపతి దేవస్థానం గోశాలలో ఇటీవల గోవులు మృతి చెందాయంటూ కొంతమంది సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారం వాస్తవం కాదని టీటీడీ స్పష్టం చేసింది. మృతి చెందిన గోవుల ఫొటోలు టీటీడీ గోశాలకు సంబంధించినవి కావని తెలిపింది. కొంతమంది దురుద్దేశంతో ఆ ఫొటోల్లో ఉన్నవి టీటీడీ గోవులుగా చూపిస్తూ భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని వెల్లడించింది. ఇలాంటి అవాస్తవ ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని ఈ ప్రచారాన్ని ఖండిస్తున్నామని టీటీడీ తెలిపింది.

**తీవ్రంగా ఖండించిన మంత్రి లోకేశ్ :** టీటీడీ గోశాలలో ఆవులు మృతి చెందాయంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న నిరాధారమైన విషప్రచారాన్ని మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా ఖండించారు. ఆవులు మృతి చెందాయన్న వాదనలో ఎటువంటి నిజం లేదని స్పష్టం చేశారు. టీటీడీ ఇప్పటికే దీనిపై స్పష్టత ఇచ్చిందన్నారు. ప్రజల్ని తప్పుదారి పట్టించటానికి వైఎస్సార్సీపీ చేస్తున్న రెచ్చగొట్టే ప్రచారాలు భక్తులు నమ్మొద్దని లోకేశ్ కోరారు. రాజకీయ లబ్ధి కోసం పవిత్ర సంస్థల గురించి అబద్ధాలు వ్యాప్తి చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. వైఎస్సార్సీపీకి ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు.

**గోశాలపై దుష్ప్రచారం చేయడం దారుణం :** సోషల్ మీడియా వేదికగా తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అసత్యాలు ప్రచారం చేస్తున్నారని బీజేపీ నేత, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి ఆరోపించారు. ప్రజల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఎస్వీ గోశాలపై దుష్ప్రచారం చేయడం దారుణమన్నారు. ఈ మేరకు తిరుపతిలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడారు.గోశాలకు వస్తే చూపించడానికి సిద్ధం : ఎస్వీ గోశాలలో వంద గోవులు బక్కచిక్కి మృత్యువాత పడ్డాయని కొంతమంది చేసిన ఆరోపణలు వాస్తవం కాదన్నారు. శ్రీవారి భక్తులు ఇలాంటి అసత్య ప్రచారాలను నమ్మొద్దని భానుప్రకాష్ తెలిపారు. గోశాలలో గోవులన్నీ సురక్షితంగా ఉన్నాయన్నారు. కరుణాకర్ రెడ్డి గోశాలకు వస్తే చూపించడానికి మేము సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. రాజకీయ నిరుద్యోగిగా ఉన్న కరుణాకర్ రెడ్డి ఏదో ఒక విధంగా కూటమి ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలని, ప్రజల్లో మాపై ఉన్న నమ్మకాన్ని పోగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. భూమన కరుణాకర్ రెడ్డి చెప్పిన అబద్ధాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఐదేళ్ల వైఎస్సార్సీపీ పాలనలో ధార్మిక క్షేత్రమైన తిరుమలను ధనార్జన క్షేత్రంగా మార్చేశారని మండిపడ్డారు.

# బ్రాండ్ అనే కేసీఆర్ పేరు పెట్టా






తాను పుట్టిపెరిగిన నేల. తనకు ఎత్తు పల్లాలు నేర్పిన నేల.. స్వరాష్ట్రంలో అతని కళ్లముందే పదేండ్లలో వందేండ్ల అభివృద్ధిని చూసిన నేల ఇది. ఈ తెలంగాణ వైభవంపై ఎప్పటికైనా ఒక అద్భుతమైన పాటను అందించాలనేది రాకింగ్ రాకేశ్ కోరిక. అది తన మొదటి సినిమాతోనే తీరిపోయింది. యూట్యూబ్ నుంచి సోషల్ మీడియా వేదికల వరకూ ఎక్కడ చూసినా 'పదగతులు స్వర జతులు.. పల్లవించిన నేల..' అన్న పాట ఉర్రూతలూగిస్తున్నది. ఈ పాట పుట్టినిల్లు 'కేసీఆర్' (కేశవ చంద్ర రమావత్) సినిమా అయితే, అందులో హీరో రాకేశ్. తక్కువ బడ్జెట్‌లో తెరకెక్కిన ఈ సినిమాకు నిర్మాత కూడా అతనే. ఈ చిత్రంలోని పాటలు ఇప్పుడు తెలుగు రాష్ట్రాలను ఊపేస్తున్నాయి. తెలంగాణలోని మారుమూల గిరిజన తండాలోని లంబాడా సంస్కృతి మేళవింపులు, భావోద్వేగాలు కలగలసిన ఈ చిత్రం నేడు విడుదలైంది. ఈ సందర్భంగా

### రాకింగ్ రాకేశ్ 'జిందగీ'తో పంచుకున్న కబుర్లు ఆయన మాటల్లోనే..

మాది వరంగల్. మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబం. మా అమ్మ వంటలు చేస్తుంటుంది. నాకు మిమిక్రీ అంటే చిన్నప్పటి నుంచే ఆసక్తి ఉండేది. పదమూడో ఏట నుంచే మిమిక్రీ చేయడం ప్రారంభించాను. కాకతీయ యూనివర్సిటీలో మిమిక్రీలో డిప్లొమా చేశాను. అమ్మ కష్టం చూడలేక మధ్యలోనే చదువు మానేసి కళారంగం వైపు అడుగులు వేశాను. 2007లో హైదరాబాద్‌లో అడుగుపెట్టాను. ఒక చిన్న ఆఫీసులో బాయ్‌గా పనిచేస్తూ మిమిక్రీ ఆర్టిస్టుగా నా అదృష్టం పరీక్షించుకున్నాను. మొదటిసారిగా దూరదర్శన్‌లో 'నవ్వుల్ నవ్వుల్' కార్యక్రమంలో మిమిక్రీ చేశాను. వెంట్రిలాక్విజం కూడా చేసేవాణ్ని. 2008లో ఈటీవీలో 'ఆంధ్రావాలా', జెమినీలో 'నవ్వుల సవాల్' కార్యక్రమాల ద్వారా బుల్లితెర ప్రేక్షకులకు దగ్గరయ్యాను. పుట్టినరోజు ఈవెంట్స్‌లోనూ పాల్గొనేవాణ్ని. అలా సంపాదించిన డబ్బులు అమ్మకు పంపుతుండేవాణ్ని.

### ధన్‌రాజ్ పరిచయంతో..

'ఆర్కే న్యూస్' చానెల్‌లో యాంకర్‌గా అవకాశం వచ్చింది. 'మా జూనియర్స్'లో 'వాగుడుకాయ' అనే షోలో వెంట్రిలాక్విజం ప్రదర్శించాను. ఆ సమయంలో కమెడియన్ ధన్‌రాజ్ అన్నతో పరిచయమైంది. తర్వాత నా జీవితమే మారిపోయింది. 2013లో 'జబర్దస్త్' మొదలైంది. అప్పుడు ధన్‌రాజ్ అన్న అదుర్స్ రఘు (రోలర్ రఘు)ని కలవమని చెప్పారు. రఘన్న టీమ్‌లోనే నాకు అవకాశం వచ్చింది. 13 ఎపిసోడ్ల తర్వాత ఆయన వెళ్లిపోయారు. మళ్లీ ఖాళీగా ఉన్న నన్ను ధన్‌రాజ్ అన్న చేరదీశారు. ఆయనతో కలిసి పనిచేశాను. కంటెస్టెంట్ నుంచి టీమ్‌లీడర్ వరకు నా ప్రయాణం మీరంతా చూసిందే! అయితే జబర్దస్త్‌లో కొత్తగా పిల్లలతో కామెడీ చేయించడం మొదలు పెట్టాను. దేశ, విదేశాల్లో ఎన్నో ప్రదర్శనలు ఇచ్చాను. ఇదంతా నా శ్రమను గుర్తించి, నాకు అవకాశం ఇచ్చిన వారి వల్లే సాధ్యమైంది. వారందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు చెప్పుకొంటున్నాను.

### అమ్మ కోరిక..

జబర్దస్త్ సక్సెస్‌తో సినిమాల్లోనూ చిన్న చిన్న అవకాశాలు వచ్చాయి. మా అమ్మకు మాత్రం నేను హీరో అవ్వాలని ఉండేది. నావరకైతే సినిమాల్లో రాణిస్తే చాలు అనుకునేవాణ్ని. నాకు కథలు రాయడం, చెప్పడం, ఒక అంశాన్ని కొత్తగా ప్రజెంట్ చేయడం బాగా ఇష్టం. అందులో భాగంగానే 'కేసీఆర్' కథను అనుకున్నా. నా భార్య సుజాత ప్రోత్సాహంతో ఆ కథ ముందుకు వెళ్లింది. ఇది సినిమాగా రూపొందడానికి ఎందరో సహకరించారు. తనికెళ్ల భరణి గారు.. నా గురించి తెలిసి, ఒక్క రూపాయి తీసుకోకుండా నటించారు. స్క్రిప్ట్ విషయంలోనూ సహకారం అందించారు. ధన్‌రాజ్ అన్న చాలా సాయం చేశారు. మైమ్ మధు, తాగుబోతు రమేశ్, జోర్దార్ సుజాత, జబర్దస్త్ మిత్రులు ఇలా ఎందరో వెన్నుతట్టి నన్ను ప్రోత్సహించారు. సీనియర్ క్యారెక్టర్ ఆర్టిస్టు సత్యకృష్ణగారి కూతురు అనన్య కృష్ణన్ ఈ సినిమాలో హీరోయిన్. నేను వెళ్లి వారికి కథ చెప్పగానే వెంటనే ఒకే అన్నారు. లంబాడా ఆడబిడ్డలు ఎలా ఉంటారు, వారి మాట విధానం, ప్రవర్తన, సంప్రదాయాలు అన్నీ తను మాతోపాటు వచ్చి తెలుసుకుంది. ఇలా వీళ్లంతా కథను నమ్మి వచ్చారు.


### కేసీఆర్‌కు వీరాభిమాని..

కేసీఆర్ అనే పదం.. స్వరాష్ట్రాన్ని కాంక్షించిన ప్రతి తెలంగాణ వ్యక్తి గుండెలో నిలిచిపోయింది. రాష్ట్ర సాధనకు ముఖ్యకారణం ఆయన. అంతేకాదు 'మాది తెలంగాణ' అని రొమ్ము విరుచుకొని చెప్పుకొనేలా రాష్ట్రాన్ని అగ్రపథాన నిలబెట్టారు. అటువంటి గొప్ప వ్యక్తికి.. ఈ సినిమాలోని 'ఛోటా కేసీఆర్' వీరాభిమాని. ఈ చోటా కేసీఆర్ అల్లరి చేస్తాడు, నవ్విస్తాడు, కవ్విస్తాడు, ఏడ్పిస్తాడు! మొదట నేను ఈ కథ పట్టుకొని చాలామంది చుట్టూ తిరిగాను. కొందరికి నచ్చలేదు. ఈ ప్రయాణంలో నేను మాత్రమే దీన్ని చేయగలను అనిపించింది. అలా ఈ సినిమా పట్టాలెక్కింది. 'గరుడవేగ' అంజిగారు ఈ సినిమాకు దర్శకత్వం, సినిమాటోగ్రఫీ చేశారు. వారి సహకారం మర్చిపోలేనిది. ఈ సినిమాలో మా కథే హీరో! ఇందులో లంబాడాల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, భావోద్వేగాలు అన్నీ ఉన్నాయి.

### ఈ సినిమా ప్రేక్షకులను అలరించడంతోపాటు అవార్డులూ గెలుచుకుంటుందని నమ్ముతున్నా!

### అప్పుడే పిలుస్తారని అనుకోలేదు..

మొదటిసారి కేసీఆర్ సార్‌ను కలిసినప్పుడు నాకు కలిగిన అనుభూతిని మాటల్లో చెప్పలేను. ఈ సినిమా విడుదలై, విజయవంతం అయ్యాక సార్ నుంచి పిలుపు వస్తుందనుకున్నా! కానీ.. ఈ సినిమాలో 'పదగతులు స్వర జతులు' అనే పాట విని ఆయన నన్ను పిలవడం ఆశ్చర్యం, ఆనందం కలిగించాయి. ఆ పాటలో కొన్ని పదాలను ఆయనే రీ కన్‌స్ట్రక్షన్ చేసి, మళ్లీ రాయించడం నాకు చాలా గొప్పగా అనిపించింది. ఆయనొక విజ్ఞాన గని. సార్‌ను చూస్తేనే ఒక ధైర్యం వచ్చింది. 'కేసీఆర్' అనే టైటిల్ ఎందుకు పెట్టాల్సి వచ్చిందంటే.. నేను తీస్తున్నది ఒక చిన్న సినిమా. కానీ, నా సినిమా ప్రత్యేకంగా ఉండాలని, అది ఒక కోహినూర్ వజ్రంలా అందరికీ గుర్తుండిపోవాలనే ఆశతో.. తెలంగాణ సాధకుడు కేసీఆర్ గారి పేరు కలిసి వచ్చేలా 'కేశవ చంద్ర రమావత్' అనే టైటిల్ పెట్టా. 'కేసీఆర్' అనేది ఒక పేరు మాత్రమే కాదు. అదొక బ్రాండ్. కొన్ని పేర్లు ప్రపంచాన్నే కుదిపేశాయి. వాటిల్లో ఒకటి కేసీఆర్. ఒక ఎన్టీఆర్, ఒక ఎంజీఆర్, ఒక ఏఎన్నార్.. ఒక కేసీఆర్. ఈ లోకల్ బ్రాండ్స్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంది. ఈ మూడు అక్షరాలు చాలా పవర్ ఫుల్.



### మొత్తం మార్చేసింది..

నాకు అస్సలు ఇష్టంలేని పదం పెండ్లి. అలాంటిది సుజాత పరిచయంతో నా ఆలోచన్నీ మారిపోయాయి. అనుకోకుండా ఆమెతో పరిచయం, ప్రేమ, పెండ్లి అన్నీ మధురానుభూతులు. తను ఇప్పుడొక మంచి జీవిత భాగస్వామి. హెచ్ఎంటీవీలో ఆమె పని చేస్తున్నప్పుడు.. నన్ను ఇంటర్వ్యూకు పిలిచింది. అప్పుడు మా ఇద్దరి మధ్యా చిగురించిన స్నేహం.. అందమైన జీవితంగా రూపుదిద్దుకుంది. మాకు ఓ కూతురు. తన పేరు ఖ్యాతిక.

# నిప్పుకు చెద పట్టదు



తెలంగాణ ప్రాంత ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను చూడలేక, ప్రత్యేక రాష్ట్రం వస్తే తప్ప మన కష్టాలు తీరవని కేసీఆర్ భావించారు. అందుకే ఆయన ఉద్యమంలో ముందు నిలబడి, ప్రజలను భాగస్వాములను చేశారు. తద్వారా యావత్ ప్రపంచం తెలంగాణ వైపు చూసింది. తెలంగాణ ఉద్యమాన్ని తన భుజాల మీదకి ఎత్తుకున్న మహా మనీషి కేసీఆర్. అంతటి మహా మనీషిపై ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అవాకులు చెవాకులు పేలుతుండటం అత్యంత ఖండనీయం. నిజానికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో రాజభోగాలు అనుభవిస్తున్న ఏ ఒక్క నాయకుడూ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించలేదు. అసత్య ఆరోపణలతో ప్రజలను మభ్యపెట్టి అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ పార్టీ కేసీఆర్, కేటీఆర్‌లను టార్గెట్ చేసింది. ఎందుకంటే, అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ నాయకులకు కేటీఆర్ ఆ విషయాన్ని పదే పదే గుర్తుచేస్తుండటమే కారణం. ఆరు గ్యారెంటీలను నెరవేర్చకపోవడంతో కేటీఆర్ ప్రజల గొంతుకగా మారి కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోను గుర్తుచేస్తూ 420 హామీల లిస్ట్‌ను రిలీజ్ చేయడం, ప్రభుత్వాన్ని తరచూ ప్రశ్నిస్తుండటంతో ఆయన కాంగ్రెస్ పార్టీకి కొరకరాని కొయ్యలా మారారు. అధికారంలోకి వచ్చి నెల కూడా తిరగకముందే పౌర సరఫరాల శాఖలో రూ.వెయ్యి కోట్ల కుంభకోణంతో బోణీ చేసిన కాంగ్రెస్ బాగోతాన్ని కేటీఆర్ బట్టబయలు చేశారు. అమృత్ టెండర్ల పేరిట తన బామ్మర్దికి అడ్డగోలుగా దోచిపెట్టి రూ.2 వేల కోట్ల స్కాం చేస్తే దాన్ని బయటపెట్టారు. మూసీ సుందరీకరణ పేరుతో పేదల కడుపు కొట్టి తమ జేబు నింపుకోవాలని చూస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రశ్నించినందుకు కేటీఆర్ టార్గెట్ అయ్యారు. పొంగులేటి ఇంట్లో ఈడీ దాడులు జరిగి నెల గడుస్తున్నా మోదీ భక్తులు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించినందుకు కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నారు. కాంగ్రెస్, బీజేపీల చీకటి ఒప్పందాన్ని ప్రశ్నిస్తున్నందుకు కేటీఆర్ టార్గెట్ అయ్యారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పేరిట చేస్తున్న రూ.4 వేల కోట్ల స్కామ్‌ను ప్రజల ముందు పెట్టినందుకు కేటీఆర్ టార్గెట్ అయ్యారు. హైదరాబాద్‌కు తాగునీరు తీసుకువచ్చే ప్లాన్ పేరిట, ప్రాజెక్టు ప్లాన్ మార్చి ప్రజల సొమ్ము రూ.4 వేల కోట్లు కొట్టేయాలని చూస్తున్న రేవంత్ ప్రభుత్వ తీరును ఎండగట్టినందుకు కేటీఆర్ టార్గెట్ అయ్యారు. ధాన్యం కొనాలంటూ నెలరోజులుగా కల్లాల వద్ద కర్షకులు పడిగాపులు కాస్తుంటే, సమీక్ష చేసి సమస్యను పరిష్కరించే సమయం సీఎం రేవంత్‌కు లేదు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో రోగాల పాలవుతుంటే వెళ్లి పరామర్శించే తీరికా ఆయనకు లేదు. కానీ అడుగడుగునా తన అవినీతిని, ప్రభుత్వ అసమర్థతను ఎండగడుతున్న కేటీఆర్‌ను వెంటనే ఏదో ఒక కేసులో ఇరికించి జైలు పాలు చేయాలని మాత్రం ఉత్సాహంగా ఉన్నారు. ఫార్ములా ఈ-రేస్‌లో ఎలాంటి అవినీతి జరగకపోయినా కేటీఆర్ మీద కేసు పెట్టేందుకు అనుమతి ఇవ్వాలని గవర్నర్ దగ్గరికి వెళ్లటానికి మాత్రం ముఖ్యమంత్రికి సమయం ఉన్నది. నాడు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలను తీసుకువచ్చేందుకు గాను అహర్నిశలు కృషిచేయడమే కేటీఆర్ చేసిన నేరమా? కేటీఆర్ ఒక ఉద్యమ నాయకుడు. ప్రజల పక్షాన పోరాడే తత్త్వం అతని రక్తంలోనే ఉన్నది. రేవంత్‌రెడ్డి ఎన్ని ఆరోపణలు చేసినా, ఎన్ని అక్రమ కేసులు పెట్టాలని చూసినా కేటీఆర్ భయపడే వ్యక్తి కాదు. నిప్పుకు చెద పట్టదనేది ఎంత నిజమో కేటీఆర్ నిజాయితీపరుడనేది కూడా అంతే నిజం.

# నిధులిచ్చేదెవరు? పంపిణీ చేసేదెలా?



అజర్‌బైజాన్‌లోని బాకులో 196 దేశాలతో కూడిన కాన్ఫరెన్స్ ఆఫ్ ది పార్టీస్ (కాప్) 29వ సదస్సు ఇటీవల ప్రారంభమైన విషయం విదితమే. నవంబర్ 11న మొదలైన ఈ సదస్సు నవంబర్ 22 వరకు కొనసాగనున్నది. వాతావరణ మార్పులకు సంబంధించి పెట్టుబడుల సమీకరణే ప్రధానాంశంగా కొనసాగుతున్న ఈ సదస్సును 'క్లైమేట్ ఫైనాన్స్ కాప్' అని కూడా పిలుస్తున్నారు. గ్లోబల్ వార్మింగ్‌ను 1.5 డిగ్రీలకు పరిమితం చేయడం, న్యూ కలెక్టివ్ క్వాంటిఫైడ్ గోల్ ఆన్ క్లైమేట్ ఫైనాన్స్ (ఎన్‌సీక్యూజీ)కు భవిష్యత్తులో అవసరమైన పెట్టుబడులను సమకూర్చుకోవడమే ఈ సదస్సు ప్రధాన లక్ష్యం. అయితే, సంపన్న దేశాల వాటా పెంచాలని అభివృద్ధి చెందుతున్న దేశాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో నిధులు సమకూర్చేదెవరు? ఆ నిధులను ఎలా పంపిణీ చేయాలి? అన్నది ఇప్పుడు అందరి మెదళ్లను తొలుస్తున్న ప్రశ్న. భూతాప సమస్యను పరిష్కరించేందుకు గానూ కర్బన ఉద్గారాలను తగ్గించి, పర్యావరణ అనుకూల ఇంధనం వైపు మళ్లడం కోసం అభివృద్ధి చెందుతున్న, పేద దేశాలకు సంపన్న దేశాలు ఏటా 100 బిలియన్ డాలర్ల ఆర్థిక సాయం ఇచ్చేలా 2009లో ఒప్పందం జరిగింది. అయితే, ఆ మొత్తం ఏ మాత్రం సరిపోవడం లేదని, ఆర్థిక సాయాన్ని ఏటా 1 ట్రిలియన్ డాలర్లకు పెంచాలని అభివృద్ధి చెందుతున్న దేశాలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నాయి. ఏటా 1-1.3 ట్రిలియన్ డాలర్లు లేదా 2030 నాటికి 5-6.9 ట్రిలియన్ డాలర్ల వరకు ఆర్థిక సాయం అందించాలని అరబ్ దేశాలతో పాటు ఆఫ్రికన్ గ్రూప్ దేశాలు సూచిస్తున్నాయి. కానీ, అభివృద్ధి చెందిన దేశాల వాదన మరోలా ఉన్నది. ఆయా దేశాల్లో నెలకొన్న ఆర్థికపరమైన ఇబ్బందులను అవి ఎత్తిచూపుతున్నాయి. చైనా సహా గల్ఫ్ దేశాలు కూడా ఆర్థిక సాయం చేసే దేశాల పరిధిలోకి రావాలని అభివృద్ధి చెందిన దేశాలు వాదిస్తున్నాయి. 22 వేల డాలర్ల కంటే ఎక్కువ తలసరి ఆదాయం ఉన్న దేశాలు కూడా నిధులు ఇవ్వాలని స్విట్జర్లాండ్ కొత్త ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చింది. ఒకవేళ ఈ ప్రతిపాదన ఆమోదం పొందితే రష్యా, సౌదీ అరేబియా, చైనా తదితర దేశాలు ఆర్థిక సాయం చేయాల్సి ఉంటుంది. అత్యంత వేడి సంవత్సరంగా 2024 రికార్డు సృష్టించింది. ఐరోపాకు చెందిన కోపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీస్ ఈ విషయాన్ని ధృవీకరించింది. భూతాప సమస్యలే అందుకు ప్రధాన కారణమని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇంటర్నేషనల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) ప్రకారం.. భూతాపం కారణంగా 2014-2023 మధ్యకాలంలో ప్రపంచవ్యాప్తంగా 2 ట్రిలియన్ డాలర్ల మేర నష్టం వాటిల్లింది. 2021 గ్లోబల్ క్లైమేట్ రిస్క్ సూచీ ప్రకారం.. భూతాపం వల్ల ప్రభావితమయ్యే తొలి 10 దేశాల్లో భారత్ కూడా ఒకటి. 2100 నాటికి భారత్ తన జీడీపీలో ఏటా 3-10 శాతం వరకు నష్టపోనున్నట్టు ఒక అంచనా. అంతేకాదు, వాతావరణ మార్పుల కారణంగా మన దేశంలో 2040 నాటికి పేదరికం పెరుగుదల రేటు 3.5 శాతం పెరిగే అవకాశం ఉన్నది. వాతావరణ మార్పుల కారణంగా సంభవిస్తున్న విపత్కర పరిణామాలు కండ్లముందే కనిపిస్తున్నాయి. ఈ ఏడాది తెలంగాణలో జరిగిన విధ్వంసమే అందుకు తార్కాణం. రాష్ట్రంలోని 29 జిల్లాలను వరద ప్రభావిత ప్రాంతాలుగా ప్రభుత్వం ప్రకటించింది. తుఫాన్, వరదల వల్ల జనజీవనం స్తంభించిపోయింది. 39 మంది మరణించారు. రూ.5,400 కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులు ధ్వంసమయ్యాయి. వ్యక్తిగత ఆస్తులకు జరిగిన నష్టం దానికి మూడింతలు ఉండొచ్చని ఒక అంచనా. భూతాప సమస్యను ఎదుర్కొనే క్రమంలో జీ 20 సభ్య దేశాలు కీలకపాత్ర పోషించాల్సి ఉంటుంది. ఎందుకంటే, ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతున్న గ్రీన్‌హౌస్ వాయువుల్లో సుమారు 80 శాతం ఈ దేశాల నుంచే వస్తున్నది. అ యితే, భూతాప సమస్యలను ఎదుర్కొనే క్రమంలో నిధుల సమీకరణ ఇబ్బందికరంగా మారుతున్నది. ఈ తరుణంలో వాతావరణ మార్పులను కొట్టిపారేసే డొనాల్డ్ ట్రంప్ తిరిగి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికవడం ఆందోళనకరం. కాప్ 29 చర్చల సమయంలో ఒకే రకమైన ఆసక్తులున్న వివిధ దేశాలు ఒక గ్రూప్‌గా ఏర్పడి తమ వాణిని వినిపిస్తాయి. గ్రూప్ 77, చైనా, అభివృద్ధి చెందుతున్న దేశాలది ఒక సమూ హం. యురోపియన్ యూనియన్‌తో పాటు అభివృద్ధి చెందిన ఇతర దేశాలది ఒక జట్టు. అయితే, భూతాప సమస్యలను ఎదుర్కొనే విషయమై దేశాలతో పాటు పౌరులూ కీలకపాత్ర పోషించాలి. అప్పుడే భూతాప సమస్య పూర్తిగా సమసిపోతుంది.

# శీతాకాలం ఉత్సాహంగా తిందాం!

నిరుత్సాహపరిచే శీతగాలుల్లో ఉత్సాహంగా ఉండేందుకు కొన్ని ఎంపిక చేసిన ఆహారాలను తప్పక తీసుకోవాలి. చలికాలంలో ఉండే బద్ధకాన్ని వదిలించుకునేందుకు, చల్లటి వాతావరణంలో కలిగే జలుబు, జ్వరం వంటి అనారోగ్య సమస్యలు దరిచేరకుండా ఉండేందుకు మీ డైట్‌లో ఈ మెనూ ఉండేలా చూసుకోండి.



### చేప కొవ్వు

కొవ్వు అధికంగా ఉండే చేపలను వారానికి ఒకసారి తప్పకుండా తినండి. వీటిలో ఒమెగా3 ఫ్యాటీ ఆమ్లాలు అధికంగా ఉంటాయి. ఇవి మానసిక ఒత్తిడి, ఆందోళన వల్ల కలిగే అసౌకర్యాన్ని తగ్గిస్తాయి. ఒమెగా3 ఫ్యాటీ ఆమ్లాలు మెదడు చురుకుదనాన్ని ప్రభావితం చేసే న్యూరోట్రాన్స్‌మీటర్స్ పనితీరుని మెరుగుపరుస్తాయి. కాబట్టి బద్ధకంగా, నిరుత్సాహంగా ఉండేవాళ్లు కనీసం వారానికి మూడు సార్లు చేపల కూర తింటే మంచిది.

### ఆకు కూరలు

ఆకుకూరల్లో ఉండే విటమిన్ బీ-9 (ఫోలేట్) మెదడులో సంతోషాన్ని కలిగించే సెరటోనిన్‌ని ప్రభావితం చేస్తుంది. పాలకూర, కాలే (లీఫ్ క్యాబేజ్)లతోపాటు మిగతా ఆకుకూరలు కూడా తినొచ్చు. ఆకుకూరల్లో యాంటి ఆక్సిడెంట్లు కూడా అధికంగా ఉంటాయి. కాబట్టి అన్ని రకాల ఆకు కూరలూ తీసుకునే ప్రయత్నం చేయాలి. అస్తమా, జలుబు, దగ్గు, గొంతునొప్పి తరచుగా బాధిస్తుంటే ప్రతి రోజూ ఏదో ఒక పూట ఆకుకూర ఉండేలా చూసుకోవాలి.

### మేలుచేసే బ్యాక్టీరియా

జీర్ణ వ్యవస్థ మెరుగ్గా పని చేయడం వల్ల సాధారణ అలర్జీలు దరిచేరవు. అంతేకాదు శీతాకాలంలో వచ్చే అనారోగ్య సమస్యలను ఎదుర్కొనేందుకు వ్యాధినిరోధ శక్తిని పెంపొందించుకోవాలి. ఇందుకోసం జీర్ణవ్యవస్థలో మేలుచేసే బ్యాక్టీరియా ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. మజ్జిగ, పెరుగు, యోగర్ట్ తీసుకుంటే మంచిది.

### పుల్లని పండ్లే మేలు

పండ్లు తింటే ఆరోగ్య మెరుగవుతుందనే అవగాహన అందరికీ ఉంది. అలాగే శీతాకాలంలో పుల్లని పండ్లు తింటే అలర్జీ (జలుబు, తుమ్ములు) వస్తుందనే అపోహ కూడా ఉంది. ఆ అలర్జీలను తగ్గించే, వ్యాధినిరోధకతను పెంచడంలో పుల్లని పండ్లకు మరేవీ సాటిరావు. పుల్లని ఫలరసాల్లో విటమిన్-సి అధికంగా ఉంటుంది. బత్తాయి, నారింజ ఫల రసాలను తరచుగా తాగుతూ ఉంటే శీతాకాలంలో బలుబు సమస్య రాదు.


### దుంపలు మరువొద్దు

ఎక్కడికి పోయినా మన మూలాలు మరచిపోవద్దని చెబుతారు. ఆరోగ్య విషయంలోనూ అంతే. దుంప(వేర్లు)ల్లో కార్బోహైడ్రేట్‌లు పుష్కలంగా ఉంటాయి. పిండి పదార్థాలతోపాటు ఫైబర్ కూడా వీటిలో ఉంటుంది. క్యారెట్, బీట్‌రూట్, ఆలుగడ్డలు, చామగడ్డలు వంటి దుంపకూరల్ని తప్పక తినాలి.

### హెర్బల్ టీ

శీతాకాలంలో వేడివేడి టీలు ఎక్కువగా తాగుతారు. పాలతో చేసిన టీ, కాఫీల కంటే హెర్బల్ టీలు తాగితే ఎక్కువ మేలు జరుగుతుంది. లెమన్ టీ, చామంతితో చేసిన టీ తాగితే ఆందోళన వల్ల కలిగే దుష్ప్రభావాలు తగ్గుతాయి. హెర్బల్ టీ తాగితే నాడీ వ్యవస్థ మెరుగవుతుంది. గురక సమస్య కూడా తగ్గుతుంది.

# పుట్టుకతోనే అన్న నాళం మూసుకుపోతే



పిల్లల పెంపకం

నేను ఇప్పుడు ఎనిమిదినెలల గర్భవతిని. నెలవారీ పరీక్షలన్నీ సక్రమంగానే చేయించుకున్నాను. బీపీ, షుగర్, థైరాయిడ్ లాంటి సమస్యలేవీ లేవు. ఇరవై వారాలప్పుడు చేసిన స్కాన్ బాగానే ఉంది. ఆ తర్వాత బేబీ గురించి చేసిన స్కాన్‌లో 'వాటర్ చాలా ఎక్కువై పోయింది. శిశువు పొట్ట (జీర్ణాయశయం) సరిగా కనిపించట్లేదని, బహుశా అన్ననాళ నిర్మాణం సరిగ్గా జరగకపోయి ఉండొచ్చ'ని అన్నారు. వాళ్లన్నదే నిజమైతే.. బిడ్డ పుట్టిన తర్వాత ఎటువంటి వైద్యం అవసరమంవుతుంది. ఆపరేషన్ తప్పనిసరిగా చేయాలా? మీరు చెప్పే వివరాల ప్రకారం.. మీకు ఈసోఫేజీల్ అట్రేషియా (పిండస్థ దశలో అన్నవాహిక నిర్మాణం సరిగా జరగకపోవడం) ఉండి ఉండొచ్చు. పిండాభివృద్ధి దశలో అన్నవాహిక, శ్వాస నాళం ఒకే నాళం నుంచి వేరుపడి, రెండు వేర్వేరు నాళాలుగా రూపొందుతాయి. అన్నవాహిక జీర్ణాశయంతో అనుసంధానమై ఉంటుంది. శ్వాసనాళం ఊపిరితిత్తులలోకి తెరుచుకుంటుంది. పిండాభివృద్ధి జరిగేటప్పుడు ఈ చీలిక సరిగా జరగకపోతే అన్ననాళం ముందు మూసుకుపోవడం లేదా అన్నవాహిక చివరివైపు శ్వాసనాళానికి అతుక్కుని ఉండటం జరుగుతుంది. ఈసోఫేజీల్ అట్రేషియా, ట్రేకియో ఈసోఫేజీల్ ఫిస్టులా సమస్య అయి ఉండడానికి ఆస్కారముంది. ఈసోఫేజీల్ అట్రేషియా సమస్యను బిడ్డ పుట్టిన తర్వాత పరీక్షలు చేసి మాత్రమే నిర్ధారణ చేయగలం. ట్రేకియా ఈసోఫేజీల్ ఫిస్టులా, ఈసోఫేజీల్ అట్రేషియానే ఉన్నట్లయితే ఆపరేషన్ చేసి నయం చేయవచ్చు. ఇలా అనుమానం ఉన్నప్పుడు.. బిడ్డ పుట్టిన తర్వాత వెంటనే పరీక్ష చేయాలి. పాలు ఇవ్వకుండా ట్యూబ్ వేసి, ఎక్స్‌రే తీసి సమస్యను నిర్ధారించాలి. కేవలం ఈసోఫేజీల్ అట్రేషియానే అయితే ఆపరేషన్ తర్వాత పెద్దగా ఇబ్బంది ఉండదు. పెద్దయ్యాక మామూలుగా ఉంటారు. కానీ, బిడ్డకు ఈ సమస్య మాత్రమే ఉందా? దీనితోపాటు వేరే అవయవాల్లోనూ నిర్మాణ లోపం ఉందేమో పరీక్షించాలి! గుండె, కాలేయం, కిడ్నీ వంటి అవయవాల్లో ఏదైనా నిర్మాణ లోపం ఉందని ఉంటే.. జన్యు సంబంధమైన సమస్యలున్నట్లుగా అనుమానించాలి. కేవలం ఈసోఫేజీల్ అట్రేషియానే ఉండి ఉంటే ఆపరేషన్‌తో నయం చేయవచ్చు. పుట్టిన వెంటనే బిడ్డకు ఆపరేషన్ చేయగల వైద్యులు, వసతులు ఉన్న హాస్పిటల్‌లో ప్రసవం కోసం చేరడం మంచిది. అప్పటి దాకా వైద్య పరీక్షలు చేయించుకుంటూ డాక్టర్ల సలహాలు పాటించండి.

## సంపాదకీయం

# విద్యావిధానాన్ని రాజకీయం చేయకండి!

ప్రపంచంలో ఎన్నో దేశాల్లో అక్షర జ్ఞానం అడుగులు పడకముందే మనం నలంద, తక్షశిల విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసించాం. మన ఆచార వ్యవహారాలన్నింటిలో శాస్త్ర విజ్ఞానం నిగూఢంగా నిక్షిప్తమై ఉంది. ఇంతటి గొప్ప వారసత్వాన్ని సొంతం చేసుకున్న భారతీయ విద్య విదేశీ దండయాత్రలతో తన ప్రాభవం కోల్పోయింది. ముఖ్యంగా దాదాపు రెండు శతాబ్దాల ఆంగ్లేయుల పాలనలో మన విద్యా వ్యవస్థ తీవ్రంగా విధ్వంసమైంది. స్వాతంత్ర్యం వచ్చాక కూడా దురదృష్టవశాత్తూ ఆంగ్లేయులు అందించిన విద్యావిధానాలనే కొనసాగిస్తూ వచ్చాం. భారతీయతకు పెద్దపీట వేసి మనదైన సొంత విద్యావిధానాన్ని రూపొందించుకోవడంలో విఫలమయ్యాం. 1948లో స్వేచ్ఛాయుత భారతదేశ అవసరాలను తీర్చే విద్యా వ్యవస్థను నిర్మించే నిమిత్తం రాధాకృష్ణన్ కమిషన్ ఏర్పాటైంది. బ్రిటిష్, మెకాలే విద్యా విధానాలను రూపుమాపి, భారతీయ విలువలతో కూడిన విద్యావిధానం ప్రవేశపెట్టేందుకు మంచి అవకాశం ఈ కమిషన్‌కు లభించింది. కానీ, నాటి సామాజిక పరిస్థితులు, రాజకీయ సమీకరణాలు తదితర కారణాలతో అది సాధ్యపడలేదు. రాజ్యాంగ సభలో అధికార భాషపై చర్చ జరిగినప్పుడు హిందీని అధికారిక భాషగా ప్రకటించాలని చాలామంది సిఫార్సు చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ 'హిందుస్థానీ' (హిందీ, ఉర్దూ కలిసి ఉండే భాష)ని సూచించారు. చివరకు మున్షీ%-%అయ్యంగార్ ఫార్ములా ప్రకారం దేశంలో అత్యధిక మంది మాట్లాడే హిందీని అధికారిక భాషగా నిర్ణయించారు. హిందీతో పాటు ఒక పదేళ్ల వరకు ఇంగ్లీష్‌ను కూడా అధికార భాషగా అమలు చేయాలని, పదేళ్ల తర్వాత కేవలం హిందీని అధికార భాషగా కొనసాగించాలని నిర్ణయించారు. పదేళ్ల అనంతరం 1958 ప్రాంతంలో హిందీయేతర రాష్ట్రాల్లో ముఖ్యంగా తమిళనాడులో హిందీ వ్యతిరేక ఆందోళనలు జరిగాయి. అదే సమయంలో ఉత్తర భారతదేశంలో 'అంగ్రేజీ హటావో' నినాదాలు మిన్నంటాయి. ఈ నేపథ్యంలో నాటి ప్రధాని నెహ్రూ 1961లో రాష్ట్రాల ముఖ్యమంత్రులతో 'చీఫ్ మినిస్టర్స్ కాన్ఫరెన్స్' నిర్వహించారు. ఆ కాన్ఫరెన్సులోనే త్రిభాష సూత్రం ప్రతిపాదన వచ్చింది. దాని ప్రకారం పదేళ్ల వరకే అని ముందుగా అనుకున్నప్పటికీ, ఇప్పటికీ అధికార భాషగా ఇంగ్లీషును కొనసాగిస్తూ వచ్చారు. త్రిభాష సూత్రం ప్రకారం హిందీ, ఇంగ్లీషుతో పాటు మరొక భాష, అంటే ఆయా ప్రాంతం మాతృభాషను సబ్జెక్టులుగా ప్రవేశపెట్టారు. నాడు నెహ్రూ ప్రవేశపెట్టిన త్రిభాషా సూత్రాన్ని నేడు మోదీ ప్రభుత్వం మరింత మెరుగుపరిస్తే, దానిని తప్పుబట్టడం అర్థరహితం. 1964లో ఏర్పాటైన కోఠారీ కమిషన్ 1966లో నివేదికను సమర్పించింది. దీని ఆధారంగా స్వతంత్ర భారతంలో 1968లో తొలిసారి జాతీయ విద్యావిధానం రూపొందించారు. 1986లో నాటి జాతీయ విద్యావిధానంలో కొన్ని సవరణలు తీసుకొచ్చారు. మరిన్ని మార్పుల కోసం 1990లో రామ్మూర్తి కమిటీ ఏర్పాటైంది. 2005లో ఏర్పాటైన నాలెడ్జ్ సెంటర్ ఆఫ్ ఇండియా 2009లో తన నివేదికను సమర్పించింది. ఇవన్నీ ఆంగ్లేయుల ఆలోచన విధానంలో జరిగిన ప్రయత్నాలే. వీటిలో విద్యలో భారతీయ మూలాలను పాదుకొల్పాలన్న దృక్పథం కొరవడింది. ప్రధానమంత్రి మోదీ నేతృత్వంలో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం వలస పాలకుల వాసనలను వదిలించుకునే దిశగా అనేక చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో భారతీయ విజ్ఞానానికి పెద్దపీట వేస్తూనే, ప్రస్తుత ఏఐ జనరేషన్ అవసరాలనూ తీర్చేలా, కస్తూరి రంగన్ నేతృత్వంలో విస్తృత సంప్రదింపుల తర్వాత నూతన జాతీయ విద్యా విధానం%-%2020 (ఎన్‌ఈపీ%-%2020)ను ప్రవేశపెట్టింది. మోదీ ప్రభుత్వం ఏం చేసినా తప్పుబట్టడమే పనిగా పెట్టుకున్న కొందరు సూడో మేధావులు, కొన్ని పార్టీలు యథావిధిగా ఎన్‌ఈపీ%-%2020 పైనా విమర్శలు ఎక్కుపెట్టాయి. త్రిభాషా సూత్రం, విద్యను కేంద్రీకృతం చేయడం, మతం రంగు పులమడం అన్న మూడు 'లోపాలు' వారికి ప్రధానంగా కనిపించాయి. త్రిభాషా సూత్రాన్ని బూచిగా చూపి, హిందీయేతర రాష్ట్రాలపై కేంద్రం హిందీని, సంస్కృతాన్ని రుద్దుతుందంటూ తప్పుడు ఆరోపణలతో ప్రజల్లో భావోద్వేగాలు రెచ్చగొడుతున్నారు. త్రిభాష సూత్రం ప్రస్తుత ఎన్‌ఈపీ%-%2020 తీసుకొచ్చినదేమీ కాదు, గతంలో ఉన్న విధానమే. ఇంకా చెప్పాలంటే పాత పద్ధతిని మరింత మెరుగుపర్చింది. పాత విధానంలో హిందీ, ఇంగ్లీష్ తప్పనిసరి చేసి మాతృభాష కోసం మరొక భాషను ఎంచుకునే అవకాశం ఇస్తే, ఇప్పుడు కనీసం రెండు భారతీయ భాషలను తప్పనిసరి చేస్తూ ఏవైనా మూడు భాషలనూ ఎంచుకునే అవకాశం విద్యార్థులకు కల్పిస్తుంది. ఉదాహరణకు హైదరాబాదులో చదువుకునే ఒక బెంగాలీ విద్యార్థి ఇంగ్లీషుతో పాటు తెలుగు, బెంగాలీ భాషలను ఎంచుకోవచ్చు, లేదా హిందీ, తెలుగు, బెంగాలీ భాషలను ఎంచుకోవచ్చు. 3%-%8 ఏళ్ల వరకు మాతృభాషలోనే విద్యా బోధన జరగాలని ఎన్‌ఈపీ%-%2020 ప్రతిపాదిస్తుంది. మాతృభాషలో బోధన జరిగితే విద్యార్థి పాఠ్యాంశాన్ని తొందరగా, సమగ్రంగా అకళింపు చేసుకోగలుగుతాడు. ఇతర భాషలో బోధన జరిగితే విషయాలను అర్థం చేసుకోవడం కన్నా, భాషను అర్థం చేసుకోవడమే పెద్ద సవాలుగా మారుతుంది. ముప్పు ఎదుర్కొంటున్న గిరిజన భాషల్లోనూ విద్యా బోధన జరగాలనేది మోదీ ప్రభుత్వం ఆకాంక్ష. తద్వారా ఆయా గిరిజన విద్యార్థులకు పాఠ్యాంశాలు సులువుగా అర్థమవడమే కాకుండా, గిరిజన భాషను పరిరక్షించవచ్చు అనేది అభిప్రాయం. ఇప్పటివరకు ఇంగ్లీష్‌లోనే అందుబాటులో ఉన్న మెడిసిన్, ఇంజనీరింగ్ వంటి సబ్జెక్టులను సైతం భారతీయ భాషల్లోనూ తీసుకురావాలని మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

# జ్యోతిరావు ఫూలే సమానత్వపు శిల్పి, శోధనకు శక్తి : డా. భీమ్ రాజ్...

(మరో ఉదయం) : ఒక మనిషి జీవితమే సమాజాన్ని మార్చగలదా? సమాజపు వర్గీకరణలే చీల్చిన భిన్నతను ముడిపెట్టి, సమానత్వపు వేదికను నిర్మించగలదా? ఈ రెండు ప్రశ్నలకూ సమాధానంగా నిలిచిన మహోన్నతుడు %-% మహాత్మా జ్యోతిరావు గోవింద్ రావు ఫూలే.

### ఆదికాలం అసమాన సమాజంలో జననం :-

జ్యోతిరావు ఫూలే 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్రలోని కాటగున్ గ్రామంలో జన్మించారు. ఆయన "మాలి" కులానికి చెందినవారు - పువ్వులు అమ్ముకునే ) వృత్తి చేయు సామాజికంగా అణగారిన వర్గానికి చెందిన కుటుంబం. బాల్యంలోనే తల్లి చిమణాబాయి మరణించగా, తండ్రి గోవింద్ రావు గారు అతనిని పరితాపంలో కాకుండా పరిమితి మధ్య ఆశయానికి నడిపించారు. అప్పటి బ్రాహ్మణాధిక్య సమాజంలో "తలుపు ఎరగని తలిత వర్గం"కు జ్యోతిరావు ఫూలే ప్రతినిధిగా ఎదిగారు. ఇది కుల ఆధారిత వివక్షను సూచించే ఒక రూపకాల అభివ్యక్తి. "తలుపు ఎరగని" అంటే ు ప్రవేశం లేని, అవకాశం ఇవ్వని, విస్మరించబడిన అనే భావన. "తలిత వర్గం" అంటే ు తక్కువ కులస్థాయి, సమాజంలో అణచివేయబడిన శ్రేణి (అణగారిన వర్గం). కావున, "తలుపు ఎరగని తలిత వర్గం" అనగా సామాజిక, ఆర్థిక, శిక్షణ, రాజకీయ రంగాలలో ప్రవేశానికి తలుపులు (అవకాశాలు) పూర్తిగా మూసివేయబడ్డ ు అణచివేయబడిన వర్గం. వీరికి విద్య, హక్కులు, గౌరవం వంటి విషయాల్లో ఏ తరహా అవకాశాలు ఉండేవి కావు.

### క్రైస్తవ మిషనరీ సంస్థ సహాయంతో - విద్యాభ్యాసం :-

మన దేశంలో కులమతాలను, వర్ణ వివక్షతను బీసీ, ఎస్సీ, ఎస్టీ పేద వర్గాలు ఎక్కువగా ఎదుర్కొంటూ మనిషిని మనిషిగా చూడని అ రోజుల్లో ఒక క్రైస్తవ మిషనరీ సంస్థ జ్యోతిరావు ఫూలే గారిని అక్కున చేర్చుకుంది. ఆ సంస్థ సహాయంతో అంగ్లో-స్కాటిష్ క్రైస్తవ మిషనరీ పాఠశాలలో విద్య ప్రారంభించిన ఫూలే, అక్కడే "సమానత్వం" అనే భావనతో తొలిసారి పరిచయం అయ్యారు. చదువు కేవలం ధనికులకు, బ్రాహ్మణులకు మాత్రమే అన్న సమాజ భ్రాంతిని తొలగించాలన్న ఆకాంక్ష అక్కడే మొదలైంది. చదువు పూర్తయ్యాక ఆ విద్యను అణగారిన వర్గాలకు అందించాలన్న మానవతా సంకల్పం జ్యోతిరావు ఫూలే గారిని కదిలించింది.

### వివక్షతకు వ్యతిరేకంగా తన జీవితాన్ని అంకితం.

జ్యోతిరావు ఫూలే గారి విద్యాభ్యాసంలోనూ, జీవనవిధానంలోనూ అణచే వ్యవస్థ వెంబడించింది. పాఠశాలలో బ్రాహ్మణ విద్యార్థుల తల్లిదండ్రులు అంటారని క్షుద్రుడైనా జ్యోతిరావు ఫూలే గారితో పాటు తమ పిల్లలు చదవరాదంటూ అభ్యంతరాలు చెప్పేవారు. అయినా జ్యోతిరావు ఫూలే గారి చదువు నడక ఆగలేదు. అర్హత గలవారు కాదు, అవకాశం దక్కనివారు ఇదే ఆయన ధ్యేయం.

### అతని ప్రసిద్ధ వాక్యమిది:

"విద్య లేక అభివృద్ధి లేదు, అభివృద్ధి లేక స్వాతంత్ర్యం లేదు, స్వాతంత్ర్యం లేక స్వాభిమానం లేదు."

### సవిత్రిబాయి ఫూలే సమానతలో సారధి :-



1840లో సవిత్రిబాయి ఫూలేను వివాహమాడిన జ్యోతిరావు, ఆమెను స్వయంగా చదివించారు. ఆమెను భారతదేశపు మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దారు. ఇద్దరూ కలిసి 1848లో పుణేలో తొలిబాలికా పాఠశాల స్థాపించి, "విద్య అందరికీ" అనే నినాదాన్ని కార్యరూపం దించారు. ఇది కేవలం విద్యా కేంద్రం కాదు %-% అది సామాజిక మార్పు కేంద్రం.

సత్యశోధక సమాజ్ అణగారిన వర్గాల అవగాహన :-

1873లో సత్యశోధక సమాజ్ అనే సంస్థను స్థాపించారు. ఇది:

కులవ్యవస్థను వ్యతిరేకించింది

బ్రాహ్మణాధిపత్యాన్ని ప్రశ్నించింది

శుద్ర, అతిశుద్ర వర్గాలకు స్వీయగౌరవాన్ని నూరిపోసింది

వివాహ, పూజా విధులలో బ్రాహ్మణ ఆధిపత్యాన్ని తొలగించే ప్రయత్నం చేసింది.

### ఫూలే స్పష్టంగా చెప్పారు :-

"వివక్షత మనిషిని మానవత్వం నుండి దూరం చేస్తుంది. ఒకరి మానవత్వాన్ని చిన్నగా చూసే సమాజం, దానికే శాపంగా మారుతుంది."

### సాహిత్య రచన మౌనం కాదు, ఉద్యమం :-

ఫూలే గారి రచనలు పాఠ్య పుస్తకాలుగా కాకపోయినా, ఆలోచన పాఠాలుగా నిలిచాయి:

గులాం గిరి (1861): దాస్య వ్యవస్థపై తీవ్ర విమర్శ.

శుద్ర పూరణ: శుద్రుల చరిత్రను ప్రతిపాదిస్తూ, బ్రాహ్మణాధికార భావనల్ని తిప్పికొట్టిన రచన.

సర్వజనిక సత్య ధర్మ పుస్తక: సమానత్వ ధర్మానికి మార్గదర్శక గ్రంథం.

### ఆఖరి రోజులు మరియు వారసత్వం :-

జ్యోతిరావు ఫూలే 1890 నవంబర్ 28న తుదిశ్వాస విడిచారు. కానీ ఆయన ఆశయాలు నేడు కూడా ప్రాముఖ్యాన్ని పొందుతున్నాయి. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలనే ఆకాంక్షతో ఉన్న ప్రతి ఒక్కరూ ఫూలే గారి వారసులు అని చెప్పవచ్చు. మరియు ఆయన జయంతి రోజును దేశవ్యాప్తంగా సమాజ హక్కుల దినోత్సవంగా పాటిస్తున్నారు.

### ఆధునిక సమాజానికి సందేశం :-

జ్యోతిరావు ఫూలే జీవితం మనకు తెలియజేస్తున్నది %-% ఒక వ్యక్తి, తన ఆలోచనల ద్వారా సమాజాన్ని ఎలా మార్చగలడో. సమానత్వం కోసం ఉద్యమించాలంటే దేనిపైనా ప్రశ్నించగల ధైర్యం ఉండాలి. అదే ధైర్యాన్ని, అదే దృష్టిని ఆయన చూపించారు.

### ముగింపు :-

11-4-2025 నాడు జ్యోతిరావు ఫూలే జయంతి సందర్భంగా వారి జీవితం అనేది ఒక సామాజిక వేదికపై వెలిగిన దీపం వంటిది అది కేవలం కాంతి కాదు, మార్గదర్శకత్వం. ఆయన చూపిన దారిలో నడవటం, ఆయన కలల్ని సాకారం చేయటం మన బాధ్యత.

### రచన :-

డాక్టర్ డి. భీంరాజ్. అసిస్టెంట్ రిజిస్ట్రార్. మహాత్మా జ్యోతి రావు ఫూలే జాతీయ అవార్డు గ్రహీత 2019

# గవర్నర్లు ఈసారైనా గ్రహిస్తారా?



ఎన్నికైన ప్రభుత్వాలను బేఖాతరు చేస్తూ తరచు ఇబ్బందులు సృష్టించే గవర్నర్లకిది శరాఘాతం. శాసనసభ ఆమోదించిన పది బిల్లులపై ఆమోదముద్ర వేయకుండా, రాష్ట్రపతి పరిశీలనకు పంపకుండా దీర్ఘకాలం పెండింగ్‌లో పెట్టిన తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి తీరును తప్పుబట్టడమేకాక ఆ బిల్లులన్నీ ఆమోదించినట్టుగా భావిస్తూ సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం వెలువరించిన తీర్పు అసాధారణమైనది. రాజ్యాంగంలోని 142వ అధికరణ కింద తనకు దఖలు పడిన విశేషాధి కారాలను వినియోగించుకుని సుప్రీంకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. తాము ఎన్నికైన ప్రభుత్వాల కన్నా అధికులమని భావించటం, వివాదాస్పద వ్యాఖ్యలు చేసి ప్రభుత్వాలను ఇరకాటంలో పెట్టడం చాన్నాళ్లుగా కొందరు గవర్నర్లలో కనిపిస్తున్న ధోరణి. తనముందుకొచ్చే ఈ మాదిరి కేసులపై విచారిస్తున్నప్పుడూ లేదా తీర్పు వెలువరించినప్పుడూ ఈ ప్రవర్తన సరికాదని సుప్రీంకోర్టు చెబుతూనే వచ్చింది. వేరే రాష్ట్రాలకు సంబంధించి తీర్పు వచ్చినప్పుడైనా తమ అధికారాలేమిటో, పరిమితు లేమిటో తెలుసుకుని మెలగటం, ప్రవర్తనను సవరించుకోవటం విజ్ఞత అనిపించుకుంటుంది. కానీ అదెక్కడా కనబడటం లేదు. అలాగని గవర్నర్లంతా ఈమాదిరిగానే ఉంటున్నారని అనుకోనవసరం లేదు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఒకే పార్టీ అధికారంలో వున్నచోట ఎలాంటి సమస్యలూ కన బడవు. వ్యక్తులుగా హుందాతనాన్ని ప్రదర్శించే గవర్నర్లు విపక్ష ప్రభుత్వాల ఏలుబడిలోని రాష్ట్రాల్లో సాఫీగా పనిచేసుకుపోతున్నారు. ఎటొచ్చీ కొందరు గవర్నర్లు మాత్రం వింత పోకడలు పోతున్నారు. తమిళనాడు శాసనసభ ఆమోదించి గవర్నర్ రవి వద్ద పెండింగ్‌లో వున్న పది బిల్లుల్లో జనవరి 2020 నాటిది కూడా ఉందంటే ఆశ్చర్యం కలుగుతుంది. అంతేకాదు... ఈ బిల్లుల్లో చాలాభాగం ఒకసారి అసెంబ్లీలో ఆమోదం పొంది గవర్నర్ తిరస్కారానికి గురై రెండోసారి అసెంబ్లీ ఆమోదం పొంది వచ్చినవి. రాజ్యాంగ నిబంధన ప్రకారం ఒక బిల్లు తన సంతకం కోసం వచ్చినప్పుడు గవర్నర్ దాన్ని ఆమోదించటమో, తిరస్కరించటమో, రాష్ట్రపతి పరిశీలనకు పంపడమో చేయాలి. అంతేతప్ప నెలల తరబడి తొక్కిపెట్టి వుంచ కూడదు. ఈ సంగతిని రెండేళ్లనాడు పంజాబ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పు వెలువరిస్తూ సుప్రీంకోర్టు తెలియజేసింది. అక్కడి గవర్నర్ ఏకంగా 12 బిల్లుల్ని దీర్ఘకాలం పెండింగ్‌లో ఉంచారు. తన ఆమోదముద్ర కోసం వచ్చిన బిల్లుపై 'సాధ్యమైనంత త్వరగా' గవర్నర్ నిర్ణయం తీసుకోవాలని, పునఃపరిశీలన అవసరమని భావిస్తే ఆ సంగతి తెలియజేయాలని అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని 200వ అధికరణ సైతం ఈ సంగతే చెబుతోంది. బిల్లు సక్రమంగా లేదని, స్పష్టత కొరవడిందని లేదా రాజ్యాంగ నిబంధనలను అతిక్రమిస్తోందని గవర్నర్ భావిస్తే దాన్ని తిప్పిపంపొచ్చు. గవర్నర్ ఇచ్చిన సలహాను అంగీకరించి బిల్లుకు సవరణలు చేయటమా లేక యథాతథంగా దాన్నే మరోసారి ఆమోదించి పంపటమా అనేది శాసనసభ ఇష్టమని ఆ అధికరణ తేటతెల్లం చేస్తోంది. రెండోసారి వచ్చిన బిల్లును గవర్నర్ ఆమోదించి తీరాలని లేదా రాష్ట్రపతి పరిశీలనకు పంపాలని చెబుతోంది. నిబంధనలుఇంత స్పష్టంగా ఉన్నప్పుడు రవి ఇష్టానుసారం ప్రవర్తించటం అనుచితం. పంజాబ్ కేసులో ఇచ్చిన తీర్పును గవర్నర్లు బేఖాతరు చేస్తున్నారని గమనించటం వల్లే... ఆమోదం కోరుతూ తమ వద్దకొచ్చిన బిల్లు విషయంలో గవర్నర్లు ఎలా మెలగాలో తాజా తీర్పులో సుప్రీంకోర్టు ధర్మాసనం నిర్దేశించాల్సి వచ్చింది. రాష్ట్రపతి పరిశీలనకు పంపదల్చుకున్న బిల్లుల్ని గరిష్ఠంగా మూడు నెలలు మించి తమవద్ద ఉంచుకోరాదని, పునఃపరిశీలనకొచ్చిన బిల్లునైతే వెంటనే ఆమోదించాలని లేదా గరిష్ఠంగా నెల రోజుల్లోపల సమ్మతి తెలపాలని ధర్మాసనం తెలిపింది. తొలిసారి వచ్చిన బిల్లుకూ, రెండోసారి పంపిన బిల్లుకూ వ్యత్యాసం ఉన్నపక్షంలో మాత్రమే ఇందుకు మినహాయింపు వుంటుంది. ప్రజాస్వామ్యంలో ప్రజలెన్నుకున్న ప్రభుత్వాలకు అధికారాలుండాలి. కానీ ఆ ప్రభుత్వాలపట్ల ఏర్పర్చుకున్న అభిప్రాయంతో ఈ అధికారాలకు అవరోధాలు కల్పించాలని చూడటం రాజ్యాంగ ధిక్కరణ అవుతుందని గవర్నర్లు గ్రహించటం లేదు. అరుణాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ కేసులో 2016లో ఇచ్చిన తీర్పులో ఈ సంగతిని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తన ఆమోదం కోసం వచ్చిన బిల్లులపై 'సాధ్యమైనంత త్వరగా' నిర్ణయం తీసుకోవాలని పంజాబ్ కేసు విషయంలో సుప్రీంకోర్టు చెప్పినప్పుడే రవి అప్రమత్తమై తన పరిమితులను గుర్తెరిగి వుంటే తాజా తీర్పులో నిర్దిష్ట గడువు నిర్దేశించాల్సిన అవసరం ఉండేది కాదు. తమ ప్రవర్తనవల్ల రాజ్యాంగ పదవికుండే ఔన్నత్యాన్ని పలచన చేస్తున్నామని గవర్నర్లు ఇకనైనా గుర్తెరగాలి. కేంద్రంలో రాష్ట్రపతి మాదిరే రాష్ట్రాల్లో గవర్నర్లు కూడా రాజ్యాంగానికి అనుగుణంగా కొన్ని అధికారాలు, బాధ్య తలు కలిగివుంటారు. కానీ రాష్ట్రపతి తరహాలో వారు ఎన్నిక కారు. కేంద్ర కేబినెట్ సలహా మేరకు రాష్ట్రపతి వారిని నియమిస్తారు. రాజకీయ నాయకులు గవర్నర్లు కావటంవల్లే సమస్యలొస్తున్నాయని సుప్రీంకోర్టు భావించి భిన్నరంగాల్లో నిపుణులైనవారిని ఈ పదవికి ఎంపిక చేయాలని గతంలో సూచించింది. కానీ కేంద్రంలోని పాలకులకు నచ్చినవారే ఈ కోటాలో ఎంపికవుతారు గనుక ఆ నిపు ణులు రాజకీయాలకు అతీతంగా ఏమీవుండరు. రాజకీయంగా గవర్నర్లకు ఎలాంటి అభిప్రాయా లున్నా రాజ్యాంగ పదవిలో ఉంటున్నవారిగా అందుకు అనుగుణంగా మెలగటం నేర్చుకోవాలి. పదే పదే న్యాయస్థానాలతో చెప్పించుకోవటం మర్యాద కాదని తెలుసుకోవాలి.

# చెట్లు కుములుతున్న దృశ్యం

నగరం అప్పుడప్పుడే మేలుకుంటున్న వేళ డాబా మీదికి వెళ్ళి చూడండి: ఎప్పుడు మేలుకున్నాయో తెలియదు, ఎలా వచ్చాయో తెలియదు, చుట్టూ ఉన్న పెద్ద పెద్ద చెట్ల మీద, చిన్న చిన్న మొక్కల మీద, ఎక్కడబడితే అక్కడ చిన్నాపెద్దా పక్షులు, రంగురంగుల బుల్లి బుల్లి పిట్టలు! అవి నిర్విరామంగా కిచకిచల ధ్వనులు చేస్తూనే ఉంటాయి. అవి వాటితో అవి మాట్లాడుకోవడంబీ ఒకరి ఉల్లాసాన్ని ఒకరు పంచుకోవడంబీ కొమ్మమీంచి కొమ్మకు, ఆకుమీంచి ఆకుకు గెంతుతాయి,మందారపుష్పాల మెత్తని కేసరకాండాన్ని పట్టుకుని ఊగుతాయి. అది వాటి క్రీడావినోదం. అది కూడా కాసేపే! ఉషఃకాలపు పిల్లగాలులు చల్లచల్లగా వీస్తున్నప్పుడు, సూర్యుడు పూర్తిగా పొడుచుకు రానప్పుడు, పరిసరాలు వేడెక్కనప్పుడు, మరీముఖ్యంగా మానవ సంచారం మొదలవనప్పుడు! ఆ తర్వాత అవి అదృశ్యం! ఎక్కడికెడతాయో తెలియదు, రోజంతా ఎక్కడుంటాయో తెలియదు! వాటి గురించి ఎప్పుడైనా క్షణకాలం ఆలోచించి చూడండి, అప్పుడేమనిపిస్తుంది? బహుశా, ఎప్పుడో వేల సంవత్సరాల క్రితం మానవ ధూర్తరాష్ట్రులతో ఆడిన జూదంలో ఓడిపోయి జనారణ్యంగా మారిన తమదైన అరణ్యంలోనే అజ్ఞాతవాసం చేస్తున్న పాండవుల అనంత సంతతి కాదుకదా అనిపిస్తుంది. అవి రోజూ పొద్దుటే కాసేపు తమ కొమ్మల మీద, తమ ఆకుల మధ్య ఇంద్రధనువుల్ని ఆవిష్కరిస్తూ కోలాహలంగా తిరుగుతూ ఉంటే ఆ చెట్లకెంత సంబరం! ఆ చెట్లూ, పిట్టలూ ప్రకృతి చరిత్ర పుటల్లోని తమ గురించిన అధ్యాయాలను మనిషి నిర్దాక్షిణ్యంగా చెరిపేసి పూర్తిగా సొంత అధ్యాయాలతో నింపేసుకున్న తర్వాత, కేవలం ప్రాచీన స్మృతులుగా మారిన తమ అనుబంధం గురించిన ఊసులు ఆ కాసేపూ నెమరేసుకుంటాయి కాబోలు! పక్షులతో పోల్చితే చెట్ల పరిస్థితి మరీ ఘోరం. అవి ఎగరనూ లేవు, ఆపైన వాటివి భారీకాయాలు కనుక అజ్ఞాతవాసయోగం కూడా వాటికి లేదు. తమ కొమ్మల మీద, తమ వేళ్ళ మీద మనిషి గొడ్డలి వేటు ఏ క్షణంలో పడుతుందో నన్న నిత్యభయగ్రస్త జీవితాన్ని నిలువు కాళ్ళమీద గడపక తప్పదు. చెట్లు కూలుతున్న దృశ్యం గురించి, రాక్షసుని వెన్నెముకపై ప్రతిష్ఠించిన నగరం గురించి, నగరంలో మనిషి కంటక శరీరుడిగా మారడం గురించి, సర్వత్రా వినిపించే కఠోర శబ్దాలు,ధ్వంసక్రీడ, దగ్ధక్రీడల గురించి, పూల చెట్లు విలపించడం గురించి, నిద్రలో నడుస్తున్న మనిషి నెత్తుటి మడుగును దాటలేడని చెప్పి అవి శపించడం గురించి%-% కవి అజంతా రాస్తాడు. అవును, నిజమే, నిద్రలో నడుస్తున్న మనిషి ప్రకృతిలోని సమస్త జీవజాలం మనుగడనూ నెత్తుటి మడుగు చేశాడు, తను సృష్టించిన ఆ మడుగును తను కూడా దాటలేని పరిస్థితిని తెచ్చుకుంటూనే ఉన్నాడు. ఒకప్పుడంతా అడవేనన్న సంగతి మరచిపోయి, నగరమే నిత్యమూ, సత్యమనే భ్రమలో పడిపోయాడు. చెట్లను కూల్చడం, వాటిని ఆశ్రయించుకున్న జీవజాలానికి నిలువనీడ లేకుండా చేయడమే అభివృద్ధి అని నిర్వచించుకుంటున్నాడు. తను కూడా భాగమైన ప్రకృతికి దూరమై ఒంటరివాడై పోతున్నాడు. అంతా తన ప్రయోజకత్వం, తానే భువికధినాథుడినని విర్రవీగుతున్నాడు. తను నెత్తిన మోసే తన పౌరాణిక, ఇతిహాస వారసత్వం నుంచి కూడా మనిషి పాఠాలు నేర్చుకోవడం లేదు. ఎగిరే పర్వతాల గురించి, మానవరూపం ధరించి మాట్లాడే నదుల గురించి, మాట్లాడే పక్షులు, జంతువుల గురించి అవి చెబుతాయి. అది, నువ్వు కూడా ప్రకృతిలో భాగమే సుమా అని గుర్తుచేయడంబీ ప్రకృతిలో ఏ జీవీ ఎక్కువా కాదు, తక్కువా కాదు, అన్నింటికీ జీవించే హక్కు ఉందని చెప్పడం! దవులకు, అక్కడి సమస్త పాణులకు రక్షణ కల్పించవలసిన అవసరం గురించి అర్థశాస్త్రం



చెబుతుందిబీ అడవులూ, వాటిని ఆశ్రయించుకుని బతికే జీవులూ రాజ్యంలో భాగం కాని, స్వతంత్ర అస్తిత్వాలన్న సంగతిని ఆనాటి రాజుల వివేకం చెబుతుంది. ప్రాకృతికమైన పూర్తి అవగాహనతో పూర్వులు గీసిన ఈ లక్ష్మణ రేఖలన్నీ ఏమైపోయాయి? అడవిపై విచక్షణా రహితమైన రాజ్యపు రాబందు రెక్క పరచిందెవరు?! సమకాలీన శాస్త్రవిజ్ఞాన పాఠాలు కూడా మనిషి తలకెక్కడం లేదుబీ ఈ విశ్వమూ, భూమీ,అందులోని ప్రకృతీ తమవైన ప్రణాళికను, తమవైన కేలండర్‌ను అనుసరిస్తాయనీ, మనిషి ప్రణాళికలనూ, కేలండర్‌నూ అవి ఏ క్షణంలోనైనా కుప్పకూల్చగలవనే ఎరుక లేదు. వందల కోట్ల సంవత్సరాల భూమి చరిత్రలో ఎన్నో మంచుయుగాలు దొర్లాయి. భూకంపాలు, వరదలు, అగ్నిపర్వత విస్ఫోటాలు జీవి మనుగడను ఎన్నో మలుపులు తిప్పాయి. ఎంతో చరిత్రను తిరగరాశాయి. జీవపరిణామం ఎన్నో మార్పులు చెందింది. మానవ పరిణామంలో ఇప్పుడు చూస్తున్నదే తుది అంకం కాదు, మరిన్ని అంకాలకు అవకాశముందని జన్యుశాస్త్రజ్ఞులు హెచ్చరిక. మరి జంతువులు సహా ఇతర జీవజాలం సంగతేమిటి? మనిషిలోలానే వాటిలో కూడా ఏదైనా ఉత్పరివర్తన జరిగి అవి మనిషి స్థానాన్ని ఆక్రమిస్తే?! అది ప్రస్తుతానికి విపరీత ఊహలా అనిపించవచ్చు, కానీ ప్రకృతి గర్భంలో ఏ రహస్యాలు దాగున్నాయో ఎవరికి తెలుసు? కనుక మనిషి నేర్చుకోవలసింది వినమ్రత! ప్రకృతిపట్లా, అందులోని చరాచరాలన్నిటిపట్లా సమభావం, సమరసభావం!! పగబట్టి తిరగబడే ప్రకృతి ముందు తను పిపీలకమన్న ఆత్మజ్ఞానం!!

# పూలే సేవలు ఆదర్శనీయం





ఎంఏ జలీల్ భాషా

**ఉప్పల్,ఏప్రిల్ 11 (సూర్యరేఖ):** అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం మహాత్మా జ్యోతిరావు పూలే చేసిన సేవలు ఆదర్శనీయం అని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎంఏ జలీల్ భాషా పేర్కొన్నారు.శుక్రవారం పూలే జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అంటరానితనం,కుల వివక్ష నిర్మూలన కోసం జీవితాంతం పోరాడిన మహానుభావుడు,మహిళల హక్కుల కోసం గళమెత్తిన యుగపురుషుడు పూలే అని ఆయన సేవలను కొనియాడారు.ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు,రబ్బానీ భాయ్,జంగారెడ్డి,చెంచుల్,మల్లేష్,సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఆస్కార్ స్విమ్మింగ్ పూల్ ను ప్రారంభించిన

ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి





**ఉప్పల్,ఏప్రిల్ 11(సూర్యరేఖ):** ఉప్పల్ భగాయత్ లోని హెచ్ఎండీఏ లే అవుట్ లో ఏర్పాటు చేసిన ఆస్కార్ స్విమ్మింగ్ పూల్ ను ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి ప్రారంభించారు.హెచ్ఎండీఏ లే అవుట్ లో తొలిసారిగా ఆస్కార్ స్విమ్మింగ్ పూల్ ను ఏర్పాటు చేశారు.శుక్రవారం ఉప్పల్ కార్పొరేటర్ రజితపరమేశ్వర్ రెడ్డి,ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్విమ్మింగ్ పూల్ ను ప్రారంభించారు. భగాయత్ లో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటుతో ఈ ప్రాంత వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని,ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.ఈ సందర్భంగా స్విమ్మింగ్ పూల్ యజమాని మేకల కరుణాకర్ రెడ్డిని కార్పొరేటర్ రజితాపరమేశ్వర్ రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో మేకల వెంకట్ రెడ్డి,మేకల రంగ రెడ్డి,మేకల వెంకట్ రెడ్డి,మేకల సంతోష్ రెడ్డి,మందుముల అంజి రెడ్డి,ఈగ సంతోష్ ముదిరాజ్,లింగంపల్లి రామకృష్ణ,తుమ్మల దేవి రెడ్డి,మోహన్ నాయక్,నాగు నాయక్,పాల్గొన్నారు.

# మనిషిని మహోన్నతుడిగా తీర్చిది విద్య ఒక్కటే..

మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్,ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**ఉప్పల్,ఏప్రిల్ 11 (సూర్యరేఖ):** మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దేది విద్య ఒకటే అని మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్,ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,లు అన్నారు.అందరికీ విద్యను అందించేలా కృషిచేసిన మహనీయుడు, తత్వవేత్త,సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా సైనిక్ పూరిలో జరిగిన మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి,వారి విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త,మానవతావాది పూలే సామాజిక ఉద్యమాల మార్గదర్శి మహాత్మా జ్యోతిరావు పూలే,చదువు లేనిదే జ్ఞానం లేదు,జ్ఞానం లేనిదే పురోగతి లేదు అనే సత్యాన్ని గ్రహించి 19వ శతాబ్దపు తొలినాళ్లలో నిమ్న జాతుల కోసం, మహిళల కోసం దేశంలో మొదటిసారిగా పాఠశాలలను ఏర్పరిచిన మహనీయుడు జ్యోతి రావు పూలే,విద్యావ్యాప్తి ద్వారా కుల వివక్షతను, సాంఘిక దురాచారాలను,మూడనమ్మకాలను నిర్మూలించేందుకు కృషి చేశారు.కులం పేరుతో తరతరాలుగా అన్ని రకాలుగా అణచివేతలకు వివక్షతలకు గురయిన బడుగు,బలహీన వర్గాలలో ఆత్మస్థైర్యం కల్పించి,వారి హక్కుల కోసం పోరాడి, సాధికారత కోసం కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

జన్నారం ఎస్సై రాజ వర్ధన్ కౌన్సిలింగ్



**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా,ఏప్రిల్ 11(సూర్యరేఖ):** మంచిర్యాల జిల్లా జన్నారం మండలం సోనాపూర్ తండాలో శుక్రవారం జన్నారం ఎస్ఐ కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ యువతకు క్రికెట్ కిట్లను అందజేశారు.తదుపరి ఆయన మాట్లాడుతూ... యువత అభివృద్ధికి పునాది,చదువు క్రీడల్లో రాణించాలన్న మనం చదువుపై పాఠశాల కాలేజీల్లో ఏకాగ్రత వహించాలని,చదువు క్రమశిక్షణ ఉన్నప్పుడే అన్ని మార్గాల్లో రాణించగలుగుతామని ఆయన యువతకు సూచనలు అందించారు.ఈమధ్య కాలంలో చాలామంది విద్యార్థులు సైతం గాంజా,డ్రగ్స్,మద్యపానానికి అలవాటై తమ తల్లిదండ్రులకు కుటుంబ సభ్యులకు నష్టాల పాలు చేస్తూ తమ జీవితాలలో చక్కబడే సమయంలో పోలీసులకు చిక్కి కేసులు పాలై కష్టాలు ఎదుర్కొంటూ తమ జీవితాలను చేచేతులారా పోగొట్టుకుంటున్నారని,ఇప్పటికైనా యువత తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించుకోవాలని ఆశతో మద్యపానం,గాంజా,డ్రగ్స్ అలవాటు పడకుండా వీటికి దూరంగా ఉండాలని ఆయన సూచించారు.

# వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**రామాయంపేట,ఏప్రిల్ 11(సూర్యరేఖ):** రామాయంపేట మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శుక్రవారం నూతనంగా నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి చౌదరి సుప్రభాత రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు.ఈ సందర్భంగా సుప్రభాత రావు మాట్లాడుతూ ...మెదక్ నియోజకవర్గం ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారని అన్నారు.అందులో భాగంగా మున్సిపాలిటీ ప్రజల దాహార్తి తీర్చడం కోసం ప్రభుత్వం అమృత్ 2.0 పథకం క్రింద రెండు వాటర్ ట్యాంకుల నిర్మాణానికి రూ.7 కోట్ల నిధులు మంజూరు చేశారని అన్నారు.మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ప్రజలు ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరు సహకరించి అభివృద్ధి చేసే దిశగా తమను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సుప్రభాత రావు,రమేష్ రెడ్డి,సరాపు యాదగిరి,దేమే యాదగిరి, సుందర్ సింగ్,దోమకొండ యాదగిరి,పిట్ల ప్రకాష్,పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# బలహీనవర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిబాపూలే

ఘనంగా నివాళులర్పించిన రామంతపూర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు వంగాల సతీష్ గుప్తా



**రామంతాపూర్,ఏప్రిల్ 11(సూర్యరేఖ):** మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా రామంతపూర్ అధ్యక్షులు వంగాల సంతోష్ గుప్తా ఆధ్వర్యంలో రామంతపూర్ మినీ ట్యాంక్ బండ్ వద్ద పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామంతపూర్ డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు పాల్గొని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.బిజెపి సీనియర్ నాయకులు ముత్తినేని జగదీష్ రేపు నరసింహ,నందకిషోర్ యాదవ్,సవుల శ్రీనివాస్,జి.సురేష్,తాళ్ల బాలకృష్ణ గౌడ్,దర్శనల సుధాకర్,మసిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కల్మకల లింగం,తమ్మలి రవి,అంజయ్య పటేల్,ధీరజ్, తిరుపతయ్య,దయాకర్ రెడ్డి,పర్వతాలు,పడియం నాగేష్,ఆనంద్,పత్రి శ్రీనివాస్,వీరు మహిళా నాయకురాలు అంబటి భాగ్యలక్ష్మి,స్వర్ణ సండే, డివిజన్ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రామంతాపూర్ లో ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

జ్యోతిరావు పూలే సేవా సంఘం అధ్యక్షుడు బుర్ర మహేందర్



**ఉప్పల్ ఏప్రిల్ 11 ( సూర్య రేఖ):** రామంతపూర్ మహాత్మ జ్యోతిరావు పూలే సేవా సంఘం అధ్యక్షులు బుర్ర మహేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం జ్యోతిరావు పూలే 198 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు దివిటి మల్లయ్య హాజరై జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన చేసిన సేవలు బడుగు బలహీన వర్గాలకు ఎంతో దోహదపడ్డావని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేపీ శాంత వెంకట్రావు సబిత రాజ్యలక్ష్మి డి సురేష్ కే లక్ష్మణ్ మల్లేష్ యాదవ్ తదితరులు తదితరులు పాల్గొని జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.

# నిజామాబాద్,కామారెడ్డి జిల్లాల్లో ఆసుపత్రుల అభివృద్ధికి,రాష్ట్ర ప్రభుత్వం రూ.85 కోట్లు మంజూరు



**కామారెడ్డి,ఏప్రిల్(సూర్య రేఖ):** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్‌లో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ హాజరైన ఆరోగ్య మంత్రి దామోదర్ రాజనారసింహ అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.అనంతరం ప్రకటన విడుదల చేశారు.ఈ సమావేశంలో షబ్బీర్ అలీ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రులలో మౌలిక సదుపాయాల ప్రస్తుత పరిస్థితిలతో సహా ముఖ్యమైన సమస్యలను వైద్యశాఖ మంత్రి దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించారు.నిజామాబాద్‌లోని 750 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో ఒకే ఒక ఫంక్షనల్ లిఫ్ట్ ఉందని,రోగుల సేవలను తీవ్రంగా దెబ్బతీస్తుందని ఆయన ఎత్తి చూపారు.వేగంగా స్పందించిన మంత్రి దామోదర్ రాజనారసింహ ఆసుపత్రికి రెండు అదనపు లిఫ్టులను మంజూరు చేశారు.డ్రైనేజీ,తాగునీటి సౌకర్యాల మెరుగుదలలతో సహా సమగ్ర పునరుద్ధరణ,అప్‌గ్రేడేషన్ పనులను కూడా ఆయన ఆమోదించారు.జిల్లాలో ఆసుపత్రి మౌలిక సదుపాయాలు,సిబ్బంది ఇతర నిత్యావసర అవసరాల కోసం మొత్తం రూ.63 కోట్లు మంజూరు చేయబడింది.కామారెడ్డిలోని 250 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో సీటీ స్కాన్ సౌకర్యం లేదని షబ్బీర్ అలీ మంత్రికి తెలియజేశారు.ప్రాథమిక రోగనిర్ధారణ మౌలిక సదుపాయాలు లేకపోవడంతో దిగ్భ్రాంతికి గురైన మంత్రి, వారంలోగా సిటి స్కాన్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.అత్యవసర సంరక్షణ అవసరాలను తీర్చడానికి అతను కొత్త ట్రామా సెంటర్‌ను కూడా మంజూరు చేశారు.గ్రామీణ మరియు సెమీ-అర్బన్ ప్రాంతాలలో పబ్లిక్ హెల్త్‌కేర్ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిబద్ధతకు ఇది స్పష్టమైన ప్రతిబింబమని ఆయన అన్నారు.ఈ సమావేశానికి డాక్టర్ నరేందర్ కుమార్ (మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్),వేముల థామస్(అదనపు డైరెక్టర్ డీఎంఈ),భోర?డే హేమంత్ సహాదేరావు(ఎండీ, టీఎస్ఎంఎస్ఐడీసీ),డాక్టర్ బీ.రవీందర్ నాయక్(డైరెక్టర్,పబ్లిక్ ఆరోగ్యం),డాక్టర్ ఫరీదా బేగం (సూపరింటెండెంట్,కామరెడ్డి జీజీహెచ్),డాక్టర్ వీ.శివ ప్రసాద్ (ప్రిన్సిపాల్,ప్రభుత్వ వైద్య కళాశాల,(కామారెడ్డి),డాక్టర్ శ్రీనివాస్ (సూపరింటెండెంట్,జీజీహెచ్ నిజమాబాద్),డాక్టర్ శివ ప్రసాద్ (ప్రిన్సిపల్,ప్రభుత్వ వైద్య కళాశాల,నిజామాబాద్) తదితర అధికారులు పాల్గొన్నారు.

# సింగరేణి ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి వేడుకలు



సాంఘిక సమానత్వ సాధనే మహాత్మా పూలేకు నిజమైన నివాళి

ఏరియా జిఎం జి దేవేందర్

**మందమర్రి,ఏప్రిల్11(సూర్య రేఖ):** మహాత్మా జ్యోతిరావ్ పూలే మహిళా విద్య కోసం,బడుగు వర్గాల అభ్యున్నతి కోసం,సకలజనుల సామాజిక న్యాయం కోసం పోరాడారని,సమాజంలో సాంఘిక సమానత్వం సాధించి చూపటమే మహాత్మ జ్యోతిరావ్ పూలేకి నిజమైన నివాళి అవుతుందని ఏరియా జిఎం జి దేవేందర్ పేర్కొన్నారు.మహాత్మా జ్యోతిరావ్ పూలే 198 వ జయంతి వేడుకలను సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించాలని సింగరేణి సి అండ్ ఎండి బలరాం ఆదేశాల మేరకు మందమర్రి ఏరియా సిఈఆర్ క్లబ్ లో శుక్రవారం జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ముందుగా మహాత్మ జ్యోతిరావ్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి,కేక్ కట్ చేశారు.మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి ఉత్సవానికి జీఎం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ 150 సంవత్సరాలకు పూర్వమే జ్యోతిరావ్ పూలే అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాటం చేశారని,మహిళల విద్య కోసం అవిశ్రాంతంగా శ్రమించారని,అణిచివేత చర్యలకు వ్యతిరేకంగా దళితుల తరపున పోరాడారని వివరించారు.తన భార్య సావిత్రి పూలేకి స్వయంగా విద్య నేర్పి,మహిళ ఉద్యమానికి నాయకత్వం వహించేలా చేశారని,ఆయన గొప్ప నిస్వార్థ సంఘ సంస్కర్త,మానవతావాది అని ప్రశంసించారు.సనాతన మూఢాచారాలకు వ్యతిరేకంగా ఆయన ఉద్యమాలు నడిపారని,అన్ని జాతుల,కులాల వారికి సాంఘిక,ఆర్థిక సమానత్వం కోసం తన జీవితాన్ని ధారపోసారని,ఆయన మహోన్నత సిద్ధాంతాలు మనకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.ఈ సభా కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ప్రెసిడెంట్ ఆఫ్ ది ఫంక్షన్ ఎస్ శ్యాంసుందర్,ఎస్ఓటు జిఎం కన్వీనర్ ఆఫ్ ది ప్రోగ్రాం విజయ్ ప్రసాద్,ఎఐటియుసి ఏరియా బ్రాంచ్ సెక్రెటరీ సలేంద్ర సత్యనారాయణ,సిఎంఓఏఐ ప్రెసిడెంట్ ఎస్ రమేష్,ఏజీఎం ఈ అండ్ ఎంవై వెంకటరమణ,ఎస్ఈ సివిల్ బి.రాము నాయక్,అడిషనల్ మేనేజర్ బిసి లైసెన్ ఆఫీసర్ ఎండి ముస్తఫా,అడిషనల్ మేనేజర్ వైస్ ప్రెసిడెంట్ పి రాజు,అడిషనల్ మేనేజర్ ఏరియా సెక్రటరీ పి.శ్రీధర్ గౌడ్,ఉద్యోగులు,అధికారులు పాల్గొన్నారు.


# పూలే సేవలు మరువలేనివి..

మహాత్మా జ్యోతి రావు పూలే ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి..

రాజేంద్రనగర్ లో ఘనంగా మహాత్మ జ్యోతి రావు పూలె జయంతి వేడుకలు..

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్









**రాజేంద్రనగర్,ఏప్రిల్ 11:** మహాత్మ జ్యోతిరావు పూలే సమాజంలో నెలకొన్న అసమానతలను తొలగించేందుకు నిరంతరం శ్రమించిన మహానుభావుడు పూలే అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు.శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే 199 వ జయంతి వేడుకలను మహాత్మా జ్యోతిరావు పూలే ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు బండారి శంకర్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ చౌరస్తా వద్ద ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్,మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి,మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు,మాజీ శాసనమండలి చైర్మన్ స్వామి గౌడ్,ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్,జాతీయ బీసీ కమిషన్ మాజీ మెంబర్ ఆచారి,లు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ. ..సమసమాజ స్థాపన కొరకు సొంత నిధులతో పాఠశాలను స్థాపించిన అక్షర ప్రదాత,సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే అని అన్నారు.ఇల్లాలి చదువు ఇంటికి వెలుగని అక్షరాస్యతకై నడుం బిగించిన విద్యా జ్యోతి స్త్రీ విద్యావ్యాప్తికుడు జ్యోతిరావు పూలే అని అన్నారు. జ్యోతిరావు పూలే అతని భార్యని విద్యావంతురాలని చేసి వెనుకబడిన తరగతులకు చదువు చెప్పి జ్ఞానవంతులని చేయాలని పాటుబడిన వ్యక్తులలో జ్యోతిరావు పూలే మొట్టమొదటి వ్యక్తి. బడుగు బలహీన వర్గాలకు ఆశాజ్యోతి గా నిలిచిన వ్యక్తి.ఎస్సీ ఎస్టీ మైనార్టీ బిసి సామాజిక తరగతులకు అణిచివేతకు గురి కాకుండా ఆ కాలంలో పోరాటాలు చేసిన వ్యక్తి జ్యోతిరావు పూలే.జ్యోతిరావు పూలే అతని భార్య సావిత్రి భాయ్ పూలేకు మాత్రమే కాకుండా..ప్రజలందరికీ విద్య దక్కాలని పాటుపడిన వ్యక్తి అని అన్నారు.పూలే బాలికల కోసం మొదటి పాఠశాలను 1848లో పూణేలో ప్రారంభించిన్నట్లు చెప్పారు. అదేవిధంగా వితంతువుల కోసం వసతిగృహాన్ని కూడా స్థాపించారన్నారు.భారతదేశ బాలికల కోసం పాఠశాలను ప్రారంభించిన ఘనత పూలే దంపతులకు దక్కిందన్నారు.పూలే దంపతుల ఆశయ సాధన కోసం కృషి చేయాలనీ సూచించారు. అనంతరం మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు మాట్లాడుతూ...మహాత్మా జ్యోతిరావ్ పూలే అణగారిన వర్గాల అభ్యున్నతికోసం,ప్రజల సమాన హక్కులకోసం ఉద్యమించిన సంఘ సంస్కర్త,సామాజికవేత్త అన్నారు. అంటరానితనం,కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు.జాతీయ బీసీ కమిషన్ మాజీ మెంబర్ ఆచారి మాట్లాడుతూ...మహిళలకు, బడుగు బలహీనర్గాలకు,అగ్ర వర్ణ పేదలకు చదువును అందించిన గొప్ప మహనీయుడని,విద్య లేకపోతే జ్ఞానం నశిస్తుందని,జ్ఞానం లేకపోతే అభివృద్ధి లోపిస్తుందని అభివృద్ధి లేకపోతే సంపాదన నశిస్తుందని గాఢంగా విశ్వసించిన గొప్ప మేధావి జ్యోతిరావు పూలే అని కొనియాడారు.అనంతరం మహిళలకు ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ చేతుల మీదుగా చీరలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు తోకల శ్రీనివాస్ రెడ్డి,పొడవు అర్చన జయప్రకాష్,సంగీత గౌరీ శంకర్,గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కోట వేణుగౌడ్, నాయకులు గణేష్ గుప్తా,వై.శ్రీధర్,మ్యాడం రామేశ్వరరావు,మల్లారెడ్డి,కొమురయ్య,మల్లేష్ యాదవ్,శ్రీనివాస్ నాయి, ఎస్.వెంకటేష్ కురుమ,పలుగు చెరువు మహేష్,టి.ప్రేమ్గౌడ్,రఘు యాదవ్,రాము యాదవ్,పోతురాజు యాదయ్య,కొత్త రాజశేఖర్ రెడ్డి,సోమ శ్రీనివాస్ గుప్తా,పిట్టల లక్ష్మణ్ ముదిరాజ్, , పంబాల రాజు,సూర్యం,దాసరి రమేష్,జాన్ పాల్, మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాల కమిటీ సభ్యులు కృష్ణమాచారి,సత్యనారాయణ ముదిరాజ్,కరణం యాదయ్య ముదిరాజ్,అడికె అర్జున్,భంగి శ్రీనివాస్,మల్లికార్జున్ గౌడ్,శ్రీకాంత్,శ్రీనివాస్ గౌడ్,వర్కాల చందు,బాబురావు,కొంపల్లి జగదీష్,కాశిగారి యాదగిరి,రాపోలు సత్తయ్య,కక్కులారం కృష్ణ,కిరణ్ చారి తదితరులు పాల్గొన్నారు.



# ఆదర్శంగా నిలుస్తున్న మందమర్రి తహశీల్దార్ సతీష్

సమస్య పరిష్కారానికి అపూర్వమైన చొరవ

**మందమర్రి,ఏప్రిల్11(సూర్య రేఖ):** ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలను విజయవంతంగా ముందుకు తీసుకెళ్తూ,ప్రజల సమస్యల్ని తీరుస్తూ,సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రభుత్వ,ప్రజల మన్ననలు అందుకుంటూ పలువురు అధికారులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు ఇటీవల బాధ్యతలు చేపట్టిన మందమర్రి మండల తహసీల్దార్ పనకంటి సతీష్ కుమార్.ప్రభుత్వ అధికారులు ఉద్యోగ ధర్మాన్ని నిబద్ధతతో విధులు నిర్వహించినపుడు ప్రజలు ప్రయోజనం పొందుతారని ప్రజలకు ఆత్మస్థైర్యాన్ని కలిగించే విధంగా తనదైన శైలిలో విధులు నిర్వహిస్తూ ప్రజలకు చేరువ అవుతున్నారు.వివరాల్లోకి వెళితే తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువకిరణాల పథకం కోసం లబ్దిదారులు పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకుంటున్నారు.ఆ పథకానికి మండల తహశీల్దార్ కార్యాలయం నుంచి కులం,ఆదాయ ధ్రువపత్రాలను జత పరచాలని నిబంధన పెట్టడంతో లబ్దిదారులు పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకుంటున్నారు.ఈ నేపథ్యంలో ఇదే అవకాశాన్ని అదునుగా భావించిన దళారులు సర్టిఫికేట్ లను గడువులోగా చేయిస్తామని నమ్మబలికి గాజుల సునిత అనే మహిళ నుండి కొంత డబ్బును అడ్వాన్స్ గా తీసుకున్నారు.దరఖాస్తు స్వీకరణ చివరి గడువు దగ్గర పడుతుండడంతో ఆందోళన చెందిన మహిళ దళారిని నిలదీయగా అతను ఇంతవరకు దరఖాస్తూ చేయకపోవడంతో మోసపోయానని గ్రహించిన మహిళా బాధితురాలు శుక్రవారం తహసీల్దార్ తో జరిగిన విషయాన్ని తెలిపి న్యాయం చేయాలని వేడుకుంది.వెంటనే స్పందించిన తహసిల్దార్ సతీష్ కులం,ఆదాయ ధ్రువ పత్రాలను మంజూరు చేసి ఆమెకు అందజేశారు.ఈ సందర్భంగా తహశీల్దార్ సతీష్ మాట్లాడుతూ..దరఖాస్తుదారులు దళారులను నమ్మి మోస పోవద్దని,జతపరచినవి సరైనవి ఐతే దరఖాస్తు చేసుకున్న వారికి నిర్ణీత సమయంలోగా ధ్రువపత్రం మంజూరువుతుందని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా సమస్య పరిష్కారానికి అపూర్వమైన చొరవ,ఔదార్యానికి బాధితులు గాజుల సునిత,భర్త కుమార్ లు తహశీల్దార్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలు కొనసాగిస్తాం



### ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

**నిజాంపేట,ఏప్రిల్11(సూర్యరేఖ):** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా ఇంచార్జ్ తాహసిల్దార్ రమ్యశ్రీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం బడుగు బలహీనవర్గాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడు గొప్ప సంఘసంస్కర్త అని అన్నారు.ప్రతి ఒక్కరూ జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలి అన్నారు. అనంతరం దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సీనియర్ అసిస్టెంట్ రమేష్,ఆర్ఐలు ప్రీతి,ఇమాద్,జూనియర్ అసిస్టెంట్ రమేష్,ఇరిగేషన్ ఆఫీసర్ రోజా రమణి,మండల వ్యవసాయ,సోమలింగారెడ్డి,తాహసిల్దార్ స్టాఫ్ కళ్యాణ్,శివ,రాజలింగం,సత్యనారాయణ, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీకాంత్ గౌడ్,రవి,గ్రామ తాజా మాజీ ఉపసర్పంచ్ కొమ్మాట బాబు,మాజీ కో ఆప్షన్ సభ్యులు గౌస్,తదితరులు పాల్గొన్నారు.



# మహాత్మ జ్యోతిబాపూలే సేవలు మరువలేనివి

### బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ,పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్



**బెల్లంపల్లి,ఏప్రిల్ 11(సూర్యరేఖ):** బెల్లంపల్లి బహుజనుల సంక్షేమానికై కాంక్షించిన మహానేత,దేశ విద్యాభివృద్ధికి ఎనలేని కృషిచేసిన మహెూన్నత వ్యక్తి మహాత్మ జ్యోతిబాపూలే సేవలు మరువలేనివని బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ,పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్ అన్నారు.శుక్రవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,యూనిట్ 2 ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబాపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ...పూలే వంటి ఎందరో మహనీయుల దయవల్ల నేడు ప్రతి ఒక్కరికి చదువుకునే అవకాశం లభిస్తుందని గుర్తు చేశారు. అలాంటి మహనీయుల అడుగుజాడల్లో నడుస్తూ బాగా చదువుకొని ఉన్నత విద్యాభివృద్ధికి ఎవరికివారు కృషి చేసుకోవాలని సూచించారు. తద్వారా ఉజ్వల భవిష్యత్తు లభించి బతుకు బాగుంటుందని తెలిపారు.పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి విద్యార్థి బాగా చదివి పరీక్షలు రాసి ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్, ఐక్యూ ఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, బొంకురి,ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ యూనిట్ టు కో ఆర్డినేటర్లు రేష్మ,గజెల్లి మోహన్,అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు,బోధనేతర సిబ్బంది,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# హరిహర పుత్ర అయ్యప్ప స్వామి జన్మదినం సందర్భంగా అభిషేక కార్యక్రమాలు





**నిజాంపేట,ఏప్రిల్11(సూర్యరేఖ):** మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయ నిర్మాణ ఆవరణలో శుక్రవారం హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామి జన్మదినం సందర్భంగా అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అభిషేక కార్యక్రమాలు చేపట్టామన్నారు.ఈ సందర్భంగా గ్రామ పురోహితులు వేలేటి విశ్వేశ్వర శర్మ మాట్లాడుతూ... హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామి జన్మదినం సందర్భంగా అయ్యప్ప సేవాసమితి వారి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి ధూప దీప నైవేద్యాలతో అభిషేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. గ్రామంలో ప్రతి సంవత్సరం 60 మంది అయ్యప్ప స్వాములు మాలధారణ ధరించి అయ్యప్ప స్వామిని కొలుస్తారని గ్రామంలో అయ్యప్ప స్వామి ఆలయం నిర్మించేందుకు కంకణ బద్ధులై అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకలను ఆలయ ప్రాంగణంలో చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు.హరిహరపుత్ర అయ్యప్ప స్వామి కృపతో గ్రామ ప్రజలందరూ అష్ట ఆయువు ఆరోగ్యాలతో ఉండాలని వేడుకున్నామన్నారు.ఈ కార్యక్రమంలో గురు స్వాములు యాద గౌడ్,రంజిత్ గౌడ్,వీరమల్లు బాలయ్య,నాయిని వెంకటేశం,ప్రదీప్ రెడ్డి,తిరుపతి రెడ్డి,వెల్దుర్తి వెంకటేష్ గౌడ్,శ్రావణ్ కుమార్,మావురం కృష్ణ కాంత్,రఘుగౌడ్,మధుగౌడ్, తిరుమలగౌడ్,శ్రీనివాస్ గౌడ్,ప్రణయ్ గౌడ్,వినయ్ గౌడ్,మ్యాదరి మధు,పవన్,గోపిగౌడ్, పరశు రాములు,తదితరులు పాల్గొన్నారు.

# శాంతిఖని మైన్స్ పై మహాత్మా జ్యోతి బాపూలే విగ్రహ ఆవిష్కరణ





**బెల్లంపల్లి,ఏప్రిల్ 11(సూర్యరేఖ):** సింగరేణి చరిత్రలో 137 సంవత్సరాలనుండి ఎపుడు జరగని విదంగా శాంతిఖని మైన్ పైన మహత్మ జ్యోతి బాపూలే విగ్రహ ఆవిష్కరణ చేసి జయంతి ఉత్సావాలు ఘనంగా నిర్వహించారు.అనంతరం శాంతిఖని బీసీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీసీ జెండా ఆవిష్కరణ చేశారు.ఈ కార్యక్రమంలో బీసీ అస్సోసియేషన్ సభ్యులు జిఎం.విజయ్ ప్రసాద్,బీసీ లైజన్ ఆఫీసర్ ముస్తఫా,ఏరియా ఇంజనీర్ వెంకటరమణ,ఎస్టి లైజన్ ఆఫీసర్ జాదవ్ బాపు,బీసీ ఏరియా ఉపాధ్యక్షుడు పిట్ట రాజు,అధ్యక్షులు బీమరి వెంకటేష్,ఉపాధ్యక్షుడు దాడి రమేష్,జనరల్ సెక్రటరీ జె.శ్యామ్,కార్యదర్శి ఎంఏ.ఖాదర్,జనరల్ షిఫ్ట్ ఇంచార్జి బి.మొండిఏ.రిలే.ఏ.వెంకటేష్,బీరిలేదేవా రమేష్,సిరిలే ఆడే.మహేష్,బీసీ అసోసియేషన్ కార్మికులు,శాంతిఖని కార్మికులు,తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో గావ్ చలో..బస్తీ చలో



**కామారెడ్డి,ఏప్రిల్ 11(సూర్యరేఖ):** భారతీయ జనతా పార్టీ కామారెడ్డి శాఖ ఆద్వర్యంలో 16వ వార్డులో గావ్ ఛలో బస్తీ ఛలో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా బూత్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వ లబ్ధిదారులను కలవడం జరిగింది.స్థానిక హనుమాన్ దేవాలయంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి హాజరై ప్రసంగించార. ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం ఉన్న పార్టీ బీజేపీ అని,ప్రస్తుతం కేంద్రంలో మూడవ సారి అధికారంలోకి రావడమే కాకుండా,12 రాష్ట్రాల్లో స్వంతగా అధికారంలో ఉండి,మరో 6 రాష్ట్రాల్లో సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉందన్నారు.దేశంలో దాదాపు మూడవ వంతు భూభాగంలో బీజేపీ అధికారంలో ఉందని,2 సీట్లతో ప్రస్థానం ప్రారంభమై ప్రస్తుతం కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు అన్ని రాష్ట్రాలు,అన్ని ప్రాంతాల్లో బీజేపీ విస్తరించిదని,ఇదే స్ఫూర్తితో తెలంగాణలో కూడా అధికారంలోకి వచ్చే వరకు ప్రతి కార్యకర్త కంకణ బద్ధుడై పని చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి నరేద్దరెడ్డి,పట్టణ అధ్యక్షులు శ్రీకాంత్,లక్ష్మీ రెడ్డి,వేణు,భారత్,నరే%శ్ %దర్,విజయ్,ప్రవీణ్,భూమేష్, నేహాల్,రాజేష్,రాజగోపాల్,శ్రీనివాస్,విపుల్ జైన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి 2 టౌన్ పోలీస్ స్టేషన్ ను సందర్శించిన పోలీస్ కమీషనర్



**బెల్లంపల్లి,ఏప్రిల్ 11 (సూర్యరేఖ):** రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శుక్రవారం బెల్లంపల్లి 2 టౌన్ పోలీస్ స్టేషన్ ను సందర్శించారు.పోలీస్ కమిషనర్ ముందుగా స్టేషన్ పరిసరాలు పరిశీలించి,సిబ్బందితో మాట్లాడడం జరిగింది.అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు వస్తున్నాయని రిసెప్షన్ కానిస్టేబుల్ ని అడిగి తెలుసుకున్నారు.ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఎస్ఐ,సిబ్బందికి సూచించారు.సీపీ వెంట డీసీపీ మంచిర్యాల ఏ. భాస్కర్,ఏసీపీ బెల్లంపల్లి రవి కుమార్,బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్,తాండూర్ సీఐ కుమారస్వామి,బెల్లంపల్లి 2 టౌన్ ఎస్ఐ మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు వరం సీఎం సహాయనిధి

### పేద కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే గడ్డం వినోద్..





**బెల్లంపల్లి,ఏప్రిల్ 11 (సూర్యరేఖ):** ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి అన్నారు.పట్టణానికి చెందిన అనుమాండ్ల పోషం అనారోగ్యం కారణంగా నీమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.అతడి ఆరోగ్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.4లక్షల ఎల్ఓసిని ఆయన కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు.ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ...ఇలాంటి ఎమ్మెల్యే దొరకడం చాలా అదృష్టమని,బెల్లంపల్లికి అభివృద్ధి పదంలో నడుపుతున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్ అని ప్రతి బీదవాడికి నేనున్నానని ధైర్యం చెబుతూ సహాయ సహకారాలు అందిస్తున్న ఎమ్మెల్యేకు ధన్యవాదములు తెలిపారు.

# నిజాంపేటలో సిసి రోడ్డు వేసి వదిలేశారు..



**నిజాంపేట,ఏప్రిల్11(సూర్యరేఖ):** మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించి మధ్యలోనే వదిలేశారు.దీంతో పాఠశాలకు వెళ్లే పిల్లలు ఇబ్బందులకు గురవుతున్నారు.పనులను ప్రారంభించి మధ్యలోనే వదిలేయడం కాంట్రాక్టర్ వైఫల్యమా లేదా రాజకీయ నాయకుల నిర్లక్ష్యమా అంటూ గుసగుసలు వినిపిస్తున్నాయి.కాంగ్రెస్ ప్రభుత్వం ఒకవైపు గ్రామాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తుంటే గ్రామ అభివృద్ధికి ఎవరు ఆటంకం చేస్తున్నారో అని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.ఇకనైనా నాయకులు అధికారులు స్పందించి సీసీ రోడ్డు పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని కాలనీవాసులు మొరపెట్టుకుంటున్నారు.

## రాజ్య తాండలో బోర్ కు

# నూతన పంపు మోటార్ ఏర్పాటు..



**నిజాంపేట,ఏప్రిల్11(సూర్యరేఖ):** మండలం నస్కల్ గ్రామ పరిధిలో గల రాజ్యా తాండలో ఎంపీపీ నిధుల్లో భాగంగా నూతన బోర్ వేయించడం జరిగింది.ఇట్టి బోర్ కు శుక్రవారం తాజా మాజీ ఎంపీపీ దేశెట్టి సిద్ధ రాములు ఆధ్వర్యంలో నూతన పంపు మోటర్ తో పాటు వాటర్ ట్యాంకును ఏర్పాటు చేయడం జరిగింది.బోర్ పంపు మోటార్ కు సహకరించిన మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు,స్థానికమాజీ ఎంపీపీ సిద్ధరాము,లకు తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు.

# సన్నబియ్యం" లబ్ధిదారుని ఇంట భోజనం చేసిన పరమేశ్వర్ రెడ్డి,రజిత పరమేశ్వర్ రెడ్డి

### సామన్యుడితో కలిసి మెలగడమే ప్రజాప్రభుత్వం ధ్యేయం.!!





**ఉప్పల్,ఏప్రిల్ 11 (సూర్యరేఖ):** ప్రజా ప్రభుత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం,గృహజ్యోతి 200 యూనిట్లు,గ్యాస్ సబ్సిడీ,ఇందిరమ్మ ఇండ్లు,సన్నబియ్యం లాంటి మహెూన్నత సంక్షేమ పథకాలను అందుకుంటున్న ఉప్పల్ శాంతినగర్ వాస్తవ్యులైన గుండేలి అనిత అనే ఓ నిరుపేద లబ్ధిదారుని ఇంటికి వెళ్లి వారింట ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యంతో ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి,ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి,లు భోజనం తిన్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ...ప్రభుత్వం కొలువుదీరిన అతితక్కువకాలంలోనే అద్భుతరీతిలో ప్రజాభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రజాధారణ పొందుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రజాప్రభుత్వం చేస్తున్న కృషిపట్ల లబ్ధిదారుని కుటుంబ సభ్యులతో కలిసి కార్పొరేటర్ సంతోషాన్ని పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బాకారం లక్ష్మణ్,లింగంపల్లి రామకృష్ణ,కోర్డినేటర్ బజారు జగన్నాథ్ గౌడ్,లూకాస్,తుమ్మల దేవి రెడ్డి,సల్ల ప్రభాకర్ రెడ్డి,సుంకు శేఖర్ రెడ్డి,అలీం,కాజా మౌలానా,సుధాకర్ పోలిశెట్టి,నవీన్ యాదవ్,గోవింద్ కుమార్,రాజేందర్ రెడ్డి,వర్కాల మదన్ గౌడ్,కడప నర్సింగ్,తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మ జ్యోతిరావు పూలేకు ఘన నివాళులర్పించిన నేతలు





**ఉప్పల్,ఏప్రిల్ 11 (సూర్యరేఖ):** మహాత్మా జ్యోతి రావు పూలే జయంతి సందర్భంగా సైనికపురి చౌరస్తాలో జ్యోతిరావు పూలే విగ్రహానికి మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి,రాష్ట్ర బీఆర్ఎస్ లీగల్ సెల్ నాయకులు,హైకోర్టు మాజీ ఏజిపి గొరిగే మల్లేష్ కురుమ,లు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా గొరిగే మల్లేష్ మాట్లాడుతూ...మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు మనందరము ఐక్యంగా ఉండి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొండ్ర హనుమంత్ కురుమ,బర్ల కృష్ణ కురుమ,గొరిగే ఐలేష్,బోడెల్లి రాజు,మణిదీప్ పాల్గొన్నారు.

# మహాత్మా జ్యోతి రావు పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

### మాజీ కౌన్సిలర్ కేశవరం ఆంజనేయులు



**మల్లాపూర్,ఏప్రిల్ 11(సూర్యరేఖ):** మల్లాపూర్ ఎలిఫెంట్ బ్రిడ్జి వద్ద మహాత్మా జ్యోతి రావు పూలే జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి మాజీ కౌన్సిలర్ కేశవరం ఆంజనేయులు,బిజెపి డివిజన్ అధ్యక్షులు శైలేష్ రెడ్డి,లు పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతి,సంఘ సంస్కర్త,స్ఫూర్తిప్రదాత మహాత్మా జ్యోతి రావు పూలే అని కొనియాడారు.ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## కుల వివక్ష నిర్మూలన కోసం జ్యోతిరావు పూలే పోరాటం

### విద్యతోనే మనిషి మహనీయుడు..

### ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి






**ఉప్పల్,ఏప్రిల్ 11(సూర్యరేఖ):** బడుగు,బలహీనవర్గాల అభ్యున్నతికి విశేష కృషిచేశారని ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి అన్నారు.మహాత్మ జ్యోతిరావు పూలే 198 జయంతిని పురస్కరించుకొని ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి సైనిక్ పురి,మల్లాపూర్ చౌరస్తాలలోని పూలే విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ...విద్యావ్యక్తి ద్వారా కుల వివక్షతను సాంఘిక దురాచారాలను మూఢనమ్మకాలను నిర్మూలించేందుకు కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని,స్త్రీ విద్యా వికాసానికి బాటలు వేసిన మహనీయుడు పూలే అని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్,కార్పొరేటర్లు దేవేందర్ రెడ్డి,ప్రభుదాస్,సీనియర్ నాయకులు సాయి జెన్ శేఖర్,నాగేశ్వరరావు,బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు,పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పూలే ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### కుల వివక్ష నిర్మూలన కోసం జ్యోతిరావు పూలే పోరాటం..

### మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి





**రాజేంద్రనగర్,ఏప్రిల్11:** మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రి,మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి,మాజీ శాసనమండలి చైర్మన్ స్వామి గౌడ్, లు అన్నారు.శుక్రవారం పూలే జయంతిని పురస్కరించుకొని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో పి.సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ...పూలే సమాజంలో అసమానతలపై నిరంతరం పోరాడారని గుర్తు చేశారు.అంటరానితనం,కుల వివక్ష నిర్మూలన కోసం పూలే అలుపెరుగని పోరాటం చేశారని తెలిపారు.స్త్రీ విద్య కోసం పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే అని ఉద్ఘాటించారు.సమసమాజ నిర్మాణంలో జ్యోతిరావు పూలే కీలక పాత్ర పోషించారని గుర్తుచేసుకున్నారు.మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అభివర్ణించారు.పూలే ఆశయ సాధనకు కృషి చేయడమే మనం అర్పించే ఘన నివాళి అని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. రాజేంద్రనగర్ కార్పొరేటర్ అర్చన జయ ప్రకాష్, రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి,కోలన్ సుభాష్ రెడ్డి,మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు,మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్ కురుమ,రాము యాదవ్,అక్కం రఘు యాదవ్,సోమ శ్రీనివాస్ గుప్తా,మైసిరెడ్డి, ఎల్.రాజు,అరుణ్ ముదిరాజ్,రాజు,కొంపల్లి జగదీష్,ఈశ్వర్, వెంకటేష్,భూదేవి,అరుణరెడ్డి,అశోక్ కుమార్,సోమసందీప్,రాజ్ కుమార్,సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మ జ్యోతిరావు పూలేకు ఘనంగా నివాళులర్పించిన కాంగ్రెస్ నేతలు





**ఉప్పల్,ఏప్రిల్11(సూర్యరేఖ):** మల్లాపూర్ 5వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కప్పర సాయి కిరణ్ గౌడ్ ఆధ్వర్యంలో జోతి రావు పూలే 198 వ జయంతి వేడుకలు ఘనంగా జరిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్లాపూర్ కొడినేటర్ ఇంచార్జ్ సింగిరెడ్డి ధనపాల్ రెడ్డి హాజరై పూలమాల వేసి నివాళు లర్పించారు.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొంగోని ఉమేష్ గౌడ్,పీజీ.సుదర్శన్, దంతురి రాజుగౌడ్,కోయగూర బాలరాజ్ గౌడ్,బెల్లం గట్టయ్య,మెరుపుల బాలరాజ్ గౌడ్,పర్వాతలు, ఫాసుదిన్,మనోహర్,జోష్,శ్రీనివాస రెడ్డి,ఎస్వి.కిట్టు, వర్మ శ్రీనివా రెడ్డి,పంజాల శ్రీనివాస,ఉపేందర్ రెడ్డి, సతీష్,కళావతి,నిర్మల రెడ్డి,ముజీబ్,ఫెరోజ్,వినేష్, యాదవ్,ప్రవీణ్ గౌడ్,అశోక్ గౌడ్,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## రామయంపేటలో ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు





రామాయంపేట,ఏప్రిల్ 11(సూర్యరేఖ): రామాయంపేట మండల కేంద్రంలో హైదరాబాద్ రోడ్డులో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి 199వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సబ్బండవర్గాల నాయకులు మాట్లాడుతూ... సమాజంలో కుల వివక్ష అంటరానితనంపై పోరాటం చేసి వెనుకబడిన బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయుడని అన్నారు.మహిళల విద్యాభ్యాసం కోసం అహర్నిశలు కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే అని కొనియాడారు.సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహానుభావుడని అన్నారు.జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయాలకు అనుగుణంగా సమాజంలో యువత ప్రతి ఒక్కరు నడుచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి సుప్రభాత రావు,సరాపు యాదగిరి,రమేష్ రెడ్డి,పోచమ్మల అశ్విని శ్రీనివాస్,దేమే యాదగిరి,దోమకొండ యాదగిరి,సుందర్ సింగ్,డా.రాజశేఖర్ రెడ్డి,పాతూరు రాజు,మాసాయిపేట మల్లేశం,లద్ద నర్సింలు సురేష్ నాయక్,నెహ్రూ నాయక్,తదితరులు పాల్గొన్నారు.


# అయ్యప్ప స్వామి ఆశీస్సులు అందరి మీద ఉండాలి

### ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**రామంతపూర్,ఏప్రిల్ 11 (సూర్యరేఖ):** అయ్యప్ప స్వామి ఆశీస్సులు అందరి మీద ఉండాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.శుక్రవారం రామంతపూర్ డివిజన్ పరిధిలోని న్యూగోకుల్ నగర్ లో అయ్యప్ప దేవాలయంలో విగ్రహ పునర్ ప్రతిష్టాపన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు గంధం నాగేశ్వర్ రావు,బన్నాల ప్రవీణ్ ముదిరాజ్,పవన్,శ్రీనివాస్ రెడ్డి,కిషోర్ జహాగీర్ చంద్ పా,బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# ఓటమి నేర్పే పాఠం












జీవితంలో ఓడిపోతే.. ఎవరేంటో తెలుస్తుంది. నువ్వేంటో అర్థమవుతుంది. ప్రపంచం ఏమిటో తెలిసొస్తుంది. విజయం అనే పదార్థానికి ఓటమి కొత్త రుచిని అందిస్తుంది. ప్రతీ ఎదురుదెబ్బ.. మళ్లీ పుంజుకోవడానికి అవసరమైన అవకాశాన్ని ఇస్తుంది. అంతకుముందుతో పోలిస్తే గొప్పగా నిలవడానికి దోహదం చేస్తుంది. ఓటమి ఎరుగని వ్యక్తితో పోలిస్తే.. వైఫల్యాలతో పడిలేచిన మనిషే దృఢంగా ఉంటాడు. అందుకే ఓటములకు బెంబేలెత్తిపోకండి. పరాజయాలను గుండెకు హత్తుకోండి. ఫెయిల్యూర్ నేర్పిన పాఠం ఒంటబట్టించుకుంటే.. జీవన సమరంలో అంతిమ విజేత మీరే! 'విజయం వరించినప్పుడు సంబురాలు చేసుకోవడం మంచిదే! కానీ, ఓటమి పాఠాలు నేర్చుకోవడం అంతకంటే ముఖ్యం' అంటాడు మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు, వితరణశీలి బిల్ గేట్స్. విజయవంతైన ఏ వ్యక్తి కథయినా సాదాసీదాగా సాగిపోదు. అందులో వాళ్లు ఎదుర్కొన్న అవమానాలు, గాయాలు, కష్టాలు, వేదన, మానసికంగా నలిగిపోవటాలు.. ఇలా ఎన్నెన్నో అనుభవాలు కనిపిస్తాయి. జీవితంలో ఎదురైన పరాజయాలే తమకు అద్భుతమైన తెలివితేటలు నేర్పాయనీ, తర్వాత ప్రయాణంలో తారసపడిన ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనే శక్తియుక్తులు ఇచ్చాయనీ విజేతల మాట! ఉలి దెబ్బలు ఓర్చుకున్న శిల.. అందమైన శిల్పంగా మారినట్టు, ఓటమి నేర్పిన పాఠాలు.. మనిషిని ఉన్నతుడిగా, అజేయుడిగా నిలబెడతాయన్నమాట! ఏదో ఒక రూపంలో ప్రతిఘటన ఎదురుకాకపోతే.. జీవితంలో మజా రాదు. ఎన్నో కోతలకు గురైతే గానీ వజ్రం విలువ పెరగదు! తీవ్రమైన యాతనలు ఎదురైనా తట్టుకున్నప్పుడే మన విలువ అపరిమితంగా పెరుగుతున్నది సత్యం.

## ఏది విజయం? ఏది అపజయం?

పరీక్షల్లో తక్కువ గ్రేడ్ రావడం, పరీక్ష తప్పటం, ఇంటర్వ్యూకి పిలుపు రాకపోవడం, వచ్చినా ఉద్యోగం పొందలేకపోవడం, వృత్తివ్యాపారాల్లో ఎదురీతలు, కష్టానికి తగిన ప్రతిఫలం పొందకపోవడం, జీవితంలో అగచాట్లు.. ఇవన్నీ వైఫల్యాలు అనుకోవచ్చు. ప్రఖ్యాత విశ్వవిద్యాలయంలో సీటు రావడం, క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో భారీ వేతనంతో ఉద్యోగం పొందడం, కెరీర్‌లో ఊహించనంతగా ఎదగడం, సవాళ్లు ఎదురైనా మీ నిజాయతీని కాపాడుకోవడం, కీర్తి ప్రతిష్ఠలు పొందడం, అందరి ఆదరాభిమానాలు సంపాదించడం, మరిన్ని అవకాశాలను అందుకోవడం ఇవన్నీ గెలుపుబాటలో మైలురాళ్లుగా చెప్పుకోవచ్చు. వైఫల్యం వచ్చినంత మాత్రాన జీవితం ముగిసినట్టుకాదు. ఒక్క విజయంతో అన్నీ సాధించానని అనుకోవడం ఎలా తప్పో.. ఒక్క అపజయంతో అన్నీ కోల్పోయానని కుంగిపోవడమూ సమంజసం కాదు. అయితే ఓటమి మొదట నిరాశకు గురిచేస్తుంది. అయినవారు కూడా చులకనగా చూస్తారన్న భావన కలిగిస్తుంది. ఆ ఆవేదనలోనే కూరుకుపోతే బతుకు పరుగు అక్కడితో ఆగిపోతుంది. లోతుగా ఆలోచిస్తే.. ప్రతి ఓటమీ ఓ అద్భుతమైన పాఠం చెబుతుంది. మిమ్మల్ని ఆలోచింపజేస్తుంది. పరిస్థితులను అవలోకనం చేసుకోమని బోధ చేస్తుంది. అందుకు తగ్గట్టుగా మిమ్మల్ని మీరు తీర్చిదిద్దుకోవాలని హెచ్చరిస్తుంది. ఉదాహరణకు ఒకసారి బ్రేక్ దెబ్బతిని బైక్ పైనుంచి పడిపోయామని అనుకోండి. ఆ తర్వాత నుంచి బైక్ ఎక్కిన ప్రతిసారీ.. బ్రేకులు సరిగ్గా పడుతున్నాయో లేదో చెక్ చేసుకోవడం అలవాటుగా మారుతుంది. ఇంటి గుమ్మానికి తల కొట్టుకుంటే, ఇకపై జాగ్రత్తగా నడవాలని గ్రహిస్తాం. గుమ్మం దాటిన ప్రతిసారీ.. తెలియకుండానే తలొంచుకుంటాం. ఓటమి నేర్పిన పాఠమే కదా ఇది. అయితే వాటిని గుర్తించి, అందుకు తగ్గట్టుగా నడుచుకుంటేనే ఓటమి మనల్ని గెలుపు తీరాలకు చేరువ చేస్తుంది. లేకపోతే.. జీవితంలో ముందుకు వెళ్లడం అసాధ్యమవుతుంది. ఓ వ్యక్తి పిండి వ్యాపారం చేసేవాడు. అందులో రాణించలేకపోయాడు. పశ్చిమ గాలులు విపరీతంగా వీయడం వల్ల పిండి గాలికి ఎగిరిపోయేది. మరోవైపు ఉప్పు వ్యాపారం చేసే వ్యక్తి లాభాలు గడించాడు. ఈ విషయం తెలిసిన మొదటి వ్యక్తి మనసు మార్చుకుని తనూ ఉప్పు వ్యాపారం చేద్దామనుకున్నాడు. ఉత్సాహంగా రంగంలోకి దిగాడు. అప్పటికి వర్షకాలం రావటంతో వానకు మొత్తం ఉప్పు కరిగిపోయి వ్యాపారంలో నష్టం వచ్చింది. పనిని ఎంచుకోవటంలో లోపమే ఇక్కడ వైఫల్యానికి కారణం. ఆఫ్రికాలో తమకు మార్కెట్ ఉంటుందో, లేదో తెలుసుకోవాలని ఓ సంస్థ ఇద్దరు సేల్స్‌మెన్‌లను అక్కడికి పంపింది. ఒకరు తూర్పు తీరానికీ, మరొకరు పశ్చిమ తీరానికీ వెళ్లారు. ఇద్దరూ ప్రాథమికంగా సర్వే చేసి తమ నివేదికలను సంస్థ యజమానికి పంపారు. 'ఇక్కడ ఒక్కరు కూడా షూ ధరించటం లేదు. ఇక్కడ అసలు మార్కెట్టే లేదు' అని మొదటి వ్యక్తి తన సర్వే సారాంశాన్ని పేర్కొన్నాడు. రెండో వ్యక్తి అందుకు భిన్నంగా 'ఇక్కడ షూ ధరించే వ్యక్తులు ఎవరూ లేరు. మనకు మార్కెట్ బ్రహ్మాండంగా ఉంటుంది. వెంటనే ఇన్వెంటరీ పంపండి' అన్నాడు. మనం చూసే దృష్టి కోణాన్ని బట్టి పరిస్థితులు ఉంటాయి! ఇద్దరిలో ఒకరు ఇక్కడ పరిస్థితులు మార్చలేమని భావిస్తే, మరొకరు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని గుర్తించాడు. గెలుపు, ఓటమి సహజం అనే వైఖరి ఉన్నవాళ్లు మొదటి రకం సాధారణ మనుషులు. ప్రతికూల పరిస్థితుల్లోనూ అనుకూలతను దర్శించగలిగిన వాడు రెండో వ్యక్తి తరహా మనిషన్నమాట! 'వైఫల్యం అంటే నేర్చుకోవడంలో తొలి ప్రయత్నం' అంటారు ఏపీజే అబ్దుల్ కలాం. ఓడిపోతామన్న భయం మనిషిని గెలుపునకు దూరం చేస్తుంది. అదే ఓటమిని స్వీకరించగల నైతిక ఆత్మస్థైర్యం ఉంటే.. గెలుపు బావుటా ఎగురవేయడం పెద్ద కష్టమేం కాదనిపిస్తుంది.

## ఓటమి అంటే..

వైఫల్యం వచ్చిందంటే మీరు ఓడిపోయినట్టు కాదు. విజయం కోసం మీరు తాపత్రయపడుతున్నారని! విజయం వరించలేకపోవడానికి కారణాలు అనేకం ఉంటాయి. మీరు పనిచేసే విధానంలో ఏదో లోపం ఉండొచ్చు. విజయాన్ని అందుకునేంత శక్తిసామర్థ్యాలను, సమయాన్ని వెచ్చించి ఉండకపోవచ్చు. అంతమాత్రానికే.. 'మనతో కాదు' అని తోకముడిస్తే గెలుపు అందని ద్రాక్షగానే మిగిలిపోతుంది. మరో రకంగా ప్రయత్నించి చూడండి! మరింత సమయం వెచ్చించండి. మరింత లోతుగా అర్థం చేసుకుంటే.. ఓటమి ఎంత ఎరుకతో ఉండాలో చెబుతుంది. ఆ దిశగా ప్రయత్నిస్తే విజయపథం కనిపిస్తుంది. ఉదాహరణకు శాస్త్రవేత్తలు చేసే ప్రతి ప్రయోగం విజయవంతమైతే.. సైన్స్‌లో ఇన్ని ఆవిష్కరణలకు ఆస్కారం ఉండేది కాదేమో! ప్రయోగాల్లో వైఫల్యమైన ప్రతిసారీ వాళ్లు మరో కొత్త ఆవిష్కరణకు నాంది పలికారు. మీ ఆలోచనలను 'రీ డైరెక్ట్' చేసుకోవడం వల్ల.. మరిన్ని ఆప్షన్లు ఎదురవుతాయి. కొత్త మార్గంలో ప్రయాణించగలుగుతారు. ఓటమి పాలైనంత మాత్రాన మీరు ఆత్మగౌరవాన్ని కోల్పోయినట్టు కాదు. మళ్లీ కొత్తగా ప్రయత్నించటానికి ధైర్యాన్ని పోగు చేసుకున్నారన్నమాట!! ఒక ఇంటర్వ్యూలో ఎంపిక కానంత మాత్రాన మీరు పనికిమాలిన వాళ్లు కాదని గ్రహించాలి. ఆ అపజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని మీ నైపుణ్యాలను నిజాయతీగా విశ్లేషించుకోవాలి. అప్పుడు గతంలో కన్నా గొప్ప అవకాశం మీ తలుపు తడుతుంది. ఓడిపోవటం అంటే మీకేదీ మిగలలేదని కాదు. కొత్తదారులలోకి మీరు అడుగుపెట్టవలసిన సమయం వచ్చిందని తెలుసుకోండి. పట్టుదల, ఏకాగ్రతతో ముందుకు వెళ్లండి. ఓడిపోవటం అంటే ప్రయత్నాన్ని ఆపేయమని కాదు. మరింత శక్తిని వెచ్చించి కష్టపడవలసిన అవసరం ఉందన్న సూచన అది. కొన్ని సంవత్సరాల పాటు అహోరాత్రులు కష్టపడితే గానీ విజయం సాధ్యం కాని సివిల్ సర్వీసు పరీక్షల్లో నాలుగోసారి, ఐదోసారి విజయం సాధిస్తున్నవారు ఎంతమంది లేరు. వాళ్లంతా తొలి ప్రయత్నాల్లో విఫలమైన వారేగా! ఓడిపోయారంటే మీరు సాధించలేరని కాదు. ఓర్పు, పట్టుదలతో మరింత ప్రయత్నించాలని అర్థం. ఒక మార్గంలో ఎదురయ్యే అపజయం.. ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకునేందుకు సిద్ధంగా ఉండమని సూచన చేస్తుంది. ఓడిపోయారంటే మీరు బలహీనులని కాదు. మరింత బలం పుంజుకోవాలన్నమాట! వరుస ఓటములు ఎదురైతే.. మీ జీవితం వృథా అని భావించొద్దు. మళ్లీ కొత్తగా ప్రారంభించటానికి ఓ సాకు దొరికిందని సంతోషించాలి. ఓడిపోయారంటే మీకు అవకాశం తప్పిపోయినట్టు కాదు. మీకు రెక్కలు ఎగరటానికి సిద్ధమవుతున్నాయని భావించాలి. మొత్తంగా ఓటమి అంటే గెలుపు వాయిదా పడటం మాత్రమే! ఆ గెలుపు తీరం చేరే దాకా అలుపెరగని పోరాటం కొనసాగించాల్సిందే! ఓటమి నేర్పిన గుణపాఠం.. గెలుపు పాఠాన్ని చెబుతుంది. జీవితంలో గెలిచినప్పుడు మనమే కాదు.ఎవరైనా సంతోషంగానే ఉంటారు. ఓడిపోయినప్పుడు కూడా నిబ్బరంగా ఉండటం, ధైర్యంగా వ్యవహరించటం ఎలాగో తెలిసి ఉండాలి. వైఫల్యాన్ని హుందాగా స్వాగతించ గలిగితే.. గెలుపు వంగి వంగి సలాములు చేస్తుంది. అందుకే వైఫల్యం ఎదురైనప్పుడు లక్షసార్లు ధన్యవాదాలు చెప్పండి. ఇతరుల నుంచి మీ వృత్తికి సంబంధించిన విషయాలు నేర్చుకోండి. ఇతరుల వైఫల్యాల నుంచి మీరు పాఠాలు నేర్చుకోగలిగితే తెలివైన వారు అనిపించుకుంటారు. వైఫల్యాలు మీ తలుపు తడుతున్నాయంటే, మీరు కొత్త పాఠాలు నేర్చుకుంటున్నారని భావించండి. ఆ పాఠాల వల్ల అచిర కాలంలోనే మీరు అద్భుతమైన విజయాన్ని అందుకోగలుగుతారు.

## విజయం సాధించాలంటే..

ఓటమి పాలైనప్పుడు ఎవరిని వాళ్లు నిందించుకుంటారు. ఇంట్లోవాళ్లు సరేసరి. కానీ, మీ అంతర్గత శత్రువులను జయించండి. సంకోచం, అనుమానం, ఆత్మన్యూనతా భావం, సెల్ఫ్ పిటీ అనేవి నాలుగు అంతర్ శత్రువులు. అవి లోపల నుంచి దాడి చేసి మిమ్మల్ని ఎదగనివ్వవు. ఆత్మవిశ్వాసంతో సంకోచాన్ని జయించండి. పరిపూర్ణ విశ్వాసంతో అనుమానాన్ని అధిగమించండి. సమతౌల్యంతో ఆత్మన్యూనతను ఎదుర్కోండి. స్వీయ క్రమశిక్షణతో సెల్ఫ్ పిటీని తరిమికొట్టండి. అన్నిటినీ మించి గతంలో ఉండిపోవద్దు. భవిష్యత్తులో విహరించొద్దు. వర్తమానంలో జీవించాలి. గతంలో ఎదురైన చేదు అనుభవాలు మన ఉత్సాహాన్ని చంపేస్తాయి. అలాగే భవిష్యత్తు పట్ల భయం అవరోధాలను ఎదుర్కొనే అవకాశాన్ని అడ్డుకుంటుంది. ఎవరు కాలాన్ని సద్వినియోగం చేసుకుంటారో వాళ్లు సత్ఫలితాలను సాధించగలుగుతారు. స్ఫూర్తినిచ్చే వ్యక్తుల కథలు చదవడం వల్ల ఉత్సాహం పొందొచ్చు. అలాగని విజయగాథలు చదువుతూ.. వాళ్లు సాధించిన దానికి మనం రొమ్ము విరుచుకోవాల్సిన పనిలేదు. ఓడిపోయిన వ్యక్తుల కథలు చదివితేనే.. ఓటమి తత్వం బోధపడుతుంది. విజేతల గాథలు సందేశాన్నిస్తాయి. ఓటమిపాలైన వ్యక్తుల కథలు గెలవడానికి కొత్త మార్గాలను నిర్దేశిస్తాయి. చివరిగా, పరాజయం అంటే ప్రయత్నించటంలో విఫలం కావటం. అంతే తప్ప అసలు ప్రయత్నించకపోవటం కాదు. ఈ సత్యాన్ని గ్రహించి మీ అదృష్టాన్ని మీరే పునర్ లిఖించుకోండి.

## చీమ చెప్పే సత్యం...

మీరెప్పుడైనా చీమల కదలికలను గమనించారా? వాటికి అంతరాయం కలిగించి చూడండి. అవి పక్కకు తొలిగి ముందుకు వెళ్లాటానికి ప్రయత్నిస్తాయే తప్ప ప్రయాణం ఆపవు. చీమలబారుకు అడ్డంగా ఓ చిన్నకర్రను అడ్డుపెడితే.. చీమలు తమ మార్గాన్ని మార్చుకొని కుడివైపు వెళ్తాయి. మరో కర్ర అడ్డం పెడితే.. అవి మళ్లీ కుడివైపు మళ్లుతాయి. ఇంకోసారి అడ్డుకోవటానికి ప్రయత్నించినప్పుడు వాటికి అర్థమైపోతుంది. ఈసారి అవి అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తాయి. అవి ఏ వైపూ తిరగకుండా.. కర్రపైకి ఎక్కి ప్రయాణించడం మొదలుపెడతాయి. వాన వచ్చినప్పుడు పక్షులు ఆశ్రయం కోసం చూస్తే, గద్దలు మేఘాలను దాటి పైకి ఎగురుతాయి. ఓటములు ఎదుర్కోవాలే కానీ, వాటి నుంచి పారిపోవద్దు. ఓటమిని ఢీ కొడితే.. విజయం తథ్యం.

## ఆర్థర్ ఆదర్శం...

ప్రసిద్ధ టెన్నిస్ ఆటగాడు ఆర్థర్ యాష్‌కు 1983లో గుండె సర్జరీ జరిగింది. ఆ సందర్భంగా అతనికి అందించిన రక్తం ఇన్‌ఫెక్షన్ కావడంతో ప్రాణాంతకమైన ఎయిడ్స్ వ్యాధి సోకింది. అతను మరణానికి చేరువయ్యాడు. అభిమానులకు గుండె పగిలినంత పనైంది. 'ఇంత దరిద్రమైన వ్యాధి మీకే రావాలా? భగవంతుడు మిమ్మల్నే ఎందుకు ఎంచుకున్నాడు?' అని కన్నీళ్లు పెట్టుకున్నారు. 'ఎందుకు ఎంచుకోకూడదు?' అని వాళ్లను తిరిగి ప్రశ్నించాడు ఆర్థర్. 'ప్రపంచ వ్యాప్తంగా 5,00,00,000 చిన్నారులు టెన్నిస్ ఆడాలని కోరుకుంటున్నారు. 50,00,000 మంది టెన్నిస్ నేర్చుకుంటున్నారు. 5,00,000 వృత్తిపరమైన శిక్షణ పొందుతున్నారు. 50,000 మంది సర్క్యూట్‌కి వస్తారు. 5,000 మంది తర్వాతి దశకు చేరుకుంటారు. అందులో వడపోత తర్వాత 500 మంది మిగులుతారు. 50 మంది గ్రాండ్‌శ్లామ్‌కి చేరతారు. నలుగురు సెమీఫైనల్ దాకా వెళతారు. ఫైనల్‌కి ఇద్దరు చేరతారు. ఒకే ఒక్కరు గెలుస్తారు. నేను విజేతగా కప్పు అందుకున్నప్పుడు%ొ% 'నేనే ఎందుకు?' అని దేవుణ్ని ప్రశ్నించలేదు. అప్పుడు 'నేనే ఎందుకు?' అని అడగనప్పుడు.. ఇప్పుడు 'నాకే ఎందుకు ?' అని అడగటం న్యాయమా? అన్నాడు ఆర్థర్. ఇది నిజంగా ఆలోచించవలసిన అంశం. చిన్న చిన్న ఓటములకే కుంగిపోయి ఆత్మహత్యలకు సిద్ధపడుతున్న వారు ఈ టెన్నిస్ స్టార్ నుంచి ఎంతో నేర్చుకోవాలి. జీవితంలో పరిస్థితులు సానుకూలంగా లేవని ఆవేదనకు గురయ్యే ప్రతి ఒక్కరికీ ఆర్థర్ ఆదర్శం.

## ఓడి గెలిచిన వాళ్లెందరో..


నేడు మనం విజేతలని ఆరాధిస్తున్న ఎందరో తొలిరోజుల్లో పరాజయం చవిచూసిన వాళ్లే. వారిలో క్రీడాకారులు, రాజకీయ ఉద్దండులు, వ్యాపారవేత్తలు, కవులు, కళాకారులు ఎందరో కనిపిస్తారు. వాళ్లు కోరుకున్న ఫలితాలు రాకపోయినా, 'నీ వల్ల కాదు'ని ఇతరులు వెనక్కి లాగినా.. రాజీపడలేదు. చిన్నచిన్న ఓటములకు కుంగిపోలేదు. మళ్లీ మళ్లీ శక్తి కూడదీసుకొని లంఘించారు. ఓటమిని జయించి.. గెలుపు శిఖరాలను అధిరోహించారు. చరిత్ర పుటలను తిరగేస్తే.. అలాంటి వారెందరో కనిపిస్తారు. వారిలో కొందరిని ఇక్కడ ప్రస్తావించుకుందాం.. ఆపిల్ సంస్థ సహ వ్యవస్థాపకుడు స్టీవ్‌జాబ్స్‌ను 1985లో ఆ సంస్థ నుంచి బయటికి పంపారు. 1990లో ఆ సంస్థ దాదాపు దివాళా తీసే స్థితికి చేరుకుంది. మళ్లీ 1997లో స్టీవ్ ఆపిల్ సీఈవోగా మళ్లీ బాధ్యతలు చేపట్టాడు. తరవాతి సంగతి మనకు తెలిసిందే! వాల్ట్ డిస్నీలో సృజనాత్మకత, ఊహాబలం తక్కువని పేర్కొంటూ 'సిటీ స్టార్' అనే ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నుంచి అతణ్ని తొలగించారు. దిగ్గజ దర్శకుడు స్పీల్ బర్గ్‌కూ చేదు అనుభవాలు లేకపోలేదు. యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియాకు అనుబంధంగా ఉన్న స్కూల్ ఆఫ్ సినిమాటిక్ ఆర్ట్స్ స్పీల్‌బర్గ్‌ని మూడుసార్లు తిరస్కరించింది. నాలుగో ప్రయత్నంలో అతనికి ప్రవేశం లభించింది. వాల్ట్ డిస్నీ, స్పీల్ బర్గ్ ఎంతటి సృజనాత్మకత కలిగిన వ్యక్తులో ప్రపంచమంతా తెలిసింది కదా! హైస్కూల్‌లో ఉండగా మైఖెల్ జోర్డాన్‌ను బాస్కెట్ బాల్ ఆటకు పనికిరాదని టీమ్ నుంచి బయటికి పంపారు. కానీ, అతను ఆ క్రీడలో ప్రపంచ ప్రఖ్యాత చాంపియన్‌గా నిలిచాడు. ఎగిరే యంత్రాన్ని కనుగొనడం అసాధ్యమని రైట్ సోదరులను ఎందరో చులకనగా చూశారు. ఆ మాటలకు వాళ్లు కుంగిపోయి ఉంటే.. విమానం ఆవిష్కరణ ఎప్పటికి జరిగి ఉండేదో! ప్రఖ్యాత నవలా రచయిత స్టీఫెన్‌కింగ్ మొదటి నవల 'కేరీ'ని దాదాపు 30 మంది ప్రచురణకర్తలు బాగాలేదంటూ వెనక్కి పంపారట. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక కాపీలు అమ్ముడైన నవలల్లో ఒకటిగా కీర్తి మూటగట్టుకున్న 'హారీపాటర్' నావెల్‌ను మొదట 12 మంది పబ్లిషర్స్ 'ఛీ' కొట్టారట. అబ్రహం లింకన్ అమెరికా అధ్యక్షుడు కాకముందు ఎన్నో వైఫల్యాలను చవిచూశాడు. ఐన్‌స్టీన్‌కు చదువు రాదని బడి నుంచి బయటికి పంపారు. తర్వాత రోజుల్లో కూడా అనేక యూనివర్సిటీలు ఆయనకు ప్రవేశం ఇవ్వలేదు. థామస్ ఎడిసన్ బల్బును కనుగొనడానికి ముందు వెయ్యి వైఫల్యాలను చవిచూశాడు. ప్రఖ్యాత శాస్త్రవేత్త మేరీ క్యూరీకి పోలాండ్ యూనివర్సిటీలో అడ్మిషన్ దొరకలేదు. దీంతో ఆమె ఫ్రాన్స్‌కు వెళ్లాల్సి వచ్చింది. ఇలా తరచి చూస్తే.. ఎందరో వ్యక్తులు శక్తులుగా ఎదగడానికి ముందు పతనం లోతులు చూసిన వాళ్లే అని తెలుస్తుంది. పాతాళానికి పడిపోయామని వాళ్లు కుంగిపోయి ఉంటే.. చరిత్రలో వాళ్ల ప్రస్తావన ఉండేది కదా కదా! ఓడిపోయారంటే మీరు సాధించలేరని కాదు.గెలుపు కోసం మరింత ప్రయత్నించాలని అర్థం. అపజయం పొందారంటే మీకు అవకాశం తప్పిపోయినట్టు కాదు. మీకు రెక్కలు ఎగరటానికి సిద్ధమవుతున్నాయని భావించాలి. ఫెయిల్యూర్ అంటే మీకేదీ మిగలలేదని కాదు.కొత్తదారులలోకి మీరు అడుగుపెట్టవలసిన సమయం వచ్చిందని తెలుసుకోండి. పట్టుదల, ఏకాగ్రతతో ముందుకు వెళ్లండి.

# అదానీ దుమారం



ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అత్యంత సన్నిహితుడైన గౌతమ్ అదానీకి అగ్రరాజ్యమైన అమెరికా అరెస్టు వారంట్ జారీచేయడంతో ఇండియాలో రాజకీయ దుమారం చెలరేగింది. భారతదేశంలో విద్యుత్తు ప్రాజెక్టుల కోసం రాజకీయ పెద్దలకు ముడుపులు ఇచ్చారనీ, పెట్టుబడుల సేకరణ సందర్భంగా నిజాలు దాచిపెట్టారనేవి అదానీపై ప్రధానమైన ఆరోపణలు. ఇవి అమెరికా చట్టాల ప్రకారం నేరాలనీ, వీటి ఉల్లంఘన ఎక్కడ జరిగినా తమ న్యాయవ్యవస్థ వదిలిపెట్టదనీ అమెరికా అంటున్నది. భారత కుబేరుడిని ప్రపంచ పెద్దన్న అమెరికా జైలుకు పంపేందుకు సిద్ధమైందన్న వార్త మన దేశంలో సహజంగానే ప్రకంపనలు సృష్టించింది. స్టాక్‌మార్కెట్ కుప్పకూలింది. ముఖ్యంగా అదానీ గ్రూప్ షేర్లు దారుణంగా దెబ్బతిన్నాయి. ఒక్కరోజులోనే కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. అదానీ విషయమై పార్లమెంట్‌లో ప్రతిపక్ష పార్టీలు హంగామా చేస్తున్నాయి. ఇది టీ కప్పులో తుఫానులా సమసిపోతుందా? లేక పైకప్పులు ఎగరగొట్టే వాయుగుండమవుతుందా? అనేది ఇదమిద్ధంగా చెప్పలేం. మోదీ ప్రాపకంలోనే వివాదాస్పద పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ అంచెలంచెలుగా ఎదిగి ప్రపంచ కుబేరుడయ్యారన్న సంగతి మరువరాదు. ఏది ఎలా ఉన్నప్పటికీ అదానీ గ్రూప్ సంస్థలకు హిండెన్‌బర్గ్ ఉదంతాన్ని మించిన నష్టాన్ని అమెరికా అరెస్టు వారంటు కలిగించిందని చెప్పక తప్పదు. అదానీ ప్రతిధ్వనులు మన రాష్ట్రంలోనూ వినిపించాయి. అదానీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఢిల్లీలో నిప్పులు చెరుగుతుంటే, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అదే అదానీకి ఎర్రతివాచీ పరచి స్వాగతిస్తుండటం విస్మయం కలిగించింది. ఇప్పుడు అమెరికా వారంటు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అదానీతో జరిపిన సయ్యాటలపైకి అందరి దృష్టి మరోమారు మళ్లింది. వివాదాస్పద పారిశ్రామికవేత్త రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టేందుకు ఇదివరకూ ప్రయత్నాలు జరుపకపోలేదు. రాష్ట్రంలో 20 వేల మెగావాట్ల థర్మల్ ప్లాంట్ కోసం అదానీ గ్రూప్ వస్తే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సున్నితంగా తిరస్కరించడం తెలిసిందే. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. అధిష్ఠానం వైఖరికి భిన్నంగా అదానీపై ప్రత్యేకాభిమానం ప్రదర్శించడం విడ్డూరం. ప్రస్తుత వివాదాలు ముసురుకున్న వేళ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆత్మసమర్థనలో పడింది. అందులో భాగంగానే అదానీ ఇచ్చిన విరాళంపై యూటర్న్ తీసుకున్నది. స్కిల్ యూనివర్సిటీకి అదానీ ఇచ్చిన రూ.100 కోట్ల విరాళం తిరస్కరిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హడావుడిగా ప్రకటించారు. అదానీతో సహా ఏ సంస్థ నుంచీ తెలంగాణ సర్కారు విరాళాలు తీసుకోలేదని మీడియా సాక్షిగా వివరణ ఇచ్చుకున్నారు. అధిష్ఠానం అల్టిమేటంతోనే ఆయన అందుకు సిద్ధమయ్యారనేది తెలుస్తూనే ఉంది. అంతటి ఇరకాటంలోనూ విపక్ష పార్టీపై బట్టకాల్చి మీద వేసే ప్రయత్నాలు ఆపలేదు. కేంద్ర ప్రాజెక్టులను బీఆర్ఎస్ ఖాతాలో వేసేందుకు విఫలయత్నం చేసి అభాసుపాలయ్యారు. దావోస్‌లో అదానీ గ్రూప్‌తో అట్టహాసంగా కుదుర్చుకున్న వేల కోట్ల రూపాయల ఒప్పందాలను రద్దు చేసుకుంటారా? దీనిపై రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్ వివరణ ఇచ్చుకోవాల్సి ఉన్నది.

# వీటిని రోజూ తీసుకుంటే చాలు కొలెస్ట్రాల్ ఎంత ఉన్నా సరే కరిగిపోతుంది



ప్రస్తుతం చాలా మంది నిత్యం గంటల తరబడి కూర్చుని పనిచేసే ఉద్యోగాలు చేస్తున్నారు. దీని వల్ల ఒత్తిడి బారిన పడుతున్నారు. అలాగే శారీరక శ్రమ కూడా ఉండడం లేదు. అస్తవ్యస్తమైన జీవన విధానాన్ని పాటిస్తున్నారు. రాత్రిపూట సరిగ్గా నిద్రించడం లేదు. జంక్ ఫుడ్‌కు బాగా అలవాటు పడ్డారు. ఇంట్లో వండిన ఆహారాల కన్నా బయటి ఆహారాలనే అధికంగా తింటున్నారు. అలాగే ధూమపానం, మద్యపానం చేస్తున్నారు. ఇవన్నీ శరీరంలోని కొలెస్ట్రాల్‌ను పెంచేందుకు కారణాలు అవుతున్నాయి. శరీరంలో కొలెస్ట్రాల్ చేరితే రక్తనాళాల్లో అడ్డంకులు వస్తాయి. దీంతో రక్త సరఫరాకు ఆటంకం ఏర్పడుతుంది. ఫలితంగా అది హార్ట్ ఎటాక్‌కు దారి తీస్తుంది. కనుక హార్ట్ ఎటాక్ రావొద్దంటే ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవన శైలిని పాటించాల్సి ఉంటుంది.

## పసుపు..

ముఖ్యంగా కొన్ని రకాల ఆహారాలను రోజూ తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గించుకోవచ్చు. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. చాలా మంది ఇళ్లలో పసుపును విరివిగా ఉపయోగిస్తుంటారు. అయితే ఇది మనకు నిజంగా ఆరోగ్య ప్రదాయిని అని చెప్పవచ్చు. దీన్ని ఆయుర్వేదంలో ఎక్కువగా ఉపయోగిస్తారు. కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో ఇది అద్భుతంగా పనిచేస్తుంది. పసుపులో కర్క్యుమిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది రక్తనాళాలను క్లీన్ చేసి వాటిని ఆరోగ్యంగా ఉంచుతుంది. దీంతో గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. కనుక పసుపును రోజూ ఏదో ఒక విధంగా ఆహారంలో భాగం చేసుకోవాలి. దీంతో గుండె పోటు రాకుండా చూసుకోవచ్చు.

## తులసి ఆకులు..

కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గించడంలో తులసి ఆకులు కూడా బాగానే పనిచేస్తాయి. వీటిల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఈ ఆకులు యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలను కూడా కలిగి ఉంటాయి. అందువల్ల తులసి ఆకులను రోజూ 4 చొప్పున పరగడుపునే తింటుంటే కొలెస్ట్రాల్ లెవల్స్‌ను కరిగించుకోవచ్చు. దీని వల్ల గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో మెంతులు కూడా బాగానే పనిచేస్తాయి. వీటిల్లో ఫైబర్ అదికంగా ఉంటుంది. అలాగే సాపోనిన్స్ అనే సమ్మేళనాలు మెంతుల్లో ఉంటాయి. ఇవి శరీరంలో అధికంగా ఉండే కొలెస్ట్రాల్‌ను బయటకు పంపేస్తాయి. రాత్రి పూట మెంతులను కొన్ని తీసుకుని నీటిలో నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయం పరగడుపునే వీటిని తినాలి. ఇలా చేస్తుంటే కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గిపోతాయి.

## దాల్చిన చెక్క..

శరీరంలోని కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గించడంలో దాల్చిన చెక్క కూడా అద్భుతంగానే పనిచేస్తుంది. దీన్ని రోజూ కషాయం రూపంలో తీసుకుంటే ఎంతో మేలు జరుగుతుంది. దాల్చిన చెక్క నీళ్లను తాగడం వల్ల షుగర్ లెవల్స్ కూడా తగ్గుతాయి. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. రోజూ ఉదయం అల్లం రసం సేవించడం వల్ల శరీరంలో రక్త సరఫరా మెరుగుపడుతుంది. దీంతో బీపీ తగ్గుతుంది. అలాగే శరీరంలోని కొలెస్ట్రాల్ లెవల్స్ కూడా తగ్గుతాయి. వెల్లుల్లిలో ఆల్లిసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది శరీరంలోని కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తుంది. కనుక వెల్లుల్లిని కూడా రోజూ తినాలి. రోజూ ఉదయం పరగడుపునే 2 పచ్చి వెల్లుల్లి రెబ్బలను తింటే ఎంతో మేలు జరుగుతుంది. ఇలా పలు రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ లెవల్స్‌ను సహజసిద్ధంగానే తగ్గించుకోవచ్చు.

# శీతాకాలం ఎండ ఎంత మేలో!




సూర్యకిరణాలు శరీరాన్ని స్పర్శించడం వల్ల దేహం విటమిన్-డిని తయారు చేసుకుంటుంది. విటమిన్- డి కోసం శరీరాన్ని ఎండకు ఉంచేందుకు శీతాకాలం అనువైనది. ఈ కాలంలో ఎండ వేడి తక్కువగా ఉంటుంది. చల్లదనం వల్ల శరీరం బిగుసుకుపోయి, చర్మం పగుళ్లతో ఉంటుంది. ఉదయాన్నే ఎండకు ఉండటం వల్ల కండరాల కదలిక తేలిక అవుతుంది. శరీరానికి కావాల్సినంత విటమిన్-డి తయారు కావాలంటే రోజులో కనీసం 15 నిమిషాల నుంచి 30 నిమిషాల పాటు ఎండలో ఉండాలి. చర్మం ఎర్రగా ఉండేవాళ్లు ఎండకు తక్కువ సమయం ఉండాలి. నల్లని చర్మం ఉండేవాళ్లు ఎక్కువ సమయం ఎండలో గడపాలి. విటమిన్-డి వల్ల ఎముకలు క్యాల్షియాన్ని ఎక్కువగా శోషించుకోగలుగుతాయి. కాబట్టి ఎముకలు బలంగా ఉంటాయి. ఆస్టియోపొరోసిస్ సమస్య రాదు. ఎండలో ఉన్నప్పుడు మానసికోల్లాసం కలుగుతుంది. అలాగే రుతువులు మారినప్పుడు కలిగే మానసిక సమస్యలు తొందరగా తొలగిపోతాయి. గుండె పనితీరుని విటమిన్-డి మెరుగుపరుస్తుంది. హైపర్ టెన్షన్‌ని తగ్గిస్తుంది. సో, చలికాలంలో బారెడు పొద్దెక్కే వరకూ పడుకోకుండా.. ఉదయం ఎండలో ఎక్కువ సమయం గడిపే ప్రయత్నం చేయడం చాలా అవసరం అని గుర్తించండి.

# గుత్తాధిపత్యం గతచరిత్రే




ఏ మాత్రం అవకాశం దొరికినా ప్రాంతీయ పార్టీల మీద జాతీయ పార్టీలు దుమ్మెత్తి పోస్తుంటాయి. తమది సువిశాలమైన జాతీయవాదమనీ, వాటిది సంకుచిత ప్రాంతీయ వాదమనేది ప్రధానంగా ముందుకుతెచ్చే వాదన. కానీ, ఆసేతు హిమాచలం పరచుకొని ఉన్నది వైవిధ్యభరితమైన భారతం. దేశాన్ని ఒకే గాటన కట్టి పబ్బం గడుపుకోవాలన్నదే జాతీయ పార్టీల భావన. ఈ విషయంలో బీజేపీ, కాంగ్రెస్ అన్న తేడాలు ఉండవు. దొందూ దొందే. విభిన్నమైన జాతులు, భాషలు, ఆచారాలు ఉండటమనేది సమస్య కాదు. ప్రజలందరూ కలిసి మెలిసి ఉండాలనే కోరుకుంటారు. కానీ, ఒక్కో ప్రాంతం ప్రజల ఆశలు, ఆకాంక్షలు భిన్నంగా ఉంటాయి. అందులో నుంచే ప్రాంతీయ వాదం, దానికి కొనసాగింపుగా పార్టీలు ఆవిర్భవిస్తాయి. అధికారం కోసం జరిగే పోరులో ఓట్ల రూపంలో, సీట్ల రూపంలో ఆ ఆకాంక్షలే వ్యక్తమవుతాయి. తాజాగా వెలువడిన మహారాష్ట్ర, జార?ండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ప్రాంతీయ శక్తుల ప్రాముఖ్యాన్ని, అనివార్యతను చాటిచెప్పాయి. మహారాష్ట్రలో శివసేన షిండే వర్గం, ఎన్సీపీ అజిత్ పవార్ వర్గంతో పొత్తు పెట్టుకొని బీజేపీ తన ఉనికిని నిలబెట్టుకున్నది. రెండు ప్రాంతీయ పార్టీలను చీల్చి, ఆ చీలిక వర్గాలతో కలిసి పోటీచేసింది. అత్యధికంగా 149 స్థానాల్లో పోటీ చేసినప్పటికీ సొంతంగా మెజారిటీకి కొద్దిదూరంలో ఆగిపోయింది. అంటే మిత్రపక్షాలైన ప్రాంతీయ పార్టీల మీద ఆధారపడక తప్పని పరిస్థితి. 'ఏక్ హై తో సేఫ్ హై' వంటి హద్దు మీరిన ప్రచారం జరిపినప్పటికీ వేర్వేరు ప్రాంతాల్లో మిత్రపక్షాలైన ప్రాంతీయ పార్టీల ఓటు బదిలీ నుంచి లాభపడింది. కాంగ్రెస్ సీట్లు భారీగా నష్టపోతే బీజేపీ అతిపెద్ద పార్టీగా ముందుకువచ్చి పట్టు బిగించింది. ఇటు కాంగ్రెస్ చీలిక పార్టీల అవశేష వర్గాలతో కలిసి పోటీచేసినా కనీసం ప్రధాన ప్రతిపక్ష హోదాకు అవసరమైనన్ని సీట్లు కూడా దక్కించుకోలేకపోయింది. జాతీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలు గెలిచిన సీట్ల సంఖ్యను పోల్చి చూసుకుంటే అంతరం అంతంత మాత్రమేనని తెలిసిపోతుంది. జార?ండ్ ఫలితాలు ప్రాంతీయ పార్టీల ఉనికిని బలంగా చాటాయనే చెప్పాలి. రాష్ట్ర సాధనకు ఉద్యమించిన జేంఎంఎం కేంద్రం వేధింపులను, బీజేపీ విష ప్రచారాన్ని తట్టుకొని నిలిచి ప్రజాక్షేత్రంలో జెండా ఎగురవేసింది. కాంగ్రెస్ అంటకాగే పార్టీ స్థాయికి దిగజారిపోయింది. కేంద్ర, రాష్ట్ర అధికార పీఠాలను జాతీయ పార్టీలు అధిరోహించాలంటే ప్రాంతీయ పార్టీల మద్దతు, అండదండలు లేకుండా సాధ్యమయ్యే రోజులు ఎప్పుడో పోయాయని ఈ ధోరణి సూచిస్తున్నది. రెండు పెద్ద పార్టీలు ఎంతగా వద్దనుకుంటున్నా ప్రాంతీయపార్టీలు మళ్లీ మళ్లీ తలెత్తుకుంటూనే ఉన్నాయి. తమ సత్తాను, అనివార్యతను చాటుకుంటున్నాయి. సమాఖ్యవాదం ప్రాముఖ్యాన్ని పదే పదే గుర్తుచేస్తూనే ఉన్నాయి. జాతీయ పార్టీలు ప్రాంతీయ ఆకాంక్షల పరిపూర్తిలో ఘోరంగా విఫలం కావడమే అందుకు ప్రధాన కారణం. ఎప్పటికైనా ప్రాంతీయ పార్టీలే దేశానికి శ్రీరామరక్ష అని చెప్పకతప్పదు.

## ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా అయితే అది ఫ్యాటీ లివర్ సమస్య కావచ్చు



మన శరీరంలో లివర్ అనేక ముఖ్య విధులను నిర్వహిస్తుంది. సుమారుగా 800 జీవక్రియలు సక్రమంగా నిర్వర్తించేందుకు లివర్ అవసరం అవుతుంది. అయితే లివర్ చేసే పనుల వల్ల అందులో కొవ్వు పేరుకుపోతుంది. దీంతో ఫ్యాటీ లివర్ సమస్య వస్తుంది. దీన్ని రెండు రకాలుగా చెబుతారు. నాన్ ఆల్కహాలిక్, ఆల్కహాలిక్ అని ఫ్యాటీ లివర్ రెండు రకాలుగా ఉంటుంది. మద్యం ఎక్కువగా సేవించడం వల్ల ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ వ్యాధి వస్తుంది. మద్యం సేవించకపోయినా తీసుకునే ఆహారాల వల్ల శరీరంలో కొవ్వు పేరుకుపోయి నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ వ్యాధి వస్తుంది. అయితే రెండింటిలోనూ లక్షణాలు సమానంగా కనిపిస్తాయి. వాటిని గుర్తించడం ద్వారా ఫ్యాటీ లివర్ సమస్య వచ్చిందని అర్థం చేసుకోవచ్చు.

### సైజ్ పెరుగుతుంది..

ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారిలో లివర్ వాపులకు గురవుతుంది. దీంతో లివర్ సైజు పెరుగుతుంది. లివర్ ఉన్న చోట చర్మం ఉబ్బెత్తుగా మారుతుంది. దీన్ని అందరూ గుర్తించలేకపోవచ్చు. కానీ లివర్ ఉన్న భాగంలో మాత్రం కాస్త నొప్పిగా అనిపిస్తుంది. ఇక లివర్ పెరిగిపోవడాన్ని హెపాటోమెగాలి అంటారు. ఫ్యాటీ లివర్ వచ్చిన వారిలో ఇలా జరుగుతుంది. కనుక మీకు ఈ లక్షణం కనిపిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ను కలవండి. అలాగే ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారిలో పాదాలు వాపులకు గురై కనిపిస్తుంటాయి.

### జీర్ణవ్యవస్థపై..

ఫ్యాటీ లివర్ సమస్య ఉంటే జీర్ణవ్యవస్థ పనితీరుపై ప్రభావం పడుతుంది. దీంతో తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కాక అజీర్తి ఏర్పడుతుంది. అలాగే ఆకలిగా కూడా ఉండదు. మెటబాలిజం సరిగ్గా ఉండదు. కొందరికి కడుపులో నొప్పి కూడా ఉంటుంది. ఏ ఆహారాన్ని చూసినా వాంతికి వచ్చినట్లు అనినిస్తుంది. ఈ లక్షణాలు ఉంటే ఫ్యాటీ లివర్ సమస్యగా అనుమానించాల్సిందే. మీరు నిద్ర నుంచి అప్పుడే లేచినప్పటికీ తీవ్రమైన అలసట ఉందంటే దాన్ని కూడా ఫ్యాటీ లివర్ సమస్యగా అనుమానించాలి. ఈ దశలో చిన్న పని చేసినా తీవ్రంగా అలసిపోయినట్లు అనిపిస్తుంది. శరీరంలో శక్తి స్థాయిలు లేనట్లు అనిపిస్తుంది.

### పొట్ట ఉబ్బరం..

లివర్ సమస్య ఉన్నవారిలో సహజంగానే పొట్ట ఉబ్బిపోయి కనిపిస్తుంది. ఉన్నట్లుండి అకస్మాత్తుగా ఈ సమస్య వచ్చినా కూడా దాన్ని ఫ్యాటీ లివర్ సమస్యగా అనుమానించాలి. లివర్ వ్యాధి ఉంటే శరీరంలోని వ్యర్థాలు సరిగ్గా బయటకు పోవు. దీంతో చర్మం దురదగా అనిపిస్తుంది. కొందరికి చర్మంపై దద్దుర్లు కూడా ఏర్పడుతుంటాయి. ఫ్యాటీ లివర్ వ్యాధి ఉన్నప్పుడు చికిత్స తీసుకోకపోతే అది లివర్ సిర్రోసిస్‌గా మారే ప్రమాదం ఉంటుంది. కొందరికి ఇది క్యాన్సర్‌గా కూడా మారవచ్చు. కనుక ఈ లక్షణాలు కనిపిస్తే ఎవరైనా సరే జాగ్రత్త పడాల్సిందే. వెంటనే డాక్టర్‌ను కలిసి పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. ఫ్యాటీ లివర్ ఉన్నట్లు తేలితే డాక్టర్ సలహా మేరకు మందులను వాడాలి. అలాగే ఆరోగ్యవంతమైన ఆహారాలను తినాలి. దీంతో లివర్ పనితీరు మెరుగు పడుతుంది. లివర్ మళ్లీ ఎప్పటిలా పనిచేస్తుంది.

## గజగజ వణికిస్తున్న చలి పులి
## అన్ని జిల్లాల్లో 15 డిగ్రీలలోపు రాత్రి ఉష్ణోగ్రతలు



తెలంగాణలో చలి పంజా విసురుతోంది. తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 15 డిగ్రీలలోపు కనిష్ఠ రాత్రి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్టు వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. ఉత్తర, మధ్య తెలంగాణ జిల్లాల్లో చలి తీవ్రత ఎకువగా ఉన్నదని చెబుతున్నారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో రాష్ట్రంలోనే అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డవుతున్నాయి. సిర్పూర్(యూ)లో రికార్డు స్థాయిలో 8.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో అత్యల్పంగా 8.8, ఆదిలాబాద్ జిల్లా బేలలో 9.9 డిగ్రీలు నమోదైంది. జోగులాంబ గద్వాలలో 15.1, సూర్యాపేటలో 15.6, వనపర్తిలో 15.9 డిగ్రీలుగా నమోదైంది. తూర్పు, ఈశాన్య ప్రాంతాల నుంచి రాష్ట్రం వైపు గాలులు వీస్తుండటమే చలి తీవ్రత పెరగటానికి కారణమని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా రానున్న మూడ్రోజులు చలి తీవ్రత మరింత అధికంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఆసిఫాబాద్, సంగారెడ్డి, ఆదిలాబాద్ జిల్లాల్లో 10 డిగ్రీలలోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగిలిన 27 జిల్లాల్లో 15 డిగ్రీల లోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. ప్రతి ఏడాది డిసెంబర్‌లో ఉష్ణోగ్రతలు తకువ స్థాయికి పడిపోతుంటాయి. ఈ ఏడాది కొన్ని జిల్లాల్లో నవంబర్‌లోనే చలి తీవ్రత విపరీతంగా పెరిగింది. పదేళ్లతో పోల్చితే ఈ నెల 23న రాత్రి నాలుగు జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు.

# ప్రాంతీయ పార్టీలు చిరంజీవులు




దేశంలో ప్రాంతీయ పార్టీలు లేకుండా చేయాలని, జాతీయ పార్టీలైన తమది మాత్రమే ఎదురులేని ఆధిపత్యం కావాలని కాంగ్రెస్, బీజేపీ కొన్ని దశాబ్దాలుగా ప్రయత్నిస్తున్నాయి. అది నెరవేరేది కాదని ఇప్పటికే అనేకసార్లు రుజువైంది. ఈ రెండు జాతీయ పార్టీలు తమ సొంత బలంతో అధికారానికి రాలేక ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకోక తప్పని దశ వచ్చిన తర్వాత సైతం, ఒకవైపు వాటిపై ఆధారపడుతూనే మరొకవైపు వాటిని బలహీనపరిచి, చీల్చి, కబళించే వ్యూహాలను సాగిస్తూ వస్తున్నారు. ఆయా పరిస్థితుల్లో ఈ వ్యూహాలు అప్పుడప్పుడు పనిచేసి ప్రాంతీయ పార్టీలు బలహీనపడిన సందర్భాలు లేకపోలేదు. కానీ, అవి చిరంజీవుల వలె తిరిగి అంతలోనే పైకి లేస్తూ జాతీయ పార్టీలకు తమతో కలిసి నడవక తప్పని విధిలేని స్థితిని సృష్టిస్తున్నాయి. కొద్దిరోజుల కిందటి మహారాష్ట్ర, ఝూర?ండ్ అసెంబ్లీ ఫలితాలు అందుకు తాజా ఉదాహరణ. ఎదురుగా ఉన్న సీట్ల లెక్కలే ఆ మాట చెప్తున్నాయి. మహారాష్ట్రలో బీజేపీ రెండు ప్రాంతీయ పార్టీలతో, కాంగ్రెస్ మూడు పార్టీలతో పొత్తులు కలిసాయి. ఝూర?ండ్‌లోనూ ఇరువురూ అదే పనిచేశారు. ఆ రెండింటిలో గెలిచిందెవరు ఓడిందెవరు, ఎవరికెన్ని సీట్లు వచ్చాయి అన్నవి కాదు ప్రశ్నలు. ఇరువురు కూడా ఒంటరిగా పోటీ చేయలేకపోయారు, ప్రాంతీయ పార్టీలతో పొత్తు తప్పదనుకున్నారనేది విషయం. అట్లా భావించి బీజేపీ ఎన్డీయేని, కాంగ్రెస్ పార్టీ యూపీఏని ఏర్పాటుచేసుకోవటం మొదలై రెండు నుంచి మూడు దశాబ్దాలు గడిచాయి. వాటి బలహీనతలు అం తకు మరో దశాబ్దం ముందు నుంచి ఆరంభమయ్యాయి. ఆ బలహీనతలకు మూలాలను వెతకాలంటే ఇంకొక రెండు దశాబ్దాలు వెనుకకు వెళ్లాలి. ముఖ్యంగా కాంగ్రెస్‌కు సంబంధించి. స్వాతం త్ర్యం వచ్చినప్పటి నుంచి అది మన దేశాన్ని పాలిస్తున్న పార్టీ గనుక. ఆ విధంగా ఇది కనీసం అరవై ఏండ్ల చరిత్ర. బలహీనతల మూలాలు అప్పటివి కాగా, ప్రాంతీయ పార్టీలతో పొత్తులు తప్పవనుకునే విధిలేని స్థితి బీజేపీకి పూర్వరూపమైన జనసంఘ్‌కు నేషనల్ ఫ్రంట్ వేదికగా 1989లో ఏర్పడగా, కాంగ్రెస్‌కు యూపీఏ వేదికగా 2004లో ఎదురైంది. ఈ విధిలేని స్థితి ఉభయులకు కూడా ఈ 2024లోనూ కొనసాగుతున్నదనేది గుర్తించవలసిన విషయం. అంతే ముఖ్యమైన మరొక విషయం ఏమంటే, ఈ స్థితి నుంచి బీజేపీ, కాంగ్రెస్‌లలో ఏదీ కూడా కనుచూపు మేరలో బయటపడే అవకాశాలు లేవు. ఇది ఏదో జోస్యం వంటిదో లేక ఆశాభావం లాం టి మాటో కాదు. జాతీయస్థాయి పరిస్థితులను, వివిధ రాష్ట్రాల పరిస్థితులను గమనించినప్పుడు తోచేది ఇదే. పరిస్థితులు అంటే ఏమిటి? ఇందు లో ప్రధానంగా గమనించవలసినవి రెండున్నా యి. మొదటిది కాంగ్రెస్, బీజేపీ రెండూ కూడా తమ అస్తవ్యస్త విధానాలు, అసమర్థ పాలనలు, అవినీతి కారణంగా, తాము అధికారంలో ఉండిన సమయాలలో ప్రజల విశ్వాసాన్ని పొందలేకపోవటం. అదే స్థితి ఇప్పటికీ ఉండటం. వైఫల్యాల నుంచి, గత పరాజయాల నుంచి పాఠాలు నేర్వకపోవటం. ఇది మొదటిది కాగా, ప్రజలలో పలురకాల చైతన్యాలు, వాటితో పాటు ఆకాంక్షలు పెరుగుతుండటం. ఏ పార్టీ పట్ల, నాయకుని పట్ల కూడా ఒకప్పటి వలె గుడ్డిగా అనుసరించే విధేయతలు లేకుండా పోతుండటం. ఈ పరిణామాల ఫలితంగా వ్యక్తిగత ప్రయోజనాల నుంచి తమ ప్రాంతీయ ప్రయోజనాల వరకు ప్రధానం అవుతుండటం. ఇది రెండవది. ఇవి రెండూ మౌలికమైన స్థితులు. తక్కినవ న్నీ వీటికి లోబడి వీటి చుట్టూ తిరిగేవే. కాంగ్రె స్, బీజేపీలలో ఎవరు ఏ నినాదాలు ఇచ్చినా, ఏ మ్యానిఫెస్టోలు ప్రకటించినా, ఎవరితో పొత్తులు పెట్టుకున్నా, మరేమి ఎత్తుగడలు వేసి నా, ఏ సిద్ధాంతాలు మాట్లాడినా, ఎటువంటి అజెండాలు తెరపైకి తెచ్చినా, అన్నీ కూడా ఈ రెండు వైఫల్యాలను, బలహీనతలను అధిగమించి, ప్రజలను నమ్మించి, అంతిమంగా అధికారం సంపాదించటానికి మాత్రమే. తిరిగి గుర్తుచేసుకోవాలంటే, తమ అస్తవ్యస్త విధానా లు, అసమర్థ పాలనలు, అవినీతి కారణంగా కోల్పోయిన ప్రజల విశ్వాసాన్ని పలు విధాలుగా వారిని మరొకమారు వంచించటం ద్వారా సంపాదించి, అధికారం చేజిక్కించుకోవటం కోసమే. అదేవిధంగా, ప్రజలలో పెరుగుతున్న చైతన్యాలను, వారి సరికొత్త ఆకాంక్షలను మభ్యపెట్టి, ఏ పార్టీ పట్ల కూడా స్థిరంగా లేకుండాపోయిన విధేయతలను అధిగమించి ఎన్నికలు గెలవటం కోసమే. అందులో సఫలమవుతారా లేదా అన్నది వేరే ప్రశ్న. ఒకసారి కావచ్చు, మరోసారి కాకపోవ చ్చు. వారు ఆ వలయంలోంచి బయటపడలేరన్నది మాత్రం గుర్తించవలసిన ప్రధాన విష యం. బయట పడాలంటే పైన పేర్కొన్న రెండు పరిస్థితులను అధిగమించాలి. ఆ పనిచేయటం వారికి సాధ్యమయ్యేది కాదు. తమ స్వార్థ ప్రయోజనాలు నెరవేరేందుకు అస్తవ్యస్త విధానాలు, అసమర్థ పాలన, అవినీతి, ప్రజల మేలు కోసం చిత్తశుద్ధితో పనిచేయకపోవటం, వారి చైతన్యాలను, ఆకాంక్షలను పట్టించుకోకపోటం, పక్కదారి పట్టించటం, ప్రాంతాల ఫెడరల్ అవసరాలను, హక్కులను హరించి అధికార కేంద్రీకరణలు చేయటం వంటివన్నీ వారికి ఒక తప్పనిసరి అవసరం. తమ స్వార్థ ప్రయోజనాల ప్రాతిపదికగా వారికి ఏర్పడిన స్వభావమది. ఒకవైపు ఇది ఆ రెండు పార్టీల స్వభావం ఎట్లా అయిందో, మరొకవైపు

దేశంలోని ప్రాంతాలకు, అక్కడి ప్రజలకు ఫెడరలిజం తమ స్వభావంగా మారింది. ఈ స్వభావం అనే దానిలోకి అనేకం వస్తాయి. తమ ఆర్థిక, రాజకీయ, సామాజిక ప్రయోజనాలు, చరిత్ర, సంస్కృతి, ఆకాంక్షలు, ప్రత్యేక గుర్తింపులు మొదలైనవన్నీ. ఒకవైపు ఇది ఆ రెండు పార్టీల స్వభావం ఎట్లా అయిందో, మరొకవైపు దేశంలోని ప్రాంతాలకు, అక్కడి ప్రజలకు ఫెడరలిజం తమ స్వభావంగా మారింది. ఈ స్వభావం అనే దానిలోకి అనేకం వస్తాయి. తమ ఆర్థిక, రాజకీయ, సామాజిక ప్రయోజనాలు, చరిత్ర, సంస్కృతి, ఆకాంక్షలు, ప్రత్యేక గుర్తింపులు మొదలైనవన్నీ. మరొకవైపు జాతీయపార్టీలకు జాతీయ ప్రయోజనాల పేరిట జాతీయస్థాయి ఆర్థికశక్తుల ప్రయోజనాలు, అనగా పెద్ద ధనవంతులు వ్యాపారాల వారు, వారితో సంబంధాలుండే విదేశీ ఆర్థికశక్తులు ప్రధానమవుతాయి. తమ యూనిటరిస్టు పెత్తందారీతనం ప్రధానమవుతుంది. అందుకు తగిన విధానాలతో పరిపాలిస్తూ అందుకోసం ప్రాంతాల ప్రయోజనాలను, ఆకాంక్షలను బలిపెట్టజూస్తారు. రెండింటి మధ్య వ్యతిరేకతలన్న వి, లేదా వైరుధ్యాలన్నవి అక్కడ మొదలవుతాయి. జాతీయ పార్టీలు, నాయకత్వాలన్నవి నిజం. జాతీయ దృష్టితో మొత్తం అన్ని ప్రాంతా ల ప్రయోజనాలను, వైవిధ్యతలను దృష్టిలో ఉంచుకొని ప్రజాస్వామికంగా పాలించినట్టయి తే, అది మన రాజ్యాంగం చెప్పిన సహకార ఫెడరలిజం అవుతుంది. ఇండియా వంటి వైవిధ్య దేశంలో ప్రాంతాలు, వాటి ప్రయోజనాలు, దేశ ప్రయోజనాలకు మధ్య సహకార సమన్వయాలు ఎంత అవసరమో స్పష్టంగా గుర్తించినందువల్లనే రాజ్యాంగ రచయితలు బలమైన కేంద్రం, బలమైన రాష్ట్రాలు, సహకార ఫెడరలిజం అనే సూత్రీకరణలను ఎంతో ముందుచూపుతో రాజ్యాంగంలో చేర్చారు. కానీ, పైన చెప్పుకున్నట్టు కాంగ్రెస్, బీజేపీలు రెండూ ఈ సూత్రీకరణలను తమ ప్రయోజనాల కోసం ఉల్లంఘిస్తూ రావటం వల్లనే తడబడుతున్నాయి. తరచూ ఓడుతున్నాయి. అధికారాన్ని సంపాదించేందుకు ప్రాంతీయ పార్టీలపై ఆధారపడక తప్పని పరిస్థితులను తమకు తామే సృష్టించుకున్నాయి. కొన్ని దశాబ్దాల కిందటే మొదలైన ఈ స్థితి నుంచి నేటికీ పాఠాలు నేర్చుకోవటం లేదు. అందుకే, ప్రాంతీయ శక్తులు, పార్టీలు ఫెడరలిజం సూత్రాల ప్రాతిపదికగా ఈ సువిశాల వైవిధ్య దేశంలో చిరంజీవులవుతున్నాయి. వాటిని తుద ముట్టించేందుకు కాంగ్రెస్, బీజేపీలలో ఏది ఎన్ని ఎత్తుగడలు వేసినా అది ఎంతమాత్రం సాధ్యం కావటం లేదు. సంఘ్‌పరివార్, బీజేపీ నాయకత్వాలు హిందూత్వ పేరిట ఆ పనిచేయవచ్చునని సాగించిన ఆలోచన సైతం పెండ్యులం కదలికల వలె మిగిలిపోవటం తప్ప, దశాబ్దాలు గడిచినా ప్రాంతీయతలను, ఫెడరలిజాన్ని గోవాల్కర్ తన 'బంచ్ ఆఫ్ థాట్స్'లో రాసినట్టు అంతం చేయలేకపోయాయి. ఆ విషయంలో కాంగ్రెస్ వలెనే ఈ శక్తులు కూడా పైన పేర్కొన్న తమ స్వార్థాలు, బలహీనతల వల్ల విఫలమవుతూ వస్తున్నాయి. ముమ్ముందు సఫలం కాగల సూచనలూ లేవు. వాటి స్వభావంలోనే అది ఉన్నది. కనుక ప్రాంతీయతలు, ప్రాంతీయశక్తులు, పార్టీలు చిరంజీవులు.

# మానుకోటలో కాళ్లగజ్జల హిమ్మతి




'మా భూములు మాగ్గావాలే' అంటూ లగచర్లలో లంబాడీ బిడ్డల లడాయి మట్టిబిడ్డల పంతానికి అద్దం పట్టింది. భూమి కోసం జరిగిన అన్ని పోరాటాల్లో భూమిపుత్రులే గెలిచారు తప్ప, రాజ్యం ఎన్నడూ పైచేయి సాధించలేదు. ఉన్న ఊరు కన్న తల్లితో సమానమని అంటారు. ఏ కన్నతల్లి తన సొంత బిడ్డకు శాపనార్థాలు పెట్టదు. కానీ, తన సొంత నియోజకవర్గ ప్రజలే 'నీ అధికారం కాలిపోను' అని శపించే దారుణ పరిస్థితికి దిగజారిన తర్వాత ముఖ్యమంత్రిగా ఉండి ఏం లాభమో ఆలోచించుకోవాలి. రాజకీయ వ్యవస్థలో ఏ నాయకుడికైె నా తన సొంత నియోజకవర్గమే మొదటి ప్రాధాన్యంగా ఉంటుంది. అందుకే అంటారు వడ్డించేవాడు మనవాడైతే ఏ మూల న కూర్చున్నా డోకా ఉండదని. కానీ, ఆ వడ్డిం చే వాడే నడ్డి విరిచే వాడయ్యాడని కొడంగల్ ప్రజలు కన్నీళ్లు పెట్టే దుస్థితి నెలకొన్నది. ఫార్మా కంపెనీలకు తమ భూములను ధారాదత్తం చెయ్యబోమని, 'మా భూములు మాకే'నని మర్లబడ్డ లగచర్ల రైతుల లడాయిని బెదిరింపులతో, అక్రమ కేసులతో, తన రాజ్యహింసతో, పోలీసుల అణచివేతతో కప్పిపుచ్చాలని రేవంత్‌రెడ్డి చూస్తున్నారు. కానీ, మండే సూర్యుడిని గొంగడిలో దాచడం, నిప్పు రవ్వలను బట్టలో మూలకట్టడం, పారే ఏరును వలలో బంధించడం సాధ్యం కాదని తెలియ దు పాపం. పోరాటాల పురిటిగడ్డలో ప్రశ్నించడానికి అనుమతి తీసుకోవాల్నా? తల్లిపాలు తాగడానికి బిడ్డకు అనుమతి కావాల్నా? గిరిజనులకు, రైతు బిడ్డలకు భూమితో విడదీయరాని అనుబంధం ఉంటుంది. అది తల్లిపాలలాంటి పేగు బంధం. తల్లి నవమాసాలు మోసి అన్నం మెతుకులు అలవాటు అయ్యేదాకా పాలిచ్చి సాకితే, నేల తల్లి, వ్యవసాయ భూమి మాత్రం కట్టె కాలే దాకా అన్నం పెడుతూ తల్లిలా సాకుతుంది. ఆ తల్లిలాంటి భూమిని లాక్కుంటామంటే లడాయి చెయ్యక లొంగిపోతారా? పాలకులకు సైతం పరిమితులుంటాయని మర్చిపోవద్దు. లగచర్ల లడాయికి సంఘీభావంగా మానుకోటలో ధర్నా పెడితే అనుమ తి లేదన్న కాంగ్రెస్ ప్రభుత్వం.. గిరిజనుల భూములు లాక్కోవడానికి ఎవరి అనుమతి తీసుకున్నది? భూమి అంటే కేవలం రియల్ ఎస్టేట్ సరిహద్దులుగానే కనిపించే రేవంత్‌కు భూమి బంధం విలువ తెలుసా? ఈ నేలపై జరిగిన అనేక తిరుగుబాటులు భూమి కోసం, భుక్తి కోసం, తాడిత, పీడిత ప్రజల విముక్తి కోసం జరిగినవే. నాడు భారత స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్‌వారితో జరిగిన పోరు, నిజాం నవాబు రజాకార్లకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం%ౌ% ఏవైనా భూమి కోసం జరిగినవే. నాడు జల్, జంగల్, జమీన్ నినాదంతో కొమురం భీం పోరుసల్పిన నేల ఇది. దేశ్‌ముఖ్ దొరలను ఉరికిచ్చిన చాకలి ఐలమ్మ నడయాడిన నేల ఇది. జైలు గోడల మధ్య మగ్గుతూ ఆ గోడలపైనే బొగ్గుతో 'నా నిజాము తరతరాల బూజు' అని రాసి సంకెళ్ల మధ్య సైతం సమరం సాగించిన ధీశాలి దాశరథి పుట్టిన గడ్డ ఇది. 'అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి. అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తి ప్రాప్తి. అన్యాయాన్నెదిరించినోడు నాకు ఆరాధ్యుడు' అన్న ధిక్కార స్వరం కాళోజీని కన్న నేల ఇది. పోరాటాలకు పుట్టినిల్లు అయిన ఓరుగల్లు నుంచే కాంగ్రెస్ ప్రభుత్వంపై భారత రాష్ట్ర సమితి పోరుకు సిద్ధమైంది. మా జాతి బిడ్డలకు జరిగిన అన్యాయంపై గర్జించడానికి మానుకోట గడ్డకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన బలగంతో వస్తున్నారన్న మతలబును అందుకొని నలుమూలల నుంచి వేలాదిమంది ప్రజలు మానుకోట నడిబొడ్డుకు చేరుకున్నారు. అడుగడుగునా సర్కారు పెట్టిన నిర్బంధం, కోర్టు విధించిన పరిమితికి మించి గిరిజన బిడ్డలు మానుకోట గడ్డకు తరలిరావడం విశేషం. లగచర్లలో లడాయి జరిగితే మానుకోటకు ఏం సంబంధం? అన్న ప్రభుత్వ ప్రశ్నకు ప్రజా స్పందనే సమాధానమైంది. మానుకోట రాళ్లు నాడు తెలంగాణ ఉద్యమ సత్తా ప్రపంచానికి చాటాయి. నేడు అదే మానుకోట రాళ్లను ముద్దాడి ఆ స్ఫూర్తిని నరనరాన నింపుకొని కాంగ్రెస్ కోటను బద్దలు కొట్టడానికి ప్రతీ తెలంగాణ బిడ్డ కంకణబద్ధులు కావడం శుభపరిణామం.

# వెర్రితలలు వేస్తున్న స్వేచ్ఛ




ఒక దినపత్రికలో ఇటీవల కేసీఆర్ గురించి ప్రచురితమైన తాటికాయంత శీర్షిక ఆయనపై దుష్ప్రచారానికి పరాకాష్ఠ. తెలంగాణ సాధకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, ప్రజల ఆరాధ్య నాయకుడిపై ఆ వార్తా పత్రిక విషం కక్కిందనడానికి ఆ శీర్షికే నిదర్శనం. ప్రజాస్వామ్యంలో మీడియాను ఫోర్త్ ఎస్టేట్‌గా పరిగణిస్తుంటాం. అలాంటిది ఒక పత్రికకు ప్రజా జీవితంలో ఏ వార్త ప్రధానమో, ఏది కాదో అర్థం కాని పరిస్థితి నెలకొనడం శోచనీయం. ఆ పత్రికకు ఎంత కసి, కక్ష ఉంటే తప్ప ఇంతటి దుస్సాహస శీర్షికతో కూడిన ఒక వార్త ప్రచురిస్తుంది? ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ, విలువలు పాటించవలసిన జర్నలిజం.. నిజనిర్ధారణ సిద్ధాంతాన్ని గాలికి వదిలేసి, విద్వేషపూరిత విష ప్రయోగం మనుషుల మస్తిష్కాల్లోకి జొప్పించజూడటం హేయనీయం. కేసీఆర్ వ్యక్తిత్వ హననానికి నిర్లజ్జగా, నిర్హేతుకంగా సదరు పత్రిక పూనుకోవడం అత్యంత దారుణం. మానసిక హీన దుర్బల ఉద్వేగంలో ఉచ్ఛరించిన పదజాలాన్ని సార్వజనీన ఆమోదమైందని, సత్యదూర భావనలను ప్రచురించడం ఏ పాటి జర్నలిజం నైతిక వర్తనమో అర్థం కావడం లేదు. దేశ కాలమాన పరిస్థితులను, సమస్యల విషవలయంలో చిక్కుకున్న ప్రజలను కాపాడుకోవడానికి సువిశాల మానవీయ దృక్పథంతో విలువలకు కట్టుబడి భావనలను వ్యక్తపరచవలసిన పత్రిక చేయవలసిన పని ఇదేనా? పొద్దస్తమానం మానవ ఉద్వేగాలతో ఆటలాడుతూ జర్నలిజాన్ని పచ్చి వ్యాపారాత్మకంగా, స్వార్థపూరిత ప్రయోజనాల కోసం బలి చేస్తూ సంయమనం, సుహృద్భావం, ప్రజా సంక్షేమం.. ప్రమాణాలుగా విరజిల్లవలసిన మాధ్యమం పచ్చి ప్రకోపాల వ్యక్తీకరణకు వాహకమై ప్రజలను రెచ్చగొట్టి సమాజ కల్లోలానికి ప్రేరేపించడం విచారించదగిన దుష్పరిణామం. ఉద్రేకాలను పురిగొల్పుతూ తాము సంధించే విషపూరిత, విద్వేషపూరిత శీర్షికల వల్ల సాధించేదేముంది? ఏ రాజకీయ పక్షాన్నో, ఏ పార్టీ నాయకుడినో సమర్థించి తను పబ్బం గడుపుకోవడానికి జర్నలిజం వ్యవస్థనే సాధనంగా మలుచుకోవడం ఒక దుష్ట సాంప్రదాయం. భారత రాజ్యాంగం ప్రసాదించిన 'స్వేచ్ఛ' వెర్రితలలు వేస్తున్న జర్నలిజం నియంత్రణ కోల్పోయి ఇలాంటి శీర్షికలు పెడుతూ ప్రజలను మభ్యపెడుతున్నది. తమ స్వార్థపూరిత పరిధిలో సమాజాన్ని నియంత్రించాలనుకోవడం పరమ దుర్మార్గం. ఏది రాస్తే ప్రజలకు చేరుతుందనేది ప్రధానం కాదు. ఏది రాసినా చెల్లుబాటు అవుతుందని.. స్వేచ్ఛ పేరుతో ఇంతగా దిగజారిన పరిస్థితిని కల్పించే ఏ మాధ్యమమైనా ఖండనీయమే. రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంగా అహరహం తపించి, రాష్ట్రాన్ని సాధించి, ప్రజా సంక్షేమానికి కట్టుబడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన మహోన్నత వ్యక్తి కేసీఆర్. దేశంలో ఎవరికీ ఊహకందని నిర్మాణాత్మక ప్రగతి పథకాలను ప్రవేశపెట్టి, సర్వవిధాలుగా తెలంగాణను తీర్చిదిద్దిన మహా మనీషి కేసీఆర్. అలాంటి వ్యక్తిని కించపరుస్తూ అదే సెన్సేషనల్ వార్తగా ప్రచురిస్తూ పైశాచికానందాన్ని పొందడం జర్నలిజానికి ఒక మాయని మచ్చ.

### ఫార్మా విలేజ్ కాదు పారిశ్రామిక కారిడార్


# లగచర్ల దెబ్బకు మాట మార్చిన సీఎం రేవంత్

**వామపక్ష నేతలతో ఇండస్ట్రియల్ కారిడార్ అని వెల్లడి**

**గెజిట్‌లో మాత్రం ఫార్మా విలేజ్‌గా పేర్కొన్న ప్రభుత్వం**

**పేరేదైనా ప్రజల నుంచి భూముల సేకరణ తప్పదా?**





R.N.I. No. TELMUL/2016/73158. HSE No. 1051/2023-2025. [Price: ₹. : 5-00.
తెలంగాణ రాజ పత్రము
THE TELANGANA GAZETTE
PART-I EXTRAORDINARY
PUBLISHED BY AUTHORITY
No. 228] HYDERABAD, FRIDAY, JULY 19, 2024.
NOTIFICATIONS BY GOVERNMENT
INDUSTRIES & COMMERCE DEPARTMENT
(IP & INF)
LAND ACQUISITION OF GOVT. ASSIGNED / PATTA LAND SITUATED AT HAKEEMPET, POLEPALLY AND LAGCHERLA VILLAGES FOR ESTABLISHMENT OF PHARMA VILLAGES IN FAVOUR OF TSIIC - RECOMMENDATION OF ACQUISITION PROPOSALS UNDER RFCT LA R&R (TELANGANA AMENDMENT) ACT, 2016.
"In accordance with the provisions contained in Sec 10(A) of the Right to Fair Compensation and Transparency in Land Acquisition, Rehabilitation and Resettlement Act, 2013 in its application to the State of Telangana, the Government has decided and accordingly hereby, in the public interest, exempts acquisition of Government Assigned / Patta land to an extent of Acs.1358.37 gts situated at Hakeempet, Polepally and Lagcherla villages of Vikarabad District from the application of provisions of the Chapter -II and Chapter -III of the Act, for establishment of Pharma Villages in favour of TGIIC. It is also certified that the all efforts have been made in finalizing the minimum extent of land required for the said project."
Accordingly, the District Collector, Vikarabad District and the Vice Chairman & Managing Director, Telangana Industrial Infrastructure Corporation Limited (TGIIC), Hyderabad shall take further necessary action in the matter.
JAYESH RANJAN,
Special Chief Secretary to Government & CIP (FAC)



వికారాబాద్ జిల్లా లగచర్లలో రైతుల తిరుగుబాటుతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగొచ్చారు. వికారాబాద్ జిల్లాలో ఫార్మా విలేజీ ఏర్పాటు అంశంపై మాట మార్చారు. వికారాబాద్ జిల్లాలో ఏర్పాటు చేయనున్నది ఫార్మావిలేజీ కాదని, ఇండస్ట్రియల్ కారిడార్ అని చెప్పారు. అక్కడ కాలుష్యరహిత పరిశ్రమలను ఏర్పాటుచేస్తామని, భూసేకరణ పరిహారం పెంపు అంశాన్ని పరిశీలిస్తామని శనివారం వామపక్ష పార్టీల ప్రతినిధుల బృందానికి సీఎం భరోసా ఇచ్చారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన బయోఏషియా సదస్సు సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ముచ్చర్లలో ప్రతిపాదిత ఫార్మాసిటీని రద్దుచేస్తున్నామని, రాష్ట్రంలో పది ఫార్మా విలేజ్‌లను ఏర్పాటుచేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. మొదటి దశలో మెదక్, వికారాబాద్, నల్లగొండలో ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేస్తామని సీఎం స్పష్టంచేశారు. అయితే, ఈ మూడు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు అందుబాటులో లేవని, ప్రైవేటుగా రైతుల నుంచి భూసేకరణ చేయాల్సి ఉంటుందని అధికారులు తేల్చిచెప్పారు. వికారాబాద్ జిల్లాలో ఫార్మావిలేజీని ఏర్పాటుచేయాలని సీఎం పట్టుదలగా ఉండటంతో అధికారులు ఫార్మా పరిశ్రమల కోసం నోటిఫికేషన్ జారీచేసి భూసేకరణ ప్రక్రియ చేపట్టారు. ఈ ప్రాంతంలో తన అల్లుడికి చెందిన ఫార్మా పరిశ్రమను ఏర్పాటుచేయాలనే ఉద్దేశంతోనే సీఎం ఇంత పట్టుదల చూపిస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో లగచర్లలో అధికారులు భూసేకరణకు చర్యలు ప్రారంభించగా, రైతులు పెద్ద ఎత్తున తిరుగుబాటు చేశారు. తమ భూములను ఫార్మాసిటీకి ఇచ్చేది లేదంటూ ఆందోళనకు దిగారు. లగచర్ల ఘటనలో పోలీసులు అర్థరాత్రి దళితులు, గిరిజనులు, మహిళలపై దాడికి పాల్పడటం దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించింది. అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ప్రభుత్వం ఈ ఏడాది 19న విడుదల చేసిన గెజిట్‌లో మాత్రం ఫార్మావిలేజీగా స్పష్టంగా పేర్కొన్నది. కొత్త గెజిట్ విడుదల చేయకుండా నోటిమాటగా సీఎం మాటమార్చడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇండస్ట్రియల్ కారిడార్ ముసుగులో భూములు సేకరించి, తర్వాత ఫార్మా పరిశ్రమలు ఏర్పాటుచేసే కుట్ర జరుగుతున్నదని రైతులు, ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నాయి.

**భూసేకరణ తప్పదా?**

ఫార్మాసిటీ అయినా, ఇండస్ట్రియల్ కారిడార్‌ను అయినా భూసేకరణ చేయకుండా ఏర్పాటు చేసే అవకాశం లేదు. ఒకవేళ ప్రభుత్వ భూములు అందుబాటులో ఉంటే తప్ప రైతుల నుంచి భూసేకరణ చేయకుండా పరిశ్రమల స్థాపనకు అవకాశమే లేదని పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి. ఫార్మాసిటీకి సరిపడా ప్రభుత్వ భూమి అందుబాటులో లేనందునే అధికారులు భూసేకరణకు తెరలేపారు. కొడంగల్‌లో దొరల సీలింగ్ భూములు 1,156 ఎకరాలు పడావుగా ఉన్నాయని, వాటిని పరిశ్రమల కోసం తీసుకునే అంశాన్ని పరిశీలించాలని వామపక్షాలు సీఎంకు సూచించాయి. కాగా, సీఎం మాత్రం భూసేకరణకు నష్ట పరిహారం పెంచే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పడం గమనార్హం. దీనినిబట్టి పరిశ్రమల కారిడార్ కోసం సీఎం భూసేకరణ చేయించేందుకే పట్టుదలగా ఉన్నట్టు స్పష్టమవుతున్నది. వామపక్షాలు సూచిస్తున్నట్టుగా ప్రభుత్వం సీలింగ్ భూములను తీసుకుంటుందా? రైతుల నుంచి భూములను సేకరించేందుకు మొగ్గు చూపుతుందా? అనేది రానున్నరోజుల్లో తేలిపోతుంది. బీఆర్‌ఎస్ ప్రభు త్వం ప్రతిపాదించిన ముచ్చర్ల ఫార్మాసిటీ ప్రాజెక్టును రద్దు చేస్తున్నట్టు సీఎం ప్రకటించడం కాంగ్రెస్ సర్కారుకు తలపోటుగా మారింది. ఆ భూముల్లోనే ఫార్మాసిటీని యథాప్రకారం అమలుచేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేదికాదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

### ఏ సమయంలో ఎండ ద్వారా మనకు

# విటమిన్ డి ఎక్కువగా లభిస్తుంది



మన శరీరానికి విటమిన్ డి ఎంతో అవసరం అన్న విషయం అందరికీ తెలిసిందే. రోజూ కాసేపు సూర్యకాంతిలో మన శరీరం తగిలేలా ఉంటే మన ఒంట్లో విటమిన్ డి తయారవుతుంది. విటమిన్ డి తగినంతగా ఉంటేనే మన ఎముకలు, దంతాలు ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే రోగ నిరోధక వ్యవస్థను కూడా విటమిన్ డి ప్రభావితం చేస్తుంది. విటమిన్ డి వల్ల మనం ఆరోగ్యంగా ఉంటాం. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఇంకా శరీరంలో పలు జీవక్రియలు సక్రమంగా జరిగేందుకు కూడా మనకు విటమిన్ డి అవసరం అవుతుంది. అయితే రోజులో సూర్యకాంతి ఏ సమయంలో ఎక్కువగా ఉంటుంది, ఏ సమయంలో మనం ఎండలో నిలబడితే మన శరీరం ఎక్కువ విటమిన్ డిని తయారు చేసుకుంటుంది.. అన్న వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం.

**ఏ సమయంలో..?**

రోజులో ఉదయం లేదా సాయంత్రం సమయంలో అతినీలలోహిత కిరణాల ప్రభావం తక్కువగా ఉంటుంది. కనుక ఉదయం 8 గంటల లోపు లేదా సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య సూర్య కాంతి తగిలేలా ఎండలో నిలబడాలి. దీంతో సూర్యకాంతిని గ్రహించుకుని శరీరం విటమిన్ డిని తయారు చేసుకుంటుంది. విటమిన్ డిని శరీరం అలా తయారు చేసుకుని పలు అవసరాలకు ఉపయోగించుకుంటుంది. అయితే ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య సూర్యకాంతి తీవ్రత ఎక్కువ. సూర్యకాంతి ద్వారా శరీరం ఈ సమయంలోనే ఎక్కువ విటమిన్ డిని తయారు చేసుకుంటుంది.

**ఉదయం అయితే మంచిది..**

అయితే ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య మనం ఎండ తీవ్రత కారణంగా ఎండలో నిలబడలేం. అందుకు గాను కొందరు సన్ ప్రొటెక్షన్ క్రీమ్‌లను రాసుకుంటారు. అయితే ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ, విటమిన్ డిని శరీరం ఎక్కువగా తయారు చేసినప్పటికీ, ఈ సమయంలో వచ్చే కాంతిలో అతినీలలోహిత కిరణాలు ఎక్కువగా ఉంటాయి కనుక శరీరానికి హాని కలుగుతుంది. కనుక ఉదయం 8 గంటల లోపు అయితే చాలా మంచిదని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీని వల్ల సూర్యకాంతిని శరీరం తగినంతగా గ్రహించి విటమిన్ డి ని తయారు చేసుకుంటుంది. ఇక విటమిన్ డి మనకు పలు ఆహారాల ద్వారా కూడా లభిస్తుంది.

**విటమిన్ డి ఉండే ఆహారాలు..**

కోడిగుడ్లు, చీజ్, నారింజ పండ్లు, పుట్టగొడుగులు, మటన్ లివర్, చేపలు, రొయ్యలు, జున్ను, నెయ్యి, మొక్కజొన్న, పాలు, పచ్చి బఠానీలు వంటి ఆహారాలను తరచూ తీసుకోవడం వల్ల కూడా మనం విటమిన్ డిని పొందవచ్చు. విటమిన్ డి పెద్దలకు రోజుకు 20 మిల్లీగ్రాముల మేర అవసరం అవుతుంది. విటమిన్ డి లోపిస్తే మన శరీరం పలు లక్షణాలను సూచిస్తుంది. వాటిని పరిశీలించడం ద్వారా శరీరంలో విటమిన్ డి లోపించిందని అర్థం చేసుకోవచ్చు. విటమిన్ డి లోపిస్తే ఎముకలు బలహీనంగా మారిపోతాయి. దీంతో ఎముకల్లో నొప్పి వస్తుంటుంది. అలాగే కండరాలు బలహీనంగా మారి ఒళ్లంతా నొప్పులుగా ఉంటుంది. రోగ నిరోధక శక్తి తగ్గుతుంది. దీంతో తరచూ ఇన్‌ఫెక్షన్ల బారిన పడుతుంటారు. ముఖ్యంగా దగ్గు, జలుబు వంటి సమస్యలు తరచూ వస్తుంటాయి. ఈ లక్షణాలు ఎవరిలో అయినా కనిపిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ను కలిసి విటమిన్ డి ట్యాబ్లెట్లను వాడాలి. అలాగే పైన తెలిపిన ఆహారాలను తరచూ తింటుండాలి. దీంతో విటమిన్ డి లోపం నుంచి సులభంగా బయట పడవచ్చు. ఆరోగ్యంగా ఉండవచ్చు.

# అమెరికాలో కేసు భారత్‌లో దుమారం



విద్యుత్ ఒప్పందాల్లో అదానీ లంచాల వ్యవహారంపై అమెరికాలో కేసు నమోదైంది. దీంతో మన దేశంలో రాజకీయ దుమారం చెలరేగింది. ప్రధానంగా ఏపీ, తెలంగాణ రాజకీయాల్లో అదానీ ప్రభావం కనిపిస్తున్నది. ఇప్పటికిప్పుడు ఏదో అయిపోతుందని కాదు కానీ, తమ దేశ చట్టాల ప్రకారం కేసును అమెరికా ముందుకు తీసుకువెళ్తే మాత్రం పెను ప్రకంపనలు తప్పవు. ఇతర ప్రయోజనాలు ఆశించి మన దేశంలో లాగానే వ్యవహరిస్తే మాత్రం అదానీ వివాదం టీ కప్పులో తుఫాన్ వలె ముగిసిపోతుంది. విద్యుత్ ఒప్పందాల్లో రూ.2 వేల కోట్ల వరకు లంచాల ఆరోపణలపై గౌతమ్ అదానీతో పాటు సాగర్ అదానీ, వినీత్ జైన్, రంజిత్ గుప్తా, సిరిల్ కబా నెస్, సౌరవ్ అగర్వా ల్, దీపక్ మల్హోత్రా, రూపేష్ అగర్వాల్ సహా ఎనిమిది మందిపై కేసులు నమోదయ్యాయి. అమెరికా న్యాయవిభాగం అధికారిక వెబ్‌సైట్‌లో ఈ వివరాలు అందుబాటులో ఉన్నాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ విద్యుత్ ఒప్పందాల్లో లంచాల వ్యవహారంపై కేసు అమెరికాలో నమోదు కాగా, ఆ కంపెనీ కార్యకలాపాలు భారత్‌లో నిర్వహిస్తున్నది. విద్యుత్ ఉత్పత్తి చేసేదీ, వినియోగించేదీ ఇక్కడే. ఒప్పందాలు చేసుకున్నదీ ఇక్కడి రాష్ట్రాలతోనే. అయితే అమెరికాలో కేసులేమిటి? అమెరికాకు ఏం సంబంధం? అనే సందేహాలు కలుగవచ్చు. గ్రీన్ ఎనర్జీ కోసం అదానీ కంపెనీ అమెరికన్ల నుంచి కూడా నిధులు సేకరించింది. అందుకోసం అదానీ కంపెనీ గురించి ఆ దేశంలో ఇన్వెస్టర్లకు సమాచారం ఇచ్చారు. తమ కంపెనీ లంచాలకు వ్యతిరేకమని, విలువలు పాటించామని తప్పుడు సమాచారం ఇచ్చారనేది ప్రధాన ఆరోపణ. లంచాల వ్యవహారం మన దేశంలోనే జరిగినా.. అది అమెరికా నిబంధనలకు విరుద్ధం. కాబట్టి, అమెరికా చట్టాల ప్రకారం కేసులు అక్క డ నమోదయ్యాయి. అదే భారత్‌లో అయితే గతంలో వచ్చిన ఆరోపణలు టీ కప్పులో తుఫాన్‌లా ముగిసినట్టే ఇప్పుడూ అలాగే ముగిసేవి. కానీ, ఇప్పుడు కేసులు నమోదైంది అమెరికాలో కాబట్టి అంత సులువుగా సమసిపోతాయనే అంచనాకు రాలేం. రెండు దేశాల మధ్య సంబంధాలు, ఇతర అనేక అంశాలు ఈ కేసుపై ప్రభా వం చూపుతాయి. బైడెన్ శకం మరో రెండు నెలల్లో ముగిసిపోయి.. ట్రంప్ శకం ప్రారంభం కానున్నది. దీనిపై బైడెన్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో తెలియదు. రెండు నెలల్లోనే నిర్ణయాలు వెలువడతాయా? లేక ట్రంప్ పగ్గాలు చేపట్టేదాకా కేసు కొనసాగుతుందా అనేది కూడా మనం చెప్పలేం. 'ఓటుకు నోటు కేసులో ఏకంగా ఎమ్మెల్సీనే కొనేందుకు రూ.50 లక్షల నగదుతో పట్టుబడ్డ రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకొని మరీ ముఖ్యమంత్రిని చేశారు. రూ.2 వేల కోట్ల లంచం ఆరోపణలు వచ్చిన అదానీ ఒకవేళ కాంగ్రెస్‌లో ఉండి ఉంటే అతడిని ప్రధానమంత్రిని చేసేవారా?' అని నెటిజన్లు రాహుల్‌గాంధీని ఒక ఆట ఆడుకుంటున్నారు. ఒకవైపు న్యాయస్థానాల్లో కేసు నడుస్తుండగా నే దేశంలో జోరుగా రాజకీయాలు సాగుతున్నాయి. రాజకీయ పక్షాలు ప్రతి అంశం నుంచి ప్రయోజనాలను ఆశిస్తాయి. అమెరికా కోర్టు అదానీ అరెస్టుపై ప్రకటన చేయగానే ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ తీవ్రంగా స్పందించా రు. ఒక ముఖ్యమంత్రిపై రూ.10-15 కోట్ల ఆరోపణలు రాగానే అతన్ని అరెస్టు చేశారని, మరి రూ.2 వేల కోట్ల అవినీతి ఆరోపణలు వచ్చినా అదానీని ఎందుకు అరెస్టు చేయడం లేదని ఆయ న ప్రశ్నించారు. నిజమే ఎలాంటి ఆధారాలు లేకపోయినా లిక్కర్ స్కామ్ అంటూ ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఉన్న కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారు. అదే విధంగా ఝూర?ండ్ సీఎంనూ అరెస్ట్ చేశారు. మరి అమెరికా వంటి అగ్రరాజ్యం కోర్టు చెప్పినా అదానీని ఎందుకు అరెస్టు చేయడం లేదు. రాహుల్‌గాంధీ అడిగిన ప్రశ్నలో న్యాయం ఉన్న ది. అయితే ఆయన వేసిన ప్రశ్నకు కౌంటర్‌గా సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు సంధించిన ప్రశ్నలు మరింత ఆసక్తికరంగా ఉన్నాయి. 'అదా నీ విద్యుత్ ఒప్పందాల కోసం లంచాలు ఇవ్వజూపారనేది ఆరోపణలు మాత్రమే. నిజం కావచ్చు, కాకపోవచ్చు. ఆరోపణలకే అదానీని అరెస్టు చేయాలని రాహుల్ పట్టుబడుతున్నారు. మరి ఏకంగా ఓటుకు నోటు కేసులో శాసనమండలి సభ్యుడిని కొనేందుకు రూ.50 లక్షల నగదుతో దొరికిన రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకొని ముఖ్యమంత్రిని చేశారు. మరి రూ.2 వేల కోట్ల లంచం ఆరోపణలు వచ్చిన అదానీ ఒకవేళ కాంగ్రెస్‌లో ఉండి ఉంటే అతన్ని ప్రధానమంత్రిని చేసేవారా?' అని నెటిజన్లు రాహుల్‌గాంధీ ని ఆడుకుంటున్నారు. కాంగ్రెస్ నాయకులు అదానీ వ్యవహారంలో మోదీని తప్పుబడితే.. బీజేపీ నాయకులు రేవంత్‌రెడ్డిని ఆడుకుంటున్నారు. అదానీ వ్యవహారంలో మోదీని తప్పుపట్టేవారు.. రూ.వంద కోట్ల విరాళం అదానీ నుంచి తీసుకున్న వ్యవహారంలో, అదానీతో చేసుకున్న ఒప్పందాల వ్యవహారంలో రేవంత్ రెడ్డిని ఎందుకు తప్పుబట్టడం లేదని, అతనిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని బీజేపీ నాయకులు ఎదురు ప్రశ్నిస్తున్నారు. అదానీ కేసు ఎలా ముగుస్తుందనేది అమెరికా కోర్టు నిర్ణయిస్తుంది. ఈ లోపు రాజకీయ పక్షాల న్నీ తమ పార్టీల కోణంలో రాజకీయం చేస్తున్నా యి. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ప్రధాని మోదీ.. అదానీ వ్యవహారాన్ని ప్రస్తావించారు. గతంలో రాహుల్ కూడా అదానీపై ఆరోపణలు చేశారు, ఎన్నికల సమయంలో ట్రక్కుల్లో అదానీ నుంచి నోట్ల కట్టలు రాగానే మౌనం వహించార ని మోదీ ఆరోపించారు. ఈ ఆరోపణల ప్రకారం కాంగ్రెస్‌కు నోట్ల కట్టలు పంపించిన అదానీకి ఇప్పుడు బీజేపీ ఏకంగా అధికార ప్రతినిధిగా అం డగా నిలవాల్సిన అవసరమేమిటి? ట్రక్కుల్లో నోట్ల కట్టలు పంపించే అదానీపై ప్రభుత్వం ఎం దుకు చర్య తీసుకోవడం లేదు? అంటే ప్రధాని స్థాయి వాళ్లు కూడా ఎన్నికల్లో నోటికి వచ్చింది మాట్లాడుతారన్న మాట. వారు కూడా బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తారన్న మాట. ఈ లంచాల వ్యవహారంతో ఏపీకి కూడా సం బంధాలు ఉండటంతో టీడీపీ అనుకూల మీడి యా అదానీ కన్నా జగన్‌నే ఎక్కువగా టార్గెట్ చేస్తున్నది. జగన్ హయాంలో జరిగిన ఒప్పందా ల్లో అదానీ లంచాలు ఇచ్చారని టీడీపీ ఆరోపిస్తు న్నది. అదే నిజమైతే ఆ ఒప్పందాలను ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం రద్దు చేస్తుందా? రాజకీయ విమర్శలే తప్ప ఒప్పందాల రద్దు వంటి చర్యలు ఉండవనిపిస్తున్నది. ఓ సినిమాలో చిరంజీవి ఫ్యాన్‌గా రవితేజ నటిస్తాడు. తన మీద చేయి వేయడం అంటే ఆల్మోస్ట్ చిరంజీవి మీద చెయ్యి వేసినట్లేనని రవితేజ అంటాడు. అదానీ ఒప్పందా లు రద్దు చేసుకోవడం అంటే ఆల్మోస్ట్ మోదీతో బాబు ఒప్పందాలు రద్దు చేసుకోవడమే. ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్న ఏపీ ప్రభుత్వం ఒప్పందాన్ని రద్దు చేసుకొని మోదీకి దూరమయ్యే అవకాశమే లేదు. టీడీపీ, దాని అనుకూల మీడియా అదానీ, మోదీలను మినహాయించి జగన్‌పై విమర్శలకే పరిమితమవుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇదిలా ఉంటే.. అదానీ బృందంపై అమెరికా లో కేసు వార్త బయటకు రాగానే దేశీయ స్టాక్ మార్కెట్ విలవిలలాడిపోయింది. అదానీ గ్రూప్‌కు చెందిన అన్ని స్టాక్స్ 10-20 శాతం వరకు పడిపోయాయి. ఈ ప్రభావం మొత్తం మార్కెట్‌పై చూపింది. మరుసటి రోజు మార్కెట్ కోలుకున్నా అదానీ గ్రీన్ ఎనర్జీపై మాత్రం నీలినీడలు అలానే కమ్ముకున్నాయి. మోదీ ఉన్నంతవరకు అదానీకి ఏమీ కాదనే మాటలు చాలా బలంగా వినిపిస్తున్నాయి. నిజంగా అదానీ లంచం ఇచ్చా రా? లేదా? అనేది అమెరికా కోర్టు తేలుస్తుంది. అయితే, మన దేశంలో ఒక పాన్‌షాప్ పెట్టాల న్నా, ఇల్లు కట్టుకోవాలన్నా ఎవరో ఒకరికి లం చం ఇవ్వక తప్పదు. ఇవ్వకపోతే పని ముందుకు సాగదు. ఈ విషయం మనందరికీ అనుభవమే. లంచం ఇచ్చారా? లేదా? అనేది దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు.

# మానుకోటలో లగచర్ల లడాయి

తెలంగాణ ప్రజలు మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టబోతున్నారా? మరో మహత్తర పోరాటానికి తెలంగాణ గడ్డ నాంది పలకబోతున్నదా? గతంలో జరిగిన ఉద్యమాలు పునరావృతం కాబోతున్నయా? రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ఔననే సమాధానం చెప్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గమైన కొడంగల్‌లో జరుగుతున్న నిర్బంధకాండపై, గిరిజనుల భూ పోరాటానికి సంఘీభావంగా రాష్ట్రవ్యాప్తంగా యుద్ధభేరీ మోగడం గమనార్హం. లగచర్లలో తిరుగుబాటు రాష్ట్రంలో పెను ప్రకంపనలు సృష్టించడమే కాదు, ఊరూరా తిరుగుబాటు ఉద్యమాలకు ఊపిరిపోసింది. మహబూబాబాద్‌లో గిరిజనులంతా ఏకమై ఈ నెల 25వ తేదీన గిరిజన సభ నిర్వహించబోతున్నారు. లంబాడ గిరిజను లు లగచర్లకు తోటి గిరిజనులకు జరిగిన అన్యాయాన్ని తెలుసుకొని, వారికి సంఘీభావం గా ఆ సభ నిర్వహించనున్నారు. అందుకే గిరిజన బిడ్డలకు జరిగిన అన్యాయంపై చర్చ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. లగచర్ల గిరిజన రైతులకు మద్దతుగా మహబూబాబాద్ గిరిజను లు సభ నిర్వహిస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వంలో వణుకు పుడుతున్నది. ఆ సభకు అనుమతి ఇవ్వకపోవడమే అందుకు తార్కాణం. లగచర్ల లడాయి ఇక రాష్ట్ర లడాయిగా మారబోతుందనే సంకేతాలు కన్పిస్తున్నాయి. ఎందుకంటే 20వ తేదీన ఆ సభను నిర్వహించాలని గిరిజనులు అన్నిరకాలుగా సమాయత్తమైతే, అర్ధరాత్రి సభ అనుమతులను పోలీసులు రద్దుచేసి తమ నియంతృత్వాన్ని, నిరంకుశత్వాన్ని చాటుకున్నా రు. అర్థాంతరంగా సభ అనుమతిని ఎందుకు రద్దు చేశారనడిగితే పైనుంచి ఆదేశాలు వచ్చిన ట్టు పోలీసులు చెప్పుకొచ్చారు. అయినా గిరిజన ప్రజలు ఏ మాత్రం అదరకుండా, బెదరకుండా ఎలాగైనా సభ నిర్వహించాలని ప్రతిపక్ష పార్టీ నేతల వారి సూచనల తో మహబూబాబాద్ రైతులు కోర్టుకు వెళ్లి న్యాయ పోరాటం చేశారు. లగచర్ల గిరిజన రైతు లకు మద్దతుగా సభ నిర్వహించేందుకు మాకు అనుమతులు ఇవ్వాలని కోర్టుకు విన్నవించుకు న్నారు. వారి మొరను ఆలకించిన రాష్ట్ర అత్యున్న త న్యాయస్థానం ఈ నేల 25వ తేదీన సభ నిర్వహించేందుకు అనుమతి ఇచ్చింది. దీంతో గిరిజనుల న్యాయ పోరాటం ఫలించింది. తమ కు, తమ గళాలకు స్వాతంత్ర్యం వచ్చిందన్నట్టుగా, తాము తొలి విజయం సాధించామన్నట్టుగా, సమరోత్సాహంతో గిరిజనులు సభ ఏర్పాట్లలో మునిగి తేలుతున్నారు. ఎక్కడో జరిగిన లగచర్లకు, ఇక్కడ ఉన్న మానుకోటకు సంబం ధం ఏమున్నదనే ప్రశ్న అన్ని వర్గాల్లో రావచ్చు. అయితే, లగచర్ల లడాయి ఒక్క కొడంగల్‌కే పరిమితం కాలేదు. అది రాష్ట్రమంతటా విస్తరించిం ది. అందులో భాగంగానే మానుకోటలో సభ జరుగనున్నది. తెలంగాణ ఉద్యమం కూడా మానుకోట నుంచే మలుపు తిరిగిందన్న వాస్తవాన్ని ప్రభుత్వ యంత్రాంగం ఈ సందర్భంగా గుర్తుచేసుకోవావాలి. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులను గమనిస్తుంటే మానుకోట గిరిజన రైతులు మరో ఉద్యమానికి ముగ్గు పోస్తున్నట్టే అనిపిస్తున్నది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గ ప్రజలను పట్టించుకోకున్నా.. మహబూబాబాద్ గిరిజన సభలో వక్తలు తెలిపే సంఘీభావం, ఆ సభలో చేసే గిరిజనుల




తీర్మానాలు లగచర్ల రైతులకు కొండంత భరోసాను ఇవ్వనున్నాయి. మానుకోట ప్రజలు, బీఆర్‌ఎస్ నేతలే కాదు, మహబూబ్‌నగర్ నుంచి ములుగు దాకా, మధిర నుంచి మెదక్ దాకా యావత్ రాష్ట్ర రైతాంగం లగచర్ల కర్షకులకు అండగా నిలవనున్నదనే సంకేతాలు యువనేత కల్వకుంట్ల తారక రామారావు నోట వెలువడనున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ సర్కారు కొలువుదీరి న తర్వాత, ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి పదవీ బాధ్యతలు తీసుకున్నాక రాష్ట్రంలోని అన్ని వర్గాలు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా రైతులు పడుతున్న అవస్థలు చెప్పనలవి కాదు. రైతాంగం కష్టాలకు భూ సమస్యలు తోడవ్వడంతో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం గుర్తుకొస్తున్నది. పోరాడితే పోయేదేమీ లేదన్న తెగింపుతో భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం రైతు కూలీలు తిరగబడిన అపూర్వ ఘట్టం కండ్ల ముందు కదలాడు తున్నది. రక్తాక్షరాలతో చరిత్ర లిఖించిన సంద ర్భమది. నేడు లగచర్ల ఘటన కూడా అచ్చం అలాగే తలపిస్తున్నది. ఫార్మా విలేజీ కోసం రైతుల భూములను కాంగ్రెస్ సర్కార్ గుంజుకుంటున్న తీరు, వారిపై పోలీసులు చేస్తున్న దాష్టీకాన్ని చూస్తుంటే రజాకార్లే గుర్తుకొస్తున్నా రు. ఇదిలా ఉంటే సీఎం సొంత నియోజకవర్గంలో రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. అంతేకాదు, తమ చావుకు కారణం సీఎం, అతని అన్నదమ్ములేనని వాంగ్మూలం రాసి చనిపోతున్నారు. ఇంతటి విషాదం ఈ ప్రజాస్వా మ్య దేశంలో నేనెప్పుడూ చూడలేదు. అయినా ఈ ఘటనపై ముఖ్యమంత్రి కాని, ఆయన మంత్రివర్గం కాని స్పందించడం లేదంటే రైతు లపై వారికి ఉన్న ప్రేమను తెలియజేస్తున్నది. డైవర్షన్ రాజకీయాల్లో ఆరితేరిన ముఖ్యమంత్రి సందెట్లో సడేమియా అన్నట్టు ధాన్యం కొనుగోళ్ల సమస్యను పక్కదారి పట్టించారు. బోనస్ ఇస్తా మని బోగస్ మాటలు మాట్లాడిన ప్రభుత్వం ఇప్పుడు రైతులకు చెయ్యిస్తున్నది. అంతేకాదు, గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన రైతుబంధును రేవంత్ సర్కారు ఎత్తివేసింది. రైతులకు రుణమా ఫీ చేశామని ప్రగల్భాలు పలుకుతూ పల్లెలకు పోతున్న కాంగ్రెస్ నాయకులను తరుముతున్నా రు. ఇదిలా ఉంటే విద్యుత్ కోతలు గురించి ఎంత తక్కువ చెప్తే అంత మంచిది. సబ్సిడీలను నిలిపివేయడంతో రైతులు, రైతు కూలీలు కాంగ్రె స్ ప్రభుత్వంపై కన్నెర్ర చేస్తున్నారు. మొత్తంగా ఆకలిచావులు, ఆత్మహత్యలతో రాష్ట్రం తెల్లవారు తున్నది. ఏడాది కూడా పూర్తవకుండానే రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై విసిగి వేసారిపోయారు. అందుకేనేమో నాడు నిజాం సర్కారుకు వ్యతిరేకంగా రైతాంగ పోరాటం సాగినట్టే.. నేడు రాష్ట్ర ప్రభుత్వంపై తిరుగుబాటు మొదలైంది. తెలంగా ణ గడ్డ మీద భూ పోరాటాలు, ఉద్యమాలకు రైతులు కదం తొక్కుతున్నారంటే.. రేవంత్ నేతృత్వంలోని ఈ నెనరు లేని కాంగ్రెస్ సర్కారుకు రోజులు దగ్గరపడ్డట్టే లెక్క.

# వ్యాయామం ఆనందంగా.. హాయిగా!

ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవనశైలిలో నిస్సత్తువ ఆవహించడం వ్యాయామం అంటే ఉత్సాహం అంతగా ఉండదు. అయితే, శారీరకంగా, మానసికంగా బలంగా ఉండాలంటే నిరంతరం చురుగ్గా ఉండటం కీలకం. ఎప్పుడైనా నిస్సత్తువగా అనిపిస్తే మిమ్మల్ని మీరు ఉత్సాహపర్చుకోవడానికి ఆచరణ సాధ్యమైన కొన్ని వ్యూహాలను అమలుచేయాలి.

**సాంకేతిక సహకారం**

ఫిట్‌నెస్ యాప్స్‌ను ఉపయోగించుకోవాలి. మీ పురోగతి ఎలా ఉందో వాటి ద్వారా తెలుసుకుంటూ ఉండాలి.

**చిన్నగా మొదలుపెట్టి**

మొదట్లో చేయగలిగే పనులతో ప్రారంభించాలి. ఓ పది నిమిషాల నడకతోనే తేడా కనిపిస్తుంది. క్రమంగా మీ శక్తి స్థాయులను పెంచుకుంటూ పోవాలి.

**వాస్తవ లక్ష్యాలు**

నిస్సత్తువ ఆవహించకుండా ఉండాలంటే మీరు సాధించగలిగే లక్ష్యాలను మాత్రమే మీ ముందు ఉంచుకోండి.

**ఆనందించే కార్యక్రమాలు**

వ్యాయామాలను మీరు హాయిగా చేయగలిగే వాటినే ఎంచుకోవాలి. డాన్సింగ్, ఈతకొట్టడం ఏదైనా సరే దాన్ని ఆనందంతో చేస్తే బోర్‌గా అనిపించదు.

**రోజువారీ పనుల్లో కదలిక**

పై అంతస్తుకు వెళ్లడానికి లిఫ్ట్ బదులుగా మెట్లెక్కడం, దగ్గరలో ఉన్న ప్రదేశాలకు నడుస్తూనో, సైకిల్‌పైనో వెళ్లడం చేయాలి. ఇలాంటి చిన్నచిన్న మార్పులు వ్యాయామానికి ప్రత్యేకంగా సమయం కేటాయించే అవసరం లేకుండానే మిమ్మల్ని చురుగ్గా ఉంచుతాయి.

**అండగా కొందరు**

మీ స్నేహితులతో కలిసి వ్యాయామం చేయండి. మీ ఫిట్‌నెస్ లక్ష్యాలను వారితో పంచుకోండి. అలా మిత్రుల మద్దతు పొందండి.

**శరీరాన్ని వినండి**

మీ శరీరం ఏం చెబుతుందో వినండి. మీకు కష్టంగా అనిపించే




పనులకు వెళ్లకూడదు. తీవ్రమైన అలసట ఉన్నప్పుడు మరింత జాగ్రత్తగా ఉండాలి. మీ సెలవు రోజులను శరీరం కుదురుకోవడానికి ఓ అవకాశంగా మలుచుకోవాలి.

**నిద్ర, పోషకాహారం**

రోజంతా శక్తి సరిపోయినంత ఉండాలంటే తగినంత నిద్ర అవసరం అనే సంగతి మర్చిపోవద్దు. అలానే తాజా పండ్లు, కూరగాయలు, తేలికైన ప్రొటీన్లు, ముతకధాన్యాలతో కూడిన పోషకాహారం తీసుకోవాలి.

# వైరస్‌లు క్యాన్సర్ కారకాలు



శరీరంలో ఏదైనా భాగంలో కణాల పెరుగుదల అదుపులేకుండా పెరిగి ఇతర భాగాలకు వ్యాపించడాన్ని క్యాన్సర్‌గా పేర్కొంటారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది ప్రజల అనారోగ్యానికి, మరణాలకు క్యాన్సర్ ప్రధాన కారణంగా ఉంటున్నది. ఇప్పుడు ఇతర కారకాలతోపాటు వైరస్‌లు కూడా కొన్ని రకాల క్యాన్సర్లను కలగజేయడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నట్టు ఆరోగ్య రంగ నిపుణులు గుర్తించారు. ఈ నేపథ్యంలో వైరస్‌లు క్యాన్సర్‌ను ఎలా కలగజేస్తాయి, వాటిని నిరోధించడానికి ఎలాంటి వ్యూహాలను అనుసరించాలో అవగాహన ఉండాలి. ఇన్ఫెక్షన్లకు కారణమయ్యే అతి సూక్ష్మ అంటురోగాల కారకాలే వైరస్‌లు. ఇవి బయటి వాతావరణంలో నిర్జీవులుగా ఉంటాయి. ఒకసారి జీవిలో ప్రవేశించాయంటే ఆ జీవి కణాల్లో అభివృద్ధి చెందుతూ జీవ లక్షణాలను ప్రదర్శిస్తాయి. అయితే, కొన్ని రకాల వైరస్‌లు అవి ఆశ్రయించిన (హోస్ట్) జీవి కణాల పనితీరులో కలిసిపోయేలా మార్పుచెందుతాయి. దీనివల్ల కణాల సాధారణ విధుల్లో అవాంతరాలు ఏర్పడతాయి. ఇలాంటి వాటిలో 'ఆంకోజెనిక్' లేదా 'ట్యూమర్ వైరస్‌లు'గా పిలిచే అనేక వైరస్‌లు మనుషుల శరీరంలో క్యాన్సర్ అభివృద్ధికి కారణంగా ఉంటాయి. వీటిలో హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ), హెపటైటిస్ బి, హెపటైటిస్ సి వైరస్‌లు (హెచ్‌బీవీ, హెచ్‌సీవీ), లాలాజలం, ఇతర శరీర ఫ్లూయిడ్ల ద్వారా వ్యాపించే 'ఎప్‌స్టీన్ బార్ వైరస్' (ఈబీవీ), హ్యూమన్ ఇమ్యూనో డెఫిషియెన్సీ వైరస్ (హెచ్ఐవీ) లాంటివి ప్రసిద్ధి చెందిన క్యాన్సర్ కారక (ఆంకోజెనిక్) వైరస్‌లుగా ఉన్నాయి. ఈ వైరస్‌లు క్యాన్సర్‌కు దారితీసే మార్గాలు వేర్వేరుగా ఉంటాయి. కాకపోతే అవి వ్యాపించే విధానం మాత్రం దాదాపుగా ఒకేలా ఉంటుంది. ఉదాహరణకు, హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) ఆంకోప్రోటీన్లను ఉత్పత్తి చేస్తుంది. ఇది కణం పనితీరు సాఫీగా సాగిపోయే ప్రక్రియకు అంతరాయం కలిగిస్తుంది. నియంత్రణ లేకుండా కణాలు పెరిగిపోయే క్రమాన్ని ప్రోత్సహిస్తుంది. చివరికి ప్రాణాంతకమైన క్యాన్సర్ అభివృద్ధి చెందడానికి దారితీస్తుంది. అదేవిధంగా, హెపటైటిస్ బి, సి వైరస్‌లు కూడా దీర్ఘకాలిక ఇన్ఫెక్షన్లు, ఇన్‌ఫ్లమేషన్‌కు కారణమవుతాయి. హెపటో సెల్యులర్ కార్సినోమా అనే క్యాన్సర్ అభివృద్ధి చెందే ముప్పును పెంచుతాయి. రోగ నిరోధక వ్యవస్థ బలహీనంగా ఉన్న వ్యక్తులలో, హెచ్ఐవీ సోకిన వారిలో వైరస్ సంబంధిత క్యాన్సర్లు అభివృద్ధి చెందే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

### రోగాల భారం...

ప్రపంచవ్యాప్తంగా ప్రజల్లో క్యాన్సర్ ముప్పు వైరల్ ఇన్ఫెక్షన్లతో ముడిపడి ఉంటుందనే విషయాన్ని గమనించాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) అంచనాల ప్రకారం సంవత్సరానికి ఇరవై లక్షలకుపైగా క్యాన్సర్ కేసులు క్యాన్సర్ కారక వైరస్‌లతో (ఆంకోజెనిక్ వైరస్‌లు) సంబంధం కలిగి ఉన్నాయి. దాదాపు 90 శాతం గర్భాశయ క్యాన్సర్లకు హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ), కాలేయ క్యాన్సర్లలో ఎక్కువ భాగం హెపటైటిస్ బి (హెచ్‌బీవీ), హెపటైటిస్ సి (హెచ్‌సీవీ)లు కారణం అవుతున్నాయి. అయితే, వైరస్ ఇన్ఫెక్షన్లు, వాటి కారణంగా క్యాన్సర్లు రాకుండా నివారించడంలో ప్రభుత్వాలు చేపట్టే ప్రజా ఆరోగ్య కార్యక్రమాలే కీలకపాత్ర పోషిస్తాయి.

### నివారణకు బహుళ నమూనా...

వైరస్‌ల వల్ల అభివృద్ధి చెందే క్యాన్సర్లను నిరోధించడానికి ఆయా రకాల వైరస్‌ల వ్యాప్తిని తగ్గించడం, టీకాలు వేయడం, ముందుగానే స్క్రీనింగ్ పరీక్షలు చేయడం, ఇన్ఫెక్షన్లకు తగిన చికిత్స అందించడం వంటి బహుళ నమూనా (మల్టీ మోడల్) విధానాన్ని అనుసరించాల్సి ఉంటుంది.

### టీకాలు (వ్యాక్సినేషన్)...

క్యాన్సర్ నివారణలో టీకాలు ప్రభావవంతంగా పనిచేస్తాయని రుజువైంది. మహిళల్లో ఎక్కువగా కనిపించే గర్భాశయ క్యాన్సర్‌పై పోరాటానికి హెచ్‌పీవీ టీకా సమర్థంగా పనిచేస్తుంది. అదేవిధంగా, హెపటైటిస్ బి వైరస్‌తో వ్యాపించే కాలేయ క్యాన్సర్ ప్రాబల్యాన్ని తగ్గించడంలో హెపటైటిస్ బి టీకాలు ప్రభావవంతమైన పరిష్కారంగా చెప్పొచ్చు. ప్రజారోగ్య ప్రచార కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా చిన్న వయసులోనే అవసరమైన టీకాలు వేయించుకోవడం, అధిక టీకా రేట్లు నమోదు కావడానికి ప్రభుత్వాలు కృషిచేయాలి.

### స్క్రీనింగ్, ముందస్తు గుర్తింపు...

గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్‌లు పాప్ స్మియర్ టెస్ట్, హెచ్‌పీవీ పరీక్షలు చేయించుకోవడం వంటివి వైరస్‌లతో వచ్చే క్యాన్సర్లను ముందుగా గుర్తించేందుకు ఉపకరిస్తాయి. ముఖ్యంగా ముప్పు ఎక్కువగా ఉన్న వారి విషయంలో క్యాన్సర్ ప్రమాదాన్ని ముందుగానే గుర్తించడానికి స్క్రీనింగ్ పరీక్షలు ఎంతగానో దోహదపడతాయి. చికిత్సను సులభతరం చేస్తాయి.

### యాంటీవైరల్ థెరపీ...

హెపటైటిస్ బి వైరస్, హెపటైటిస్ సి వైరస్ వంటి దీర్ఘకాలిక వైరల్ ఇన్ఫెక్షన్లకు యాంటీవైరల్ చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. వీటితో వైరస్ స్థాయులను సమర్థంగా తగ్గించుకోవచ్చు. ఆ విధంగా క్యాన్సర్ అభివృద్ధి చెందే ముప్పును కూడా తగ్గించవచ్చు. హెపటైటిస్ సి చికిత్సలో ప్రత్యక్షంగా పనిచేసే డైరెక్ట్ యాక్టింగ్ యాంటీవైరల్ ఏజెంట్ల పురోగతి పూర్తి వైరస్ నిర్మూలనకు, క్యాన్సర్ తగ్గడానికి అవకాశం ఇస్తుంది.

### ప్రజా ఆరోగ్య కార్యక్రమాలు...


వైరస్‌లు, కాన్సర్ల మధ్య ఉన్న సంబంధాన్ని ప్రజలకు తెలియజేయడంలో అవగాహన కార్యక్రమాలు కీలకపాత్ర పోషిస్తాయి. అంటువ్యాధులు ఎలా వ్యాప్తి చెందుతాయి, టీకాల ప్రాముఖ్యం, వ్యాధుల బారినపడటాన్ని తగ్గించడానికి సురక్షిత చర్యలు తీసుకోవడం వంటివి ఈ వ్యాధుల ప్రభావాన్ని బాగా తగ్గిస్తాయి. వ్యాధి నిరోధకత పెంపు రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఇన్ఫెక్షన్లు సులభంగా సోకుతాయి. కాబట్టి ఇమ్యూనిటీ బలహీనంగా ఉన్నవాళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ముఖ్యంగా హెచ్ఐవీ, ఇతర వైరల్ ఇన్ఫెక్షన్ల నుంచి బలహీనమైన రోగ నిరోధక వ్యవస్థ ఉన్న సమూహాలు ఎదుర్కొనే ముప్పును తగ్గించడానికి తగిన టీకా కార్యక్రమాలు, స్క్రీనింగ్ చర్యలు దోహదపడతాయి. వైరస్‌లు సాధారణ జలుబు మొదలుకుని క్యాన్సర్ల వ్యాప్తి వరకు ఎన్నో ఆరోగ్య సమస్యలకు కారకాలుగా ఉంటాయి. ఈ సవాలును సమర్థంగా ఎదుర్కోవడానికి వివిధ రంగాల నుంచి సమష్టి కృషి అవసరమవుతుంది. వైరస్ ప్రేరిత, వైరస్ సంబంధిత క్యాన్సర్లను నివారించడంలో టీకాలు, స్క్రీనింగ్, యాంటీవైరల్ థెరపీలు కీలకమైన అంశాలు. ఈ రక్షణ చర్యలపై ప్రభుత్వాలు, ఆరోగ్య రంగ సంస్థలు దృష్టి సారించడం ద్వారా వైరల్ ఇన్ఫెక్షన్ల వల్ల వచ్చే క్యాన్సర్ ముప్పును గణనీయంగా తగ్గించవచ్చు. ప్రాణాలను నిలబెట్టుకోవచ్చు. అంతేకాకుండా ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య పరిస్థితులను కూడా మెరుగుపర్చుకోవచ్చు. అయితే, వైరస్‌లు, క్యాన్సర్ల మధ్య పరస్పర చర్యలపై అంతర్జాతీయంగా పరిశోధనలు కొనసాగుతున్నాయి. కాబట్టి, క్యాన్సర్లను నివారించే దిశగా ఔషధాలు, చికిత్సలు అభివృద్ధి చేసే దిశగా నిరంతర అధ్యయనం, కొత్త కొత్త ఆవిష్కరణలు చేయాల్సిన అవసరం ఎంతో ఉంది.

# గుండెల్ని పిండే కాలుష్యం



భారతీయ నగరాల్లో పెరిగిపోతున్న వాయు కాలుష్యం వల్ల గుండెజబ్బులున్న వారు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం వస్తున్నది. వాయుకాలుష్యం ఇతరులకంటే గుండె జబ్బులున్నవారికి మరింత ప్రాణాంతకమని అమెరికా పరిశోధకులు గుర్తించారు. స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ, హార్వర్డ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ సంస్థలతో కలిసి ఇంటర్‌మౌంటెన్ హెల్త్ సంస్థకు చెందిన పరిశోధకులు వాయు కాలుష్యం వల్ల ఆరోగ్య దుష్ప్రభావాలపై అధ్యయనం నిర్వహించారు. క్యూబిక్ మీటర్ గాలిలో 7 నుంచి 20 మైక్రోగ్రాముల కాలుష్య కారకాలు ఉన్న ఢిల్లీ మరికొన్ని నగరాల్లో ఈ అధ్యయనం నిర్వహించారు. గాలి కాలుష్యం 2.5 పీఎం స్థాయిలో ఉన్న ప్రాంతాల్లోని సాధారణ ప్రజలు, గుండె జబ్బుతో బాధపడే వారి నుంచి రక్త నమూనాలను సేకరించి అధ్యయనం చేశారు. వాయు కాలుష్యం వల్ల గుండె జబ్బు బాధితుల రక్త నమూనాల్లో అనేక అనారోగ్యకారకమైన మార్పులు గుర్తించారు. గుండె జబ్బులు ఉన్నవాళ్ల రక్త నమూనాల్లో ఇన్‌ఫ్లమేటరీ బయోమేకర్స్ (%జజూ27, ×ూ%-18) చాలా ఎక్కువగా ఉన్నాయని తేలింది. గుండె జబ్బులు లేనివాళ్లలో ఏ మార్పూ కనిపించలేదు. హృద్రోగులు వాయు కాలుష్యం ఎక్కువగా ఉండే ప్రదేశాలకు దూరంగా ఉండాల్సిన అవసరం ఉందని ఈ అధ్యయనం చెబుతున్నది. ఎంత జాగ్రత్తగా ఉంటే గుండెకు అంత మంచిది.

# కాళన్న స్ఫూర్తి ఎక్కడ?



'పాలనాధికారం దుర్వినియోగం చేసే/ గుండాలకు నేను ద్రోహినే/ అన్యాయాన్నెదిరించడం/ నా జన్మహక్కు నా విధి' అన్న కాళోజీని గుర్తుచేసుకోవాల్సిన సందర్భం ఇది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వారసత్వాన్ని చాటే నిర్మాణాలు చేపట్టారు. జిల్లాలకూ, ప్రాజెక్టులకు ఇంకా మరెన్నింటికో తెలంగాణ కీర్తి పతాకలు, స్ఫూర్తి ప్రతీకలుగా నిలిచిన మహానుభావుల పేర్లు పెట్టారు. కుమ్రంభీం, జయశంకర్‌సార్, కాళోజీ వంటి తెలంగాణ పోరాట పటిమకు, తెగువకు మారుపేరైన మహోన్నతుల పేర్లను నిత్య స్మరణీయాలుగా మార్చి నిజమైన నివాళి ఘటించారు. ఆ కోవలో రూపుదిద్దుకున్నదే వరంగల్‌లోని కాళో జీ కళాక్షేత్రం. ఏకశిలా నగరానికి సిగలో పువ్వులా సువిశాలమైన ప్రాంగణంలో మహా సభావేదిక నిర్మాణానికి కేసీఆర్ ప్రణాళికలు వేశారు. ఆ ప్రాంగణంలోనే కాళన్న నిలువెత్తు విగ్రహం చేయించారు. ప్రారంభోత్సవమే తరువాయి అన్న తరుణంలో సర్కారు మారింది. దాదాపుగా పూర్తయిన భవనానికి రంగులు, సున్నాలు వేసి అట్టహాసాలు చేస్తున్నది రేవంత్ ప్రభుత్వం. ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండానే ఇదివరక టి సర్కార్ పూర్తిచేసిన రిక్రూట్‌మెంట్‌తో నియామక పత్రాల పంపిణీ పేరిట హంగామా చేసి పేరు కొట్టేయాలని చూసినవాళ్ల నుంచి ఇంతకంటే ఏం ఆశించగలం? ఇంతకూ కాళోజీ పేరుతో ప్రచారం పొందాలని చూస్తున్న కాంగ్రెస్ పాలకుల్లో ఆయన స్ఫూర్తి కించిత్తు అయినా ఉన్నదా అనేది అసలు ప్రశ్న. ఏడాది కావస్తున్నా ఒక్కటంటే ఒక్కటి ప్రజానుకూల నిర్ణయం తీసుకున్నారా? ఒక్క మంచిపనికి శ్రీకారం చుట్టారా? అంతదాకా ఎందుకు, ఏ అస్తిత్వం కోసం కాళోజీ లాంటి మహానుభావులు కొట్లాడారో దానినైనా కాపాడుతున్నారా? తెలంగా ణ పొడే గిట్టని పరాయి పాలకుల ముందు మోకరిల్లుతున్నారు. నీటి హక్కులను కాటగలుపుతున్నారు. ఇదంతా చాలదన్నట్టుగా ఆనవాళ్లు చెరిపేస్తామని ఎగిరెగిరి పడుతున్నారు. కాళోజీ కళాక్షేత్రం కేసీఆర్ ఆనవాళ్లలో ఒకటి కాదా? ఆ మాటకు వస్తే తెలంగాణే కేసీఆర్ అతిపెద్ద ఆనవాలుగా చరిత్రలో నిలిచిపోయింది. చెరిపేస్తే చెరిగిపోవడానికి అది నీటిమీది రాతకాదు, సువర్ణాక్షరం. ఈర్ష్యాద్వేషాలతో రగిలిపోయే చేతగాని, అనుభవం లేని పాలకు లు రాష్ట్రాన్ని ఆగమాగం చేస్తున్నరు. ప్రజాపాలన అంటూ ప్రజాకంట క పాలన తెచ్చారు. ప్రశ్నిస్తే కేసులు అరెస్టులంటూ వేధిస్తూ పోలీసు రాజ్యం చెలాయిస్తున్నారు. కాళోజీ బ్రతికి ఉంటే ఇవన్నీ సహించేవా రా? 'దోపిడీ చేసే ప్రాంతేతరులను దూరం దాకా తన్ని తరుముతం.. ప్రాంతం వాడే దోపిడీ చేస్తే ప్రాణంతోనే పాతర పెడతం' అని గర్జించాడు కదా. అంతేకాదు, తన పేరిట నిర్మించిన ప్రాంగణంలోనే పోలీ సు జులుం ప్రదర్శిస్తే ఊరుకునేవారా? 'హింస పాపమని యెంచు దేశమున హిట్లరత్వమింకెన్నాళ్లు?' అని ప్రశ్నించిన కాళోజీ నేడు రాష్ట్రాన్నే జైలుగా మార్చి ఎమర్జెన్సీ తరహా పాలన తెస్తే పోనీలే అని సరిపెట్టుకునేవారా? 'మరిచిపోకుండగ గురుతుంచుకోవాలె.. కాలంబు రాగానె కాటేసి తీరాలె' అని కాళన్న చెప్పింది ఈ తరహా పాలకుల గురించే అన్నది గుర్తుంచుకోవాలి.

# నిజం చెప్పకుంటే అబద్ధమే రాజ్యమేలుతుంది



పోరాటాల గడ్డ మన వరంగల్ ఖిల్లా. తెలంగాణ ఉద్యమ నాదాన్ని శిరస్సుపై మోసి భారతదేశానికి ప్రత్యేక రాష్ట్ర వాంఛను పరిచయం చేసింది మన వరంగల్ జిల్లానే. కాకతీయ రాజులు, సమ్మక్క-సారక్కలు అందించిన వారసత్వంతో%ూ% దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, కాళోజీ నారాయణరావు, ప్రొఫెసర్ జయశంకర్ సార్ పౌరుషత్వంతో పిడికిలి బిగించి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకురావడంలో ప్రధాన భూమిక పోషించిన వరంగల్ జిల్లా ప్రజానీకానికి నా ప్రత్యేక కృతజ్ఞతలు. నిన్న వరంగల్ జిల్లాకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మెప్పు పొందేందుకు గాను వాస్తవాలను అవాస్తవాలుగా చిత్రీకరించిన వరంగల్ ఎంపీ కడియం కావ్య వ్యాఖ్యలకు మనందరం సమాధానం చెప్పకపోతే అన్యాయమే రాజ్యమేలుతుంది. నిజాలను, అబద్ధాలుగా మలచాలని చూసినా, అబద్ధాలను నిజాలుగా చేయాలనే ప్రయత్నం చేసినా చరిత్ర ఒప్పుకోదు గాక ఒప్పుకోదు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ వైద్య రంగానికి సరితూగేలా వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మెడికల్ కాలేజీలు నిర్మించడమే కాకుండా వరంగల్ నడిబొడ్డున కార్పొరేట్‌ను తలదన్నేలా 24 అంతస్థులతో బహుళ ప్రజా దవాఖాన నిర్మాణం చేపట్టిన ఘనత బీఆర్ఎస్‌ది. శతాబ్ద కాలంలో జరగని అభివృద్ధిని, బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్ద కాలంలోనే చేసి చూపెట్టి మాది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వం అని నిరూపించింది. మీ తండ్రి అయిన కడియం శ్రీహరి నాటి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా చేసిన వ్యాఖ్యలను ఒకసారి గుర్తుచేసుకో. ప్రజాకవి కాళోజీ నారాయణరావు ధిక్కార స్వర నినాదంతోటే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని చెప్పడం లో ఎలాంటి సందేహం లేదు. ప్రజల ఐక్యతతో అందిపుచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం మరింత ప్రజ్వరిల్లాలని మన వరంగల్ ప్రత్యేక భూమిక పోషించింది. అందులో భాగంగానే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రణాళికలతో త్రినగరాన్ని సుందరీకరించుకున్నాం. ఎన్నో అంతర్జాతీయ పరిశ్రమలను వరంగల్ జిల్లాకు తీసుకువచ్చి, వరంగల్ ఖ్యాతిని ఖండాంతరాలకు పరిచయం చేసిన నేత కేసీఆర్. కానీ, కొందరు మిడిమిడి జ్ఞానంతో వాస్తవాలను, అవాస్తవాలుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. కానీ, చరిత్ర చెరిగిపోదు కదా? కాకతీయ రాజుల చరిత్రను తిరగరాసేలా.. ముందు తరాలకు భవిష్యత్తు రహదారిని పరిచేందుకు గాను కేసీఆర్ 'మిషన్ కాకతీయ' పేరుతో ప్రతి నీటి బిందువును ఒడిసిపట్టి రేగుముళ్లతో ఉన్న పొలాలను పచ్చని మాగాణిగా మలిచారు. నాడు ఇందిరాగాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాకవి కాళోజీ నారాయణరావు ను అణచివేయాలని, రాజకీయంగా ఎదగనీయకుండా చేయాలని శతవిధాలుగా ప్రయత్నించిన విషయం తెలిసిందే. అయితే ఆ పార్టీ నేడు నీతులు మాట్లాడుతుండటం నీచమైన రాజకీయ చర్యగా భావిస్తున్నా. కాళోజీ నామస్మరణ చేసే హక్కు కాంగ్రెస్ పార్టీకి ఏ మాత్రం లేదు. నాడు వ్యతిరేకించిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు భజనలు చేయడం చూస్తుంటే 'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు' అన్నట్టుగా ఉన్నది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం కాళో జీ నారాయణరావుకు ప్రత్యేక గుర్తింపు ఉండాలని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వ నేతృత్వంలోని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగ ల్ జిల్లా ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఆ సమావేశంలో కాళోజీ కళాక్షేత్ర నిర్మాణానికి పూనుకోవాలని తీర్మానం చేశారు. అనుకున్నదే తడవుగా ప్రత్యేక జీవో ద్వారా నిధులను విడుదల చేసి నిర్మాణ పనుల ను వేగవంతం చేశారు. ఈ క్రమంలో కరోనా మహమ్మారి కారణంగా నిర్మాణ పనులు కొం చెం ఆలస్యమయ్యాయి. కానీ, కాంగ్రెస్ ప్రభు త్వం ఇప్పుడు చంకలు గుద్దుతూ మేమేదో చేశామన్నట్టు ఊకదంపుడు రాతలతో నిజాలను అబద్ధాలుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నది. చెరిపేస్తే చరిత్ర చెరిగిపోతుందా? నిజానిజాలేమిటో ప్రజలకూ తెలుసు. రాష్ట్రవ్యాప్తంగా చూసుకున్నట్టయితే వెలుగులు విరజిమ్మేలా.. కండ్లు మైమరిచేలా దశాబ్ద కాలంలో జరిగిన అభివృద్ధే తప్ప.. రాష్ట్రంలో గత ఏడాది కాలం గా జరిగిన అభివృద్ధి శూన్యం అనేది నూటికి నూరుపాళ్లు నిజం. నాటి ప్రభుత్వ ప్రగతి చక్రాలతో వరంగల్ జిల్లా వ్యాప్తంగా విద్య, వైద్యం, పర్యాటకం, సాంస్కృతిక, ఉపాధి అన్నిరంగా ల్లో కేసీఆర్ తనదైన ప్రత్యేక చొరవను చూపించారు. ఒక్క వరంగల్ జిల్లానే కాదు, రాష్ట్రం మొత్తం అభివృద్ధి పథంలో దూసుకుపోయిం ది. కానీ, నేడు రాష్ట్రంలో చీకట్లు అలుముకున్నాయి. దశాబ్ద కాలపు అభివృద్ధిపై కారుమబ్బులు కమ్ముకున్నాయి. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చా క పచ్చగా ఉన్న ప్రాంతం ఒక్కసారిగా తీరు మారింది. ఇది నేనొక్కదాన్నే చెప్తున్న వాస్తవం కాదు, రాష్ట్ర పరిస్థితిని చూసిన ప్రజలందరూ ముక్తకంఠంతో ఘోషిస్తున్నది. రాష్ట్రానికి రెండో రాజధానిగా వరంగల్ జిల్లాకు ప్రాణం పోసిందే బీఆర్ఎస్ ప్రభుత్వం. హైదరాబాద్ అభివృద్ధికి ఏ మాత్రం తీసిపోకుండా వరంగల్‌కు అంతే ప్రాధాన్యం కల్పించింది తెలంగాణ తొలి ప్రభుత్వం. అభివృద్ధికి చిరునామాగా మారుస్తూ జాతీయ కంపెనీ మెగా టెక్స్‌టైల్ పార్కును సైతం తీసుకువచ్చి యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా కల్పించిన ఘనత నాటి కేసీఆర్ ప్రభుత్వానిది. అభివృద్ధి పథాన దూసుకువెళ్తున్న తెలంగాణను అణగదొక్కాలని నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాడు ఆంధ్రా తొత్తులతో కలిసి కుట్రలు చేసిన విషయం తెలంగాణలోని ప్రతీ పౌరునికి తెలుసు. ఆ కుట్రలను ఛేదించి శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రత్యేక ఖ్యాతిని గడించి యావత్ ప్రపంచాన్ని మనవైపు తిప్పుకునేలా చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిది. నిరంత రం అభివృద్ధి మంత్రంతో, సంక్షేమ పథకాల తో, ప్రజారంజకమైన పరిపాలనను అంది స్తూ.. సబ్బండ వర్గాలను గుండెకు హత్తుకున్న చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిది. ఈ ప్రాంత బిడ్డ పీవీ నరసింహారావు దేశ ప్రధానిగా ఎన్నో సంస్కరణలతో దేశానికి వన్నె తెస్తే, ఢిల్లీలో తన చితికి కట్టెపుల్ల కూడా ఇవ్వని కాంగ్రెస్ పార్టీ పీవీ గురించి మాట్లాడటం మరీ విడ్డూరం. జాతీయ రహదారులకు, తెలంగాణ రాష్ట్ర అంతర్గత రోడ్లను అనుసంధానం చేస్తూ అభివృద్ధి చేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీది. నిజాలను, అబద్ధాలుగా మలచాలని చూసినా, అబద్ధాలను నిజాలుగా చేయాలనే ప్రయత్నం చేసినా చరిత్ర ఒప్పుకోదు గాక ఒప్పుకోదు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ వైద్య రంగానికి సరితూగేలా వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తం గా మెడికల్ కాలేజీలు నిర్మించడమే కాకుండా వరంగల్ నడిబొడ్డున కార్పొరేట్‌ను తలదన్నే లా 24 అంతస్థులతో బహుళ ప్రజా దవాఖాన నిర్మాణం చేపట్టిన ఘనత బీఆర్ఎస్‌ది. శతాబ్ద కాలంలో జరగని అభివృద్ధిని, బీఆర్ఎస్ ప్రభు త్వం దశాబ్ద కాలంలోనే చేసి చూపెట్టి మాది మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రభుత్వం అని నిరూపించింది. మీ తండ్రి అయిన కడియం శ్రీహరి నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా చేసిన వ్యాఖ్యలను ఒకసారి గుర్తుచేసుకో. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని దోచుకొని అధిష్ఠానానికి చేరవేయడమే తప్ప అంతకుమించిందేమీ ఉండదు. తెలంగాణ రాష్ట్రం నలువైపులా మరింత అభివృద్ధి సాధించాలంటే అదొక్క బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని తెలుసుకో. మణిపూర్ లాంటి ఘటనలు రాష్ట్రంలో ఎన్నో చూస్తున్నాం. అయినా కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు కలగడం లేదు. ఢిల్లీకి డబ్బు ల మూటలు అప్పజెప్పడంతోనే ఆ పార్టీకి సరిపోతున్నది. అధికార జులుంతో, పోలీసు బలగాలతో గిరిజన తండాలపై దాడులు చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది. గిరిజనులు తమ భూములను అప్పనంగా అప్పజెప్పాలని రైతులకు సంకెళ్లతో బేడీ లు వేసి, అమాయకులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన రాక్షస ప్రభుత్వం ఇది. ప్రజాపాలన, ఇందిరమ్మ రాజ్యం అంటూ పోలీసు బలగాలతో చేస్తు న్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వంగా కాంగ్రెస్ చరిత్రలో మిగిలిపోవడం ఖాయం.

# ఏకీకరణతో లక్ష్యం నెరవేరేనా?





దేశంలోని 43 గ్రామీణ బ్యాంకులను 28కి కుదించేందుకు గాను కేంద్రం నిర్ణయం తీసుకున్నది. ఈ నెల 4న గ్రామీణ బ్యాంక్ చైర్మన్లకు, వాటి స్పాన్సర్ బ్యాంక్‌ల ఎండీలకు ఈ విషయాన్ని లేఖ ద్వారా తెలియజేసింది. ఒక రాష్ట్రానికి ఒకే గ్రామీణ బ్యాంక్ అనేది ఈ విలీనానికి ప్రధాన ప్రాతిపదిక. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా ఈ ప్రక్రియ పూర్తికావచ్చు. ఇదే జరిగితే తెలంగాణ రాష్ట్రం మొత్తానికి ఒకే గ్రామీణ బ్యాంక్ ఏర్పడుతుంది. దాని పేరు 'తెలంగాణ రాష్ట్ర గ్రామీణ బ్యాంక్' అని ఉంటుంది. దేశవ్యాప్తంగా రాష్ట్రం పేరుతో గ్రామీణ బ్యాంక్‌ల పేర్లు మారిపోయాయి. ప్రస్తుతం తెలంగాణలో రెండు గ్రామీణ బ్యాంక్‌లు పనిచేస్తున్నాయి. 18 జిల్లాల్లో తెలంగాణ గ్రామీణ బ్యాంక్, మిగతా 15 జిల్లాలకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ సేవలందిస్తున్నాయి. ఈ రెండింటికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పాన్సర్ బ్యాంక్‌గా వ్యవహరిస్తున్నది. వాణిజ్య బ్యాంకుల జాతీయీకరణ తర్వా త కూడా అవి గ్రామాల్లో తమ శాఖల ను తెరవడానికి ముందుకురాలేదు. స్థాయికి తగ్గ వ్యాపారం లభించక ఇప్పటికే తమ గ్రామీణ శాఖలు నష్టాల్లో ఉన్నాయని కేంద్రానికి అవి మొర పెట్టుకున్నాయి. చివరికి ఆనాటి ఇందిరా గాంధీ ప్రభుత్వం ఆర్బీఐ మాజీ గవర్నర్ నరసింహన్ ఆధ్వర్యంలో ఒక కమిటీ వేసింది. ఆ కమిటీ సూచనల ప్రకారం తక్కువ ఖర్చుతో 'వాణిజ్య బ్యాంకు విధానాలు, గ్రామీణ ప్రజల అవసరాలు' కలిసే రీతిలో గ్రామీణ బ్యాంక్‌ల రూపకల్పన జరిగింది. గ్రామీణ బ్యాంక్ మూలధనంలో 50 శాతం కేంద్ర ప్రభుత్వం, 35 శాతం స్పాన్సర్ బ్యాంక్, 15 శాతం రాష్ట్ర ప్రభుత్వం వాటాలుంటాయి. అలా బాధ్యతలు, లాభనష్టాలు మోసేందుకు మూడింటి భాగస్వామ్యం అవసరమైంది. 1975లో ప్రథమ గ్రామీణ బ్యాంక్ యూపీలోని మొరాదాబాద్‌లో ఏర్పడింది. 1976లో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల చట్టం వచ్చింది. అలా పదేండ్ల కాలంలో దేశవ్యాప్తంగా 196 గ్రామీణ బ్యాంక్‌లు విస్తరించాయి. బ్యాంక్‌ల వ్యాపార లక్ష్యం ఆర్థిక లాభం కాగా, గ్రామీణ బ్యాంక్‌ల లక్ష్యం మాత్రం సామాజిక లాభంగా ప్రభుత్వం గుర్తించిం ది. వాటి నష్టాలను నష్టాలుగా భావించలేదు. రైతులకు, గ్రామీణులకు అవి అందిస్తున్న ఆర్థిక సేవలనే లాభాలుగా పరిగణించింది. అయితే, 1991లో దేశంలో ఆర్థిక సంస్కరణల రాకతో ప్రభుత్వరంగ సంస్థలపై కేంద్ర దృక్కోణం మారిపోయింది. నష్టా ల్లో ఉన్నవి కూడా లాభాల బాట పట్టక తప్పదు. అప్పటికే గ్రామీణ భారతంలో ప్రధాన పరపతి సంస్థగా వేళ్లూనుకున్న గ్రామీణ బ్యాంక్‌ల నిర్వహణ ఖర్చులను తగ్గించాలనుకున్నది. అలా 2004-05లో మొదలైన వీటి సంఖ్య తగ్గింపు ప్రక్రియ దశలవారీగా సాగి 2020-21 నాటికి 196 నుంచి 43కు చేరింది. ఒక రాష్ట్రంలో ఒక స్పాన్సర్ బ్యాంక్‌కు ఒకే గ్రామీణ బ్యాంకు ఉండాలనే నిబంధనతో ఉమ్మడి ఏపీలో ఉన్న 16 గ్రామీణ బ్యాంకులు 6గా మారాయి. తెలంగాణ విషయానికి వస్తే స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ అధీనంలో కరీంనగర్ జిల్లాకు చెందిన శాతవాహన గ్రామీణ బ్యాంక్, నిజామాబాద్ జిల్లాలోని శ్రీరామ గ్రామీణ బ్యాంక్, ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని శ్రీ సరస్వతి గ్రామీణ బ్యాంక్, రంగారెడ్డి జిల్లా గోల్కొండ గ్రామీణ బ్యాంక్ ఉండేవి. విలీన ప్రక్రియలో భాగంగా మార్చి 2006లో ఈ 4 గ్రామీ ణ బ్యాంక్‌లు కలిసి దక్కన్ గ్రామీణ బ్యాంకు ఏర్పడింది. ఆ తర్వాత హైదరాబాద్ జిల్లాను కూడా ఇం దులో కలిపారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక 2014, అక్టోబర్‌లో బ్యాంక్ పేరును తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌గా మార్చారు. తెలంగాణలోని మిగతా ఐదు జిల్లాల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మూడు గ్రామీణ బ్యాంక్‌లున్నాయి. వాటితోపాటు ఏపీలోని శ్రీ విశాఖ గ్రామీణ బ్యాంకు కలిసి ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్‌గా ఏర్పడింది. 2016లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ విలీనం కావడంతో తెలంగాణలోని రెండు గ్రామీణ బ్యాంక్‌ల స్పాన్సర్ బ్యాంక్ ఒక్కటైంది. స్పాన్సర్ బ్యాంక్ పరంగా గ్రామీ ణ బ్యాంక్‌లు కలిపివేస్తున్నందున టీజీబీ, ఏపీజీవీబీలు రెండు కలిసిపోవాలి. కొత్తగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఒకే గ్రామీణ బ్యాంక్ ప్రతిపాదన తెచ్చినందున తెలంగాణలోని నల్గొండ, మహబూబ్‌నగర్, వరంగల్, మెదక్, ఖమ్మం, ఉమ్మడి జిల్లాల్లో ఉన్న ఏపీజీవీబీ శాఖలను టీజీబీలో కలపాలి. అలా కొత్తగా 'తెలంగాణ రాష్ట్ర గ్రామీణ బ్యాంక్' పురుడు పోసుకుంటుంది. ఈ ఏడాది మొదట్లోనే రాష్ట్రానికి ఒక గ్రామీణ బ్యాంక్ అనే ప్రతిపాదనను ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తెరపైకి తెచ్చినా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏపీజీవీబీ ఉండటంతో చర్చ ముందుకు సాగలేదు. ఏపీజీవీబీ శాఖలు రెండు రాష్ట్రాల్లో ఉన్నందున ఆ వాటా లెక్కలను రెండు రాష్ట్రాలు కలిసి తేల్చుకోవాలి. నిజానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే రాష్ట్రానికి చెందిన 15 శాతం వాటా పరిస్థితి తెలుసుకొని ఉండాలి. కానీ, అలా జరగలేదు. రాబోయే రోజుల్లో రాష్ట్రానికి ఒకే గ్రామీణ బ్యాంక్ కాబట్టి హన్మకొండలో ఉన్న ఏపీజీవీబీ ప్రధాన కార్యాలయం తరలిపోతున్నది. పైగా ఏపీలోని గ్రామీణ బ్యాంక్‌లకు కెనరా బ్యాంక్ స్పాన్సర్ కానున్నది. ఏపీజీవీబీ వాటాను తెలంగాణలో ఎస్‌బీఐ, ఆంధ్రలో కెనరా బ్యాంకు పంపకాలు చేసుకోవాలి. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టవలసిన అవసరం ఉన్నది.

# సింగరేణి రికార్డు లాభాలు



సింగరేణి సంస్థ లాభాల్లో దూసుకెళుతున్నది. అద్భుతమైన ప్రదర్శనను కనబరుస్తూ ఈ ఏడాది మొదటి అర్ధభాగంలోనే అధనంగా వెయ్యికోట్లకు పైగా లాభాలు గడించినట్టు సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరాం తెలిపారు. ఏప్రిల్ నుంచి అక్టోబర్ మధ్యకాలానికిగాను పన్ను చెల్లింపులకు ముందు రూ. 4 వేల కోట్ల స్థూల లాభాన్ని ఆర్జించినట్టు పేర్కొన్నారు. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.2,932 కోట్లతో పోలిస్తే 36 శాతం అధికమని చెప్పారు. అలాగే గడిచిన ఆరు నెలల్లో బొగ్గు అమ్మకాల ద్వారా రూ.17,152 కోట్లు, విద్యుత్తు విక్రయాల ద్వారా రూ.2,286 కోట్ల ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

## నిన్నటి వరకు ఆ కంపెనీలో నెల జీతగాళ్లు- నేటి నుంచి కోటీశ్వరులు- ఎలా అంటే?




దలాల్ స్ట్రీట్?లో స్విగ్గీ గ్రాండ్ ఎంట్రీ – ఏకంగా 500 మందిని కోటీశ్వరులను చేసిన ప్రముఖ ఫుడ్ డెలివరీ, క్విక్ కామర్స్ సంస్థ స్విగ్గీ దలాల్ స్ట్రీట్?లో గ్రాండ్?గా ఎంట్రీ ఇచ్చింది. అంతేకాదు దాదాపు 500 మంది స్విగ్గీ ఉద్యోగులను ఏకంగా కోటీశ్వరులను చేసింది. ఇలా కరోడ్ పతి అయిన వారిలో ప్రస్తుతం స్విగ్గీలో పనిచేస్తున్న ఉద్యోగులతోపాటు, మాజీలు కూడా ఉన్నారు. స్విగ్గీ తమ ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా 'ఎంప్లాయిస్? స్టాక్ ఆప్షన్ ప్లాన్?' తీసుకువచ్చింది. దీని మొత్తం విలువ రూ.9,000 కోట్లుగా ఉంది. దీనిలో స్విగ్గీలో పనిచేస్తున్న దాదాపు 5000 మంది సిబ్బందికి వాటాలు ఉన్నాయి. స్విగ్గీ ఐపీఓ ఇష్యూ ధర రూ.371 – రూ.390గా ఉంది. కానీ బుధవారం ఎన్?ఎస్?ఈలో స్విగ్గీ షేర్లు ఇష్యూ ధర రూ.390 కంటే, దాదాపు 8 శాతం ప్రీమియంతో లిస్ట్ అయ్యాయి. అంటే సిగ్గీ షేర్లు మార్కెట్లో రూ.420 వద్ద లిస్ట్ అయ్యాయి. అలాగే బీఎస్?ఈలో స్విగ్గీ ఇష్యూ ధర కంటే 5.64 శాతం ఎగబాకి రూ.412 వద్ద లిస్ట్ అయ్యింది. తరువాత ఆ లాభం 7.67 శాతం పెరిగి రూ.419.95కు చేరింది. దీనితో తమ ఉద్యోగుల షేర్లు విలువ అమాంతం పెరిగింది. దీనితో దాదాపు 500 మంది ఉద్యోగుల దగ్గర ఉన్న షేర్ల విలువ రూ.2 కోట్ల వరకు పెరిగింది. అంతేకాదు ఈ బంపర్ లిస్టింగ్? ద్వారా 5000 మంది స్విగ్గీ ఉద్యోగుల వద్ద షేర్ల విలువ ఏకంగా రూ.9,000 కోట్లకు పెరిగింది.

**ఐపీఓ డీటైల్స్ ఇవే!**

స్విగ్గీ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ నవంబర్ 8న ముగిసింది. షేర్ ధరల శ్రేణిని రూ.371–390గా కంపెనీ నిర్ణయించింది. ఇందులో తాజా షేర్ల జారీ ద్వారా రూ.4,499 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.6,828 కోట్లు సమీకరించింది. వాస్తవానికి రూ.11,327 కోట్ల విలువైన ఈ ఐపీఓ మొత్తం 3.599 రెట్ల వరకు సబ్‌స్క్రిప్షన్ పొందింది. 16 కోట్ల షేర్లకు గానూ 57.53 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్ల కోటా 6.02 రెట్లు సబ్‌స్క్రైబ్ అవ్వగా, రిటైల్ ఇన్వెస్టర్లు 1.14 రెట్ల వరకు సబ్‌స్క్రైబ్? చేశారు. ఇక నాన్ ఇన్‌స్టిట్యూషనల్ కోటా 41 శాతం మాత్రమే సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. కాగా స్విగ్గీ ఇప్పటికే రూ.5,085 కోట్లను యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి సమీకరించింది. స్విగ్గీ ఈ ఇష్యూ ద్వారా వచ్చిన ఆదాయాన్ని టెక్నాలజీ, క్లౌడ్? ఇన్?ఫ్రాస్ట్రక్చర్?లో పెట్టుబడులకు, బ్రాండ్ మార్కెటింగ్?, బిజినెస్ ప్రమోషన్ సహా రుణ చెల్లింపులకు ఉపయోగించనుంది.

## హెూండా థర్డ్ జనరేషన్ అమేజ్?లో అదిరిపోయే ఫీచర్స్! తెలిస్తే షాకవ్వాల్సిందే! లాంఛ్ ఎప్పుడంటే?




భారత్ మార్కెట్లోకి హెూండా అమేజ్? థర్డ్ జనరేషన్! ఫీచర్స్, స్పెసిఫికేషన్స్ ఇవే! ప్రముఖ కార్ల తయారీ సంస్థ హెూండా భారత్ మార్కెట్లోకి థర్డ్ జనరేషన్ అమేజ్ కారును లాంఛ్? చేసేందుకు ఇప్పటికే ముహూర్తం ఖరారు చేసింది. థాయిలాండ్?లోని హెూండా ఆర్ అండ్ డీ ఆసియా పసిఫిక్ సెంటర్‌లో డిజైన్ చేసిన 2024 అమేజ్ కారును డిసెంబర్ 4న మార్కెట్?లోకి విడుదల చేయనుంది. అయితే కొత్త జెనరేషన్? కారులో హెూండా పలుమార్పులు చేసినట్లు, ముఖ్యంగా అధునాతన ఫీచర్స్?ను పొందుపరిచినట్లు సమాచారం. అవేంటంటే? థర్డ్ జనరేషన్ హెూండా అమేజ్ మోడల్?లో ఎల్ఈడీ హెడ్ లైట్లతోపాటు రీ డిజైన్డ్ గ్రిల్?, జడ్–షేప్డ్ ఎల్ఈడీ టెయిల్ లైట్స్, న్యూ అల్లాయ్ వీల్స్, రీ డిజైన్డ్ డాష్ బోర్డ్, స్లీక్ ఎయిర్ వెంట్స్, న్యూ ఫ్రీ స్టాండింగ్ టచ్ స్క్రీన్? ఇన్ఫోటైన్?మెంట్ సిస్టమ్, ఆటోమేటిక్ క్లైమేట్ కంట్రోల్, వైర్ లెస్ ఛార్జర్, క్రూయిజ్ కంట్రోల్?తోపాటు సేఫ్టీ కోసం సిక్స్ ఎయిర్ బ్యాగ్స్ ఉంటాయని తెలుస్తోంది. హెూండా అమేజ్ కారు 1.2 లీటర్ల 4 సిలిండర్ ఎస్ఓహెచ్?సీ ఐ-వీటెక్ పెట్రోల్ ఇంజిన్ (90 పీఎస్ పవర్?, 110 ఎన్ఎం టార్క్)తో అందుబాటులోకి రాబోతుందని సమాచారం. ఈ కారులో 360–డిగ్రీ సరౌండ్ వ్యూ కెమెరా? ఉంటుందని తెలుస్తోంది. కారు క్యాబిన్ నలుపు, లేత గోధుమరంగు రంగులో, సీట్స్? ఇంటీరియర్ థీమ్‌కు అనుగుణంగా ఉంటాయని సమాచారం. పాత మోడల్ హెూండా అమేజ్ కారు ధర రూ.7.19 లక్షల (ఎక్స్–షోరూమ్) నుంచి రూ.9.95 లక్షల (ఎక్స్ షోరూమ్) వరకు ఉంది. న్యూ హెూండా అమేజ్ ధర బహుశా రూ.7.25 లక్షల (ఎక్స్ షోరూమ్) నుంచి రూ.10.10 లక్షల (ఎక్స్ షోరూమ్) వరకు పలుకుతుందని అంచనా. హెూండా తన ఫస్ట్ జనరేషన్ అమేజ్ కారును 2013లో, సెకండ్ జనరేషన్?ను 2018లో మార్కెట్లోకి తీసుకొచ్చింది. ఇప్పుడు తీసుకొస్తున్న థర్డ్ జనరేషన్? అమేజ్? మోడల్? – మారుతి సుజుకి న్యూ డిజైర్, హ్యుందాయ్ ఆరా, టాటా టిగోర్ మోడల్ కార్లతో కచ్చితంగా పోటీ పడే అవకాశం ఉంది.

## కాస్త ఊరట! ఉల్లి ధరల మంటకు కేంద్రం బ్రేకులు!



మండుతున్న ఉల్లి ధరలు – తగ్గిన టమాటా రేట్లు – స్థిరంగా బంగాళాదుంప ధరలు దేశంలో ఉల్లి ధరలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో, రేట్లను స్థిరీకరించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టింది. బఫర్ స్టాక్స్? నుంచి రిటైల్ మార్కెట్లోకి ఉల్లిని వీలైనంత ఎక్కువగా సరఫరా చేయాలని నిర్ణయించినట్లు మంగళవారం తెలిపింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, దేశ రాజధాని నగరం దిల్లో ఉల్లిపాయల రిటైల్ ధర కిలో రూ.67 ఉండగా, అఖిల భారత సగటు రిటైల్ ధర కిలోకు రూ.58గా ఉంది. పండుగ సీజన్? కావడం, మండీలు మూసివేసి ఉండడం వల్ల గత 2,3 రోజులుగా మార్కెట్లోకి ఉల్లి సరఫరా బాగా తగ్గింది. దీనితో డిమాండ్ పెరిగి ఉల్లి ధరలు కూడా బాగా పెరిగాయి. అందుకే సామాన్య వినియోగదారులపై ఎలాంటి ప్రభావం పడకుండా చూసేందుకు ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఈ ఉల్లి ధరలను స్థిరీకరించడానికి, బఫర్? స్టాక్స్? నుంచి రిటైల్ మార్కెట్లోకి ఉల్లి నిల్వలను భారీ మొత్తంలో సరఫరా చేయనున్నట్లు పేర్కొంది. రైలు, రోడ్డు రవాణా మార్గాల ద్వారా ఎన్?సీసీఎఫ్? ఈ ఉల్లి నిల్వలను దేశం నలుమూలలకు సరఫరా చేయనుంది. ఇక పంజాబ్?, హరియాణా, చండీగఢ్?, హిమాచల్?, జమ్మూకశ్మీర్?, దిల్లీ మొదలైన ప్రాంతాల అవసరాలను తీర్చడానికి సోనిపట్?లోని కోల్డ్ స్టోరేజ్ నుంచి ఉల్లిపాయలను సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**బఫర్ స్టాక్?**

ఈ ఏడాది రబీ సీజన్?లో ప్రభుత్వం 4.7 లక్షల టన్నుల ఉల్లిపాయలను సేకరించి బఫర్ స్టాక్?గా ఉంచింది. సెప్టెంబర్? 5 నుంచి కిలో రూ.35కు చొప్పున రిటైల్ విక్రయాల కోసం పంపిణీ చేస్తోంది. ఇప్పటి వరకు బఫర్?లో ఉన్న 1.50 లక్షల టన్నుల ఉల్లిపాయనలు నాసిక్? సహా ఇతర ప్రాంతాలకు ట్రక్కుల ద్వారా పంపించారు. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం, ఈ ఏడాది ఖరీఫ్? సీజన్.

# డొనాల్డ్ ట్రంప్ విజయం గోల్డ్ మార్కెట్ పతనం!

**గోల్డ్‌కు ట్రంప్ గుబులు**

**దేశీయ విపణిలో క్రమేణా క్షీణిస్తున్న ధరలు**

**గత 10 రోజుల్లో తులం రూ.5,350 తగ్గుదల**

**అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలుపుతో మార్కెట్ రివర్స్‌గేర్**



అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం.. గోల్డ్ మార్కెట్ పతనానికి దారితీస్తున్నది. ఈ నెల 4న ట్రంప్ గెలిచినట్టు అధికారికంగా వెల్లడైన విషయం తెలిసిందే. అయితే అప్పట్నుంచి ఇప్పటిదాకా దేశీయ విపణిలో 10 గ్రాముల 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) బంగారం ధర రూ.5,350 (6.5 శాతం) పడిపోవడం గమనార్హం. డాలర్ ఇండెక్స్ (డీఎక్స్‌వై) అంతకంతకూ బలపడుతుండటం.. బులియన్ మార్కెట్‌ను బేరిష్ ట్రెండ్‌లోకి నెడుతున్నది. ప్రస్తుతం తులం రూ.77వేల దరిదాపుల్లో ఉన్నది. గత నెలాఖరున మునుపెన్నడూ లేనివిధంగా రూ.82,400 పలికిన సంగతి విదితమే. హైదరాబాద్‌లో తులం 22 క్యారెట్ రేటు రూ.70వేలకు పడిపోయింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది చివరిదాకా డౌన్‌ట్రెండ్ కొనసాగవచ్చున్న అంచనాలే వినిపిస్తున్నాయి. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టాక, పాలసీ నిర్ణయాలు వచ్చేదాకా గోల్డ్ రేట్ కరెక్షన్ ఉంటుందంటున్నారు.

### ఎందుకింత ఒత్తిడి?

గత 10 రోజులుగా బంగారం ధరలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయి. బహిరంగ మార్కెట్‌తోపాటు కమోడిటీ ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లోనూ ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. గతంలో అమెరికా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ట్రంప్ విధానాలను గమనిస్తే.. ఆ దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు అనేక చర్యలు చేపట్టారు. అమెరికాకు చైనా నుంచి వచ్చే వస్తూత్పత్తులపై అధిక సుంకాలు విధించడం, వీసా విధానాన్ని కఠినతరం చేయడం వంటివి వీటిలో ఉన్నాయి. మళ్లీ జనవరి నుంచి ఆయనే అధ్యక్షుడిగా రానుండటంతో అమెరికా ఎకానమీపై ముఖ్యంగా ఆ దేశ కరెన్సీ డాలర్‌కు ఎక్కడలేని డిమాండ్‌ను తెచ్చిపెడుతున్నది. దీంతో పెట్టుబడులన్నీ స్టాక్స్, బాండ్ల మార్కెట్ వైపు వెళ్లిపోతున్నాయి. ఫలితంగా పసిడికి ఆదరణ తగ్గి ధరల క్షీణత చోటుచేసుకుంటున్నది.

### ప్రభావితాంశాలివే..బిట్‌కాయిన్

బిట్‌కాయిన్‌పట్ల మదుపరులు చూపిస్తున్న అమితాసక్తి కూడా గోల్డ్ మార్కెట్ క్రాష్‌కు దారితీస్తున్నది. ఈ వర్చువల్ కరెన్సీకి అమెరికా మద్దతు ఉండబోతుందన్న అంచనాలే ఇందుకు కారణం. ఈ క్రమంలోనే తరలివస్తున్న పెట్టుబడులతో మళ్లీ ఆల్‌టైమ్ హైల్లో కి బిట్‌కాయిన్ విలువ వెళ్లింది. ప్రస్తుతం విలువ 89వేల డాలర్లపైనే పలుకుతున్నది.

### ఈక్విటీ మార్కెట్లు

స్టాక్ మార్కెట్లలో నష్టాలను, ఒడిదొడుకులను తట్టుకొనేందుకు ఇన్వెస్టర్లు ఎంచుకొనే సురక్షిత పెట్టుబడి మార్గమే బంగారం. అయితే ప్రస్తుతం మారిన ట్రెండ్‌తో ఇన్నాళ్లూ పెట్టిన పెట్టుబడులను గోల్డ్ మార్కెట్ నుంచి మదుపరులు వెనక్కి తీసుకుంటున్నారు. రిస్క్ ఎక్కువగా ఉన్నా ఈక్విటీల్లోనే ఇన్వెస్ట్ చేసేందుకు సిద్ధమైపోతున్నారు. ఈటీఎఫ్‌ల నుంచి తరలిపోతున్న నిధులే ఇందుకు నిదర్శనం.

### ఉద్రిక్తతలు తగ్గుతాయని..

యూరప్‌తోపాటు పశ్చిమాసియా దేశాల్లో ఉద్రిక్తతలు తగ్గుముఖం పడుతాయన్న అంచనాలు కూడా పసిడి ధరల్ని కిందకు లాగుతున్నాయి. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నికైతే రాజకీయ, భౌగోళిక పరిస్థితుల్లో మార్పు ఉంటుందన్న విశ్వాసం మెజారిటీ మదుపరుల్లో కనిపిస్తున్నది.

### డాలర్ ఇండెక్స్...

ట్రంప్ గెలుపుతో ప్రపంచ కరెన్సీగా పేరున్న అమెరికా డాలర్లకు భారీగా డిమాండ్ వచ్చిపడింది. ఈ క్రమంలోనే డాలర్ ఇండెక్స్ పరుగులు పెడుతున్నది. దేశీయ మార్కెట్ నుంచి గతకొద్ది రోజులుగా తరలిపోతున్న విదేశీ పెట్టుబడులు సైతం అమెరికన్ మార్కెట్లలోకే చేరుతున్నాయి.

### గ్లోబల్ మార్కెట్‌లో..

అంతర్జాతీయ మార్కెట్‌లోనూ పసిడి ధరలు నేలచూపుల్నే చూస్తున్నాయి. ఔన్సు గోల్డ్ విలువ రికార్డు స్థాయిల నుంచి దిగజారింది. కొమెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లో 2,557.40 డాలర్లు పలికింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గిస్తుండటం కూడా పుత్తడి మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నది.

# మీ హెూమ్ రెనోవేషన్? కోసం లోన్? కావాలా? ఇలా చేస్తే చాలు - తక్కువ వడ్డీతో రుణం గ్యారెంటీ



మీ పాత ఇంటిని రినోవేషన్ చేయించాలా? ఇందుకోసం బ్యాంక్? లోన్ కావాలా? ఈ సింపుల్ టిప్స్ మీ కోసమే! చాలా మంది తమ పాత ఇంటిని సరికొత్తగా తీర్చిదిద్దుకోవాలని అనుకుంటారు. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో అది అంత ఈజీ వ్యవహారం కాదు. హెూమ్ రెనోవేషన్?కు చాలా పెద్దమొత్తంలో డబ్బులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం హెూం రినోవేషన్ లోన్‌ను తీసుకుంటే బెటర్. ఈ లోన్‌ను తీసుకునేటప్పుడు పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### ఇంటి విలువకు రెక్కలు

కొత్త ఇంటిని నిర్మించడానికి, పాత ఇంటికి రినోవేషన్ చేయించడానికి మధ్య చాలా తేడా ఉంది. కొత్త ఇల్లు కట్టడానికి ఎంత ఖర్చవుతుందో మనం ముందే అంచనా వేయొచ్చు. కానీ పాత ఇంటి పునరుద్ధరణ ఖర్చును ముందే అంచనా వేయలేం. పాత ఇంటి అసలు నిర్మాణం దెబ్బతినకుండా దాన్ని జాగ్రత్తగా పునరుద్ధరించాల్సి ఉంటుంది. రిస్క్ తీసుకొని మనం పాత ఇంటిని పునరుద్ధరిస్తే, కచ్చితంగా దాని మార్కెట్ విలువ పెరుగుతుంది. అందుకే హెూం రినోవేషన్ వల్ల ఆ ఇంటి యజమానులకు లాభమే తప్ప నష్టం కలగదు.

### మరమ్మతు ఖర్చులకు చెల్లు

ఇంటిని రినోవేషన్ చేయిస్తే యజమానికి ప్రతి సంవత్సరం చాలా మరమ్మతు ఖర్చులు మిగిలిపోతాయి. పాత ఇంటికి పదేపదే మరమ్మతులు చేయించాల్సి వస్తుంటే, తప్పకుండా హెూం రినోవేషన్‌కు మొగ్గుచూపడం బెటర్. రినోవేషన్ చేయించే క్రమంలో ఇంటిలో వాస్తుపరమైన మార్పులు చేసుకోవచ్చు. అదనంగా గదులు నిర్మించుకోవచ్చు. కొత్త అవసరాలకు అనుగుణంగా ఇంట్లో మార్పులు చేయొచ్చు. ఇవన్నీ కలిసి రినోవేషన్ తర్వాత ఇంటి విలువను పెంచుతాయి.

### వడ్డీరేటు, రీపేమెంట్

ఇంటి రినోవేషన్ లోన్‌ను బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి రుణం తీసుకోవచ్చు. సాధారణ హెూం లోన్ వడ్డీ రేట్లే ఈ లోన్‌కు కూడా వర్తిస్తాయి. ఫ్లోటింగ్ వడ్డీరేటు లేదా నిర్దిష్ట కాల స్థిర వడ్డీరేటుల్లో ఏదైనా ఒకదాన్ని మనం ఎంపిక చేసుకోవాలి. ఇంటి ప్రస్తుత మార్కెట్ ధరపై ప్రతిపాదిత సీలింగ్‌కు లోబడి రినోవేషన్ వ్యయ అంచనాలో 100 శాతం దాకా లోన్ చేస్తారు. క్రెడిట్ స్కోరు బాగా ఉన్నవారికి వడ్డీరేటు తక్కువగా ఉంటుంది. మెటీరియల్స్, లేబర్ ఖర్చులు, కాంట్రాక్టర్ ఫీజుల వంటి రినోవేషన్ ఖర్చుల కోసం ఈ ఫండ్స్‌ను వాడాలి. ఈ లోన్ రీపేమెంట్ రూల్స్ సరళతరంగానే ఉంటాయి. హెూం రినోవేషన్ లోన్‌కు వ్యక్తిగతంగా లేదా ఉమ్మడిగా కూడా దరఖాస్తు చేయొచ్చు. లోన్ కాలవ్యవధి 15 సంవత్సరాల వరకు ఉంటుంది. రుణం తీసుకునే సమయంలో మీ వయసు, ఇంటి వయసు, మీ ఆదాయం మొదలైన వాటి ఆధారంగా రుణ కాలవ్యవధిని నిర్ణయిస్తారు.

### ఆర్థిక పరిస్థితిపై అంచనాకు వచ్చాకే

మీ ఆర్థిక పరిస్థితి, అవసరాలకు సరిపోయేలా ఉండే హెూం రినోవేషన్ లోన్‌ను ఎంచుకోవాలి. ప్రతినెలా ఎంతమేర ఈఎంఐ చెల్లించగలరు? అనే దానిపై మీకు స్పష్టమైన అంచనా ఉండాలి. హెూం రినోవేషన్ కోసం వాడే మెటీరియల్స్, పనివాళ్ల ఖర్చులకు ఎంత డబ్బులు అవసరం అవుతాయనే దానిపైనా ముందస్తు ఎస్టిమేషన్‌ను రూపొందించుకోవాలి. స్థానిక సంస్థల అనుమతులు, అత్యవసర ఖర్చులు వంటి అన్ని ఖర్చులను కలుపుకొని లెక్కలు వేసుకోవాలి. ఇవన్నీ చూసుకున్న తర్వాతే హెూం రినోవేషన్ లోన్ కోసం బ్యాంకుకు వెళితే బెటర్. తొందరపాటులో లోన్ తీసుకొని తర్వాత కట్టలేకపోతే ఇబ్బందుల్లో పడతారు. ఈ లోన్‌కు సంబంధించిన వడ్డీ కాంపోనెంట్‌పై సెక్షన్ 24 కింద సంవత్సరానికి రూ.30 వేల వరకు పన్ను ప్రయోజనం లభిస్తుంది.

### పర్సనల్ లోన్

ఇంటి రినోవేషన్ కోసం మనం బ్యాంకు నుంచి పర్సనల్ లోన్ తీసుకోవచ్చు. మంచి క్రెడిట్ స్కోరు ఉన్నవారికి ఈ లోన్‌ను పూచీకత్తు లేకుండానే ఇస్తారు. కొన్ని బ్యాంకులు రూ.25 లక్షల దాకా పర్సనల్ లోన్ ఇస్తాయి. హెూం రినోవేషన్ లోన్‌తో పోలిస్తే పర్సనల్ లోన్‌లో వడ్డీ రేటు ఎక్కువ. లోన్ రీపేమెంట్ కాల వ్యవధి ఐదేళ్లలోపు ఉంటుంది. ఎక్కువ విలువగల షేర్లు/మ్యూచువల్ ఫండ్లు కలిగి ఉన్నవారు వాటిపైనా లోన్ తీసుకోవచ్చు.

### టాప్–అప్ లోన్

ఇప్పటికే హెూం లోన్ ఉన్నవారు ఇంటి రినోవేషన్‌ను చేయదలిస్తే టాప్–అప్ లోన్ కోసం అప్లై చేయొచ్చు. టాప్–అప్ లోన్‌లో భాగంగా మీ ప్రస్తుత హెూం లోన్ అమౌంటుకు మించి అదనపు నిధులను తీసుకోవచ్చు. ఈ ఫండ్స్‌ను హెూం రినోవేషన్ సహా వివిధ పనుల కోసం వాడుకోవచ్చు. లోన్ అగ్రిమెంటుపై సంతకం చేసే ముందు నిబంధనలను పూర్తిగా చదువుకోవాలి. వడ్డీ రేట్లు, రీపేమెంట్ షెడ్యూల్, ముందస్తు చెల్లింపు జరిమానాలు, ఏవైనా అదనపు ఛార్జీల సమాచారాన్ని తెలుసుకోవాలి.

### ఈ డాక్యుమెంట్స్ తప్పనిసరి

హెూం రినోవేషన్ లోన్‌కు అప్లై చేయాలంటే కొన్ని డాక్యుమెంట్స్ తప్పనిసరి. ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పత్రం, ఆదాయ రుజువు, ఆస్తి టైటిల్ డీడ్, గత ఆరు నెలల బ్యాంకు స్టేట్‌మెంట్, పునరుద్ధరణ పనికి సంబంధించిన ఇంజనీర్? అంచనాకు సంబంధించిన ప్రాథమిక డాక్యుమెంట్స్ సిద్ధం చేసుకోవాలి. ఇప్పటికే హెూం లోన్ తీసుకున్న వాళ్లకు ఈ డాక్యుమెంటేషన్ ప్రక్రియ చాలా ఈజీగా అయిపోతుంది. కొన్ని బ్యాంకులు పే స్లిప్ కూడా అడగవు. ఇంటి యజమాని ఇచ్చిన అంగీకార లేఖ సరిపోతుంది. స్వయం ఉపాధి పొందేవారు రుణాన్ని తిరిగి చెల్లించగలరని నిరూపించడానికి ఆదాయ రుజువులను చూపించాలి.

# వరుసగా ఐదో రోజు భారీ నష్టాలు సెన్సెక్స్? 984 పాయింట్స్ డౌన్?

23,600కు పడిపోయిన నిఫ్టీ భారీగా నష్టపోయిన ఆటో, బ్యాంకింగ్?, ఫైనాన్సింగ్ స్టాక్స్? దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా ఐదో రోజు భారీ నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు రావడం, విదేశీ సంస్థాగత పెట్టుబడులు భారీగా తరలివెళ్తుండడమే ఇందుకు కారణం. వీటికి తోడు అక్టోబర్?లో వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 6.21 శాతానికి పెరగడం కూడా మదుపరుల సెంటిమెంట్?ను దెబ్బతీసింది. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజీ సూచీ సెన్సెక్స్? 984 పాయింట్లు నష్టపోయి 77,690 వద్ద స్థిరపడింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజీ సూచీ నిఫ్టీ 324 పాయింట్లు కోల్పోయి 23,559 వద్ద ముగిసింది. లాభపడిన షేర్లు : టాటా మోటార్స్?, ఎన్?టీపీసీ, ఏసియన్ పెయింట్స్?, ఇన్ఫోసిస్? నష్టపోయిన షేర్లు : టాటా స్టీల్?, ఎం అండ్ ఎం, అదానీ పోర్ట్స్?, హెచ్?డీఎఫ్?సీ బ్యాంక్?, ఎస్?బీఐ, ఇండస్?ఇండ్? బ్యాంక్, కోటక్ బ్యాంక్?, యాక్సిస్ బ్యాంక్?, రిలయన్స్?, పవర్?గ్రిడ్?, టీసీఎస్

### విదేశీ పెట్టుబడులు

స్టాక్ ఎక్స్ఛేంజ్ డేటా ప్రకారం, మంగళవారం విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు ఏకంగా రూ.3,024.31 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను అమ్మేశారు.

### గ్లోబల్ మార్కెట్స్?

బుధవారం ఏసియన్ మార్కెట్లలో సియోల్?, టోక్యో, హాంకాంగ్ నష్టాలతో ముగియగా, షాంఘై లాభాలతో స్థిరపడింది. ప్రస్తుతం యూరోపియన్ మార్కెట్లు లాభాల్లో కొనసాగుతున్నాయి. మంగళవారం యూఎస్ మార్కెట్లు నష్టాలతో ముగిసిన విషయం తెలిసిందే.

### రూపాయి విలువ

అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి విలువ ఒక్క పైసా పెరిగింది. ప్రస్తుతం డాలర్?తో పోల్చితే రూపాయి మారకం విలువ రూ.84.38గా ఉంది.


### ముడిచమురు ధరలు

అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు 0.93 శాతం మేర పెరిగాయి. ప్రస్తుతం బ్యారెల్ క్రూడ్ ఆయిల్ ధర 72.56 డాలర్లుగా ఉంది.



### పెట్రోల్, డీజిల్?? ధరలు

తెలుగు రాష్ట్రాలైన ఏపీ, తెలంగాణలో పెట్రోల్?, డీజిల్? ధరలు స్థిరంగా ఉన్నాయి. హైదరాబాద్?లో లీటర్ పెట్రోల్? ధర రూ.107.39గా ఉంది. డీజిల్? ధర రూ.95.63గా ఉంది. విశాఖపట్నం?లో లీటర్ పెట్రోల్? ధర రూ.108.27గా ఉంది. డీజిల్? ధర రూ.96.16గా ఉంది. దిల్లీలో లీటర్? పెట్రోల్? ధర రూ.94.76గా ఉంటే, డీజిల్? ధర రూ.87.66గా ఉంది.



# జాక్.. సిద్ధు, వైష్ణవిల యాక్షన్ కామెడీ ఫిల్మ్ ఎలా ఉంది?

'బొమ్మరిల్లు' భాస్కర్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ కామెడీ ఫిల్మ్ 'జాక్'. వేసవి కానుకగా ఈ రోజు ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ ఎలా ఉంది? ఎలాంటి వినోదాన్ని పంచింది.




చిత్రం: జాక్బీ నటీనటులు: సిద్ధు జొన్నలగడ్డ, వైష్ణవి చైతన్య, ప్రకాశ్‌రాజ్, నరేశ్, రాజేశ్ ఖట్టర్, బ్రహ్మాజీ, వీటీవీ గణేశ్ తదితరులుబీ సంగీతం: అచ్చు రాజామణి, శ్యామ్ సీఎస్, సురేశ్ బొబ్బిలిబీ సినిమాటోగ్రఫీ: విజయ్ కె.చక్రవర్తిబీ ఎడిటింగ్: నవీన్ నూలిబీ నిర్మాత: బీవీఎస్ఎన్ ప్రసాద్బీ రచన, దర్శకత్వం: బొమ్మరిల్లు భాస్కర్బీ విడుదల: 10-04-2025 టిల్లు అంటే మనకు గుర్తొచ్చే పేరు సిద్ధు జొన్నలగడ్డ. జోష్‌కు మారుపేరైన ఆయన 'బొమ్మరిల్లు' భాస్కర్‌తో జట్టు కట్టి 'జాక్ - కొంచెం క్రాక్' అంటూ ఆశ్చర్యపరిచారు. 'బేబి' ఫేం వైష్ణవి చైతన్య కథానాయికగా నటించడంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. ఫీల్‌గుడ్ మూవీలకు కేరాఫ్ అడ్రస్ అయిన 'బొమ్మరిల్లు' భాస్కర్ ఎలాంటి ప్రభావం చూపించారు? సినిమా ఎలా ఉంది?

### కథేంటంటే..

పాబ్లో నెరుడా అలియాస్ జాక్ (సిద్ధు జొన్నలగడ్డ) చురుకైన నేటితరం యువకుడు. జీవితంలో ఏం చేసినా అందులో ఫన్ ఉండాలనేది సిద్ధాంతం. ఫన్ లేకుండా చేసే పని నరకంతో సమానమని నమ్ముతుంటాడు. అతని తత్వం నచ్చకపోవడంతో చాలా ఇంటర్వ్యూల్లో తిరస్కరణకి గురవుతాడు. అయినా సరే తన తీరుని మార్చుకోని జాక్... దేశాన్ని రక్షించడంలో ముందుండే 'రా' విభాగంలో చేరాలని ఇంటర్వ్యూకి వెళతాడు. అందులో ఎంపిక కాకముందే ఆపరేషన్ బటర్ ఫ్లై పేరుతో ఓ మిషన్ మొదలుపెడతాడు. తనలాగే 'రా' విభాగంలో చేరాలనుకున్న ఐపీఎస్ అధికారి రంగనాథ్‌తో కలిసి పొంచి ఉన్న ఉగ్ర ముప్పుని పసిగట్టి, వాళ్లని పట్టుకునేందుకు రంగంలోకి దిగుతాడు. మరి ఉగ్రవాదుల పన్నాగాన్ని జాక్ తిప్పికొట్టాడా?'రా'లో అతనికి ఉద్యోగం వచ్చిందా లేదా? మరోవైపు జాక్ ఏం చేస్తున్నాడో తెలుసుకునేందుకు అతడిని వెంటాడిన అఫ్షాన్ బేగం (వైష్ణవి చైతన్య) ఎవరు? ఆపరేషన్ రెడ్ థండర్ పేరుతో సాగిన మరో మిషన్ కథేమిటి? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవాల్సిందే!



### ఎలా ఉందంటే..

దేశానికి ముందుంటూ శత్రువుల కుట్రల నుంచి కంటికి రెప్పలా కాపాడేదే 'రా' (రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్) అంటూ ఆ విభాగం ఎంత కీలకమైందో ఈ సినిమాలో దర్శకుడు చెప్పాడు. అలాంటి కీలక విభాగం ఎంత పకడ్బందీగా పనిచేస్తుందో.. దేశభద్రత, ప్రతిష్టకి సంబంధించిన ఆ వ్యవహారాలు ఎంత సీరియస్‌గా సాగుతుంటాయో ఊహించుకోవచ్చు. అలాంటి నేపథ్యాన్ని 'ఫన్' కోణంలో ఆవిష్కరించాలని ఎవరైనా అనుకుంటారా? కానీ, ఆ అవసరం బలంగా పడినట్టుంది దర్శకుడు బొమ్మరిల్లు భాస్కర్‌కు. 'టిల్లు స్క్వేర్' తర్వాత సిద్ధు జొన్నలగడ్డ చేసిన చిత్రమిది. టిల్లులా ఫన్ పంచుతాడనే అంచనాలతో ప్రేక్షకులు వస్తే? ఆ అంచనాకి తగ్గట్టుగా హీరో అల్లరి చేయకపోతే ప్రేక్షకులు నిరుత్సాహపడతారేమోననే సందేహాలు బలంగా వెంటాడినట్టున్నాయి. అందుకే సన్నివేశాల్ని టిల్లు ఇమేజ్‌కు అనుగుణంగా మార్చేసి, 'రా' విభాగంలోకి తీసుకెళ్లి అల్లరి చేయించాడు. ఎదురుగా ఉన్నది ఉగ్రవాదులైనా, రా అధికారులైనా ఇంకెవరైనా సరే ఓ ఆట ఆడుకుంటూ ఉంటాడు జాక్. ఐపీఎస్‌గా పనిచేస్తున్న రంగా దగ్గరికి వెళ్లి 'నువ్వూ, నేను రా ఏజెంట్స్, మనం ఓ మిషన్‌లో భాగంగా పనిచేస్తున్నామని తన చుట్టూ తిప్పుకొంటాడు హీరో. పోనీ, ఇంతా చేసి కడుపుబ్బా నవ్వించారా అంటే అదీ లేదు. అటు 'రా' విభాగంలో కనిపించే సీరియస్‌నెస్ లేక, ఇటు జాక్ చేసిన అల్లరి టిల్లు తరహాలో ఫన్ పంచలేక... సినిమా రెంటికీ చెడ్డ రేవడిలా తయారైంది. జోక్ కాదు ఫన్ అనే ఓ మాట ఈ సినిమాలో ఓ చోట వినిపిస్తుంది. కానీ, 'రా' నేపథ్యాన్ని, రా ఏజెంట్స్‌ని చూపించిన తీరు చూస్తే ఇదంతా ఓ పెద్ద జోక్ అనిపించక మానదు. హీరో పాత్ర, ఫిలాసఫీ విషయంలో మాత్రం బొమ్మరిల్లు భాస్కర్ మార్క్ కనిపిస్తుంది. హీరో నేపథ్యం, తను ప్రారంభించిన ఆపరేషన్ బటర్ ఫ్లై మిషన్, హీరోయిన్‌తో కలిసి చేసే సందడి తదితర సన్నివేశాలతో ప్రథమార్ధం పర్వాలేదనిపించినా, ద్వితీయార్ధంలో విషయమేమీ లేదు. నేపాల్‌కి మారిన కథ ఏ దశలోనూ ఆసక్తిని రేకెత్తించదు. చాలా వరకూ సన్నివేశాలు ఊహకు అందేలా సాగుతుంటాయి. పతాక సన్నివేశాలు తేలిపోయాయి.

### యూట్యూబర్ కదా చేయలేదని తీసేశారు..

### వైష్ణవి చైతన్య ఎమోషనల్ వీడియో


ఎవరెలా చేశారంటే.. టిల్లు తరహాలోనే తెరపై హుషారుగా కనిపిస్తూ సందడి చేశాడు సిద్ధు జొన్నలగడ్డ. టిల్లు మార్క్ సంభాషణలు కూడా ఇందులో ఉంటాయి. అయితే తను చేసే ప్రతి సినిమాలోనూ టిల్లు కనిపించలేడనే విషయాన్ని ఆయన ఎంత త్వరగా గుర్తిస్తే అంత మేలని ఈ సినిమా చెప్పకనే చెబుతుంది. వైష్ణవి చైతన్య అందంగా కనిపించింది. అంతకుమించి ఆమె పాత్రలో చెప్పుకోదగ్గ విషయమేమీ లేదు. హీరోయిన్ పాత్రలపై భాస్కర్ మార్క్ ప్రత్యేకంగా ఉంటుంది. కానీ, ఈ సినిమాలో ఆ ప్రభావమేమీ కనిపించదు. రా అధికారి మనోజ్ పాత్రలో ప్రకాష్‌రాజ్ కనిపిస్తారు. ఆ పాత్రలో బలం లేదు. నరేష్, సుబ్బరాజు తదితరులు అలవాటైన పాత్రల్లోనే కనిపిస్తారు. సాంకేతిక విభాగాల్లో కెమెరా పనితనం మెప్పిస్తుంది. నేపథ్య సంగీతం ఆకట్టుకుంటుంది. పాటలు పెద్దగా ప్రభావం చూపించవు. దర్శకుడు భాస్కర్ తన శైలిని పక్కనపెట్టి, హీో ఇమేజ్‌కి లొంగి స్క్రిప్ట్ రాసుకుని కథ చెప్పినట్టు అనిపిస్తుంది. నిర్మాణం పర్వాలేదు. బలాలుజి సిద్ధు నటన ం అక్కడక్కడా ఫన్ బలహీనతలుజి - కథ, కథనం - నాయకానాయికల మధ్య కెమిస్ట్రీ బలం లేని దర్శకత్వం చివరిగా: జాక్... కొంచెం కాదు, చాలా క్రాక్ %గమనిక: ఈ సమీక్ష సమీక్షకుడి దృష్టికోణానికి సంబంధించింది. ఇది సమీక్షకుడి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే!

# టుక్ టుక్.. స్కూటర్‌లో ఉంది దేవుడా?

హర్ష్‌రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, శాన్వీ మేఘన ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'టుక్ టుక్'. ఓటీటీ 'ఈటీవీ విన్'లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ సినిమా ఎలా ఉందంటే?



కమర్షియల్ హంగుల జోలికి పోకుండా విభిన్న కథలను ప్రేక్షకులకు పరిచయం చేస్తున్నారు చాలామంది వర్ధమాన దర్శక, రచయితలు. సుప్రీత్ సి. కృష్ణ తెరకెక్కించిన 'టుక్ టుక్' సినిమా ఆ కోవకు చెందిందే. ఆటోని పోలి ఉండే మ్యాజికల్ పవర్స్ ఉన్న స్కూటర్ ఇతివృత్తంగా రూపొందిన ఆ మూవీ ఓటీటీ 'ఈటీవీ విన్' లో స్ట్రీమింగ్ అవుతోంది. మరి, ఆ స్కూటర్ ప్రయాణం ఎలా సాగిందంటే? చిత్తూరు జిల్లాలోని ఓ పల్లెటూరికి చెందిన ముగ్గురు టీనేజర్లు మంచి స్నేహితులు. షార్ట్‌ఫిల్మ్ తీయాలని ఓ రోజు నిర్ణయించుకుంటారు. అయితే, కెమెరా కొనేందుకు డబ్బు ఉండదు. ఓ పెద్దాయన సలహాతో గ్రామంలో వినాయకచవితి వేడుకలు నిర్వహించేందుకు సిద్ధపడతారు. గ్రామస్థులు ఇచ్చే చందాతో కెమెరా కొనాలనేది వారి ఆశ. అంతా బాగానే ఉన్నా విగ్రహ ఊరేగింపునకు ఏ వాహనం దొరకని పరిస్థితి. అప్పుడే ఆ స్నేహితుల్లోకి ఒకరికి ఓ పాత స్కూటర్ గుర్తొస్తుంది. దాన్ని రిపేర్ చేయించి, ఆటోలా మార్చి వినాయకుడి విగ్రహాన్ని గంగ వద్దకు సాగనంపుతారు. తర్వాత, ఆ స్కూటర్‌కు పవర్స్ ఉన్నాయని తెలిసి భయానికి లోనవుతారు. అసలు స్కూటర్ ఎవరిది? ఆ స్నేహితులు నమ్మినట్టు అందులో ఆత్మ ఉందా? గ్రామస్థులు అనుకున్నట్టు దేవుడు ఉన్నాడా? స్కూల్ టీచర్ శిల్పకు, ఆ మిత్రులకు సంబంధమేంటి? సినిమా చూసి తెలుసుకోవాల్సిందే. వాహనం ప్రధానంగా సాగే కథతో ఇప్పటికే పలు సినిమాలొచ్చాయి. 'టుక్ టుక్' కూడా అలాంటిదే. ముగ్గురు స్నేహితులు, స్కూల్ టీచర్ జీవితాన్ని స్కూటర్ ఎలా ప్రభావితం చేసిందన్నది ఇందులో కీలకాంశం. ముగ్గురు టీనేజర్ల పరిచయం, వారు చేసే అల్లరి ప్రేక్షకుడిని తన గతంలోకి తీసుకెళ్లేలా చేస్తాయి. అయితే, అసలు కథలోకి వెళ్లేందుకు దర్శకుడు చాలా సమయం తీసుకున్నారు. స్కూటర్‌లో ఉన్నది దేవుడా? దెయ్యమా? అన్నది తెలుసుకునే క్రమంలో ఆ మిత్రులు చేసే హంగామా నవ్వులు పంచుతుంది. అదే ఎపిసోడ్‌తో.. దేవుడి పేరు చెప్పి ప్రజలను కొందరు ఎలా మోసం చేస్తున్నారన్నది చూపించే ప్రయత్నం చేశారు దర్శకుడు. స్కూటర్ మ్యాజికల్ పవర్స్ వెనుక ఉన్నదేంటో తెలిసినా.. అలా చేయడానికి కారణమేంటన్నది స్పష్టంగా చెప్పకపోవడం ప్రేక్షకుడికి కాస్త అసంతృప్తే. ప్రథమార్థాన్ని కామెడీ, కొన్ని హారర్ ఎలిమెంట్స్‌తో నడిపించిన దర్శకుడు ద్వితీయార్ధంలో శిల్ప- నవీన్‌ల ప్రేమకథకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. వీరి స్టోరీ గురించి తెలుసుకున్న ముగ్గురు స్నేహితుల్లో వచ్చిన మార్పును చక్కగా చూపించారు. ఏదైనా ఘటన జరిగితే ఎక్కువ మంది చెప్పిందే నిజమని నమ్మడం వల్ల కొందరి జీవితాలు ఎలా మలుపు తిరుగుతాయో శిల్ప పాత్ర ద్వారా తెలియజేసే ప్రయత్నం చేశారు. ఆమెకు ఎదురైన పరిణామాల నేపథ్యంతో.. సన్నివేశాలను ఇంకా ఉత్కంఠ భరితంగా చూపించి ఉంటే బాగుండేది. ఆమెతోపాటు నవీన్ పాత్రకూ సరైన ముగింపు ఇవ్వలేదు. క్లైమాక్స్ ఊహకు తగ్గట్టే ఉంటుంది. స్నేహితులుగా హర్ష్‌రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు ఆకట్టుకుంటారు. శిల్ప పాత్రలో శాన్వీ మేఘన ఒదిగిపోయారు. ఆమెను ప్రేమించిన నవీన్ పాత్రలో నిహాల్ కోదాటి ఫర్వాలేదనిపిస్తారు. ఎలాంటి అసభ్యకర సన్నివేశాలు లేవు. కుటుంబంతో కలిసి చూడొచ్చు. పల్లెటూరి వాతావరణం ఉట్టిపడే ఈ సినిమా నిడివి 2:10 గంటలు.



# విధ్వంసకర నేలపైకి...

వచ్చే ఏడాది అత్యంత ప్రతిష్ఠాత్మకమైన చిత్రాలు తెలుగు ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. అందులో ఒకటి ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ కలయికలో రూపొందుతున్న చిత్రం. వచ్చే ఏడాది అత్యంత ప్రతిష్ఠాత్మకమైన చిత్రాలు తెలుగు ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. అందులో ఒకటి ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ కలయికలో రూపొందుతున్న చిత్రం. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ నిర్మిస్తోన్న ఈ సినిమా గురించి ఓ కీలకమైన విషయాన్ని పంచుకుంది చిత్రబృందం. విధ్వంసకర నేలపైకి అడుగు పెడుతున్నారంటూ ఈ నెల 22 నుంచి ఎన్టీఆర్ (%చీ=%) ఈ సినిమా సెట్లోకి రానున్న సంగతిని బయట పెట్టింది. వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా చిత్రీకరణ చాలా రోజుల కిందటే ప్రారంభమైంది. ఎన్టీఆర్ లేకుండా, ఇతర తారాగణంపై ప్రశాంత్ నీల్ కొన్ని సన్నివేశాల్ని చిత్రీకరించారు. ఇక ఎన్టీఆర్ అడుగు పెట్టారంటే చిత్రీకరణ మరింతగా ఊపందుకుంటుంది. ఈ సినిమా కోసం ఎన్టీఆర్ ప్రత్యేకంగా సన్నద్ధమయ్యారు. బరువు తగ్గి బాగా





నాజూగ్గా కనిపిస్తున్నారు. 'దేవర' తర్వాత ఎన్టీఆర్... 'సలార్' తర్వాత ప్రశాంత్ నీల్ కలిసి చేస్తున్న చిత్రమిది. లిటిల్ వారియర్... ధైర్యంగా ఉండు: సింగపూర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో మార్క్ శంకర్ గాయపడటంపై విచారం వ్యక్తం చేశారు అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్. ఈ సంఘటన గురించి తెలిసి ఎంతో బాధపడ్డానని, తను త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్టుగా ఎక్స్ ద్వారా ఓ పోస్ట్‌ని పంచుకున్నారు. లిటిల్ వారియర్, ధైర్యంగా ఉండు... అంటూ మార్క్‌ని ఉద్దేశించి వ్యాఖ్య చేశారు ఎన్టీఆర్. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, ప్రముఖ కథానాయకుడు పవన్‌కల్యాణ్ చిన్న కుమారుడైన మార్క్ శంకర్ సమ్మర్ క్యాంప్‌లో భాగంగా సింగపూర్‌లోని ఓ పాఠశాలలో చేరగా, అందులో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మంగళవారం పవన్‌కల్యాణ్‌తోపాటు, చిరంజీవి దంపతులు సింగపూర్ బయల్దేరి వెళ్లారు.

# మరో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లో 'మనమే'

హైదరాబాద్: శర్వానంద్, కృతిశెట్టి జంటగా నటించిన చిత్రం 'మనమే' శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహించారు. రొమాంటిక్ కామెడీ డ్రామాగా రూపొందిన ఈ సినిమా గతేడాది జూన్‌లో విడుదలై మిశ్రమ స్పందనలకే పరిమితమైంది. ప్రస్తుతం ఇది అమెజాన్ ప్రైమ్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోన్న విషయం తెలిసిందే. త్వరలో ఈ సినిమా ఆహా వేదికగా ప్రేక్షకులకు అందుబాటులో ఉండనుంది. ఇదే విషయాన్ని సదరు ఓటీటీ సంస్థ తెలియజేసింది. ఏప్రిల్ 11 నుంచి తమ ప్లాట్‌ఫామ్ వేదికగా ఈ సినిమాను వీక్షించవచ్చు అని చెప్పింది.

### స్టార్ హీరో సినిమా.. రిలీజైనట్లు కూడా తెలియదు: గౌతమ్ మేనన్ అసహనం



కథేంటంటే: లండన్‌లో మాస్టర్స్ పూర్తిచేసి ఖాళీగా ఉంటూ జీవితాన్ని జల్సాగా గడిపేస్తుంటాడు విక్రమ్ (శర్వానంద్). అనాథైన తన మిత్రుడు అనురాగ్ (త్రిగుణ్)ను చిన్నప్పటినుంచి అన్నీ తానై చూసుకుంటాడు. ఓరోజు జరిగిన ప్రమాదంలో అనురాగ్, అతని భార్య శాంతి మరణిస్తారు. దీంతో అనాథగా మిగిలిన వాళ్ల కొడుకు ఖుషి (విక్రమ్ ఆదిత్య) సంరక్షణ బాధ్యత శాంతి స్నేహితురాలు సుభద్ర (కృతి శెట్టి)తో కలిసి విక్రమ్ తీసుకోవాల్సి వస్తుంది. అలా వాళ్లిద్దరూ పెళ్లి కాకున్నా ఖుషి కోసం తల్లిదండ్రులుగా ఆ బాధ్యతలు భుజానికెత్తుకుంటారు. ఆ బాబును పెంచే విషయంలో విక్రమ్, సుభద్రలకు ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి? ఇద్దరి మధ్య ఎన్ని గొడవలు జరిగాయి? పెళ్లికి ముందే వేరే కుర్రాడితో కలిసి ఓ చిన్నారి సంరక్షణ బాధ్యతలు తీసుకున్నందుకు సుభద్రకు కాబోయే భర్త కార్తీక్ (శివ కందుకూరి) ఎలా స్పందించాడు? ఖుషిని పెంచే క్రమంలో విక్రమ్ తనని తాను ఎలా మార్చుకున్నాడు? అనే అంశాలతో ఈ సినిమా సిద్ధమైంది.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,